
మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం


PRAJAPAKSHAM ★

మహబూబ్‌నగర్‌లో మూడురోజుల రైతు సదస్సు
నీలోఫర్ ఆసుపత్రిలో పసికందు కిడ్నాప్
'ఉపాధి' నిర్వీర్యం కుట్రను భగ్నం చేద్దాం
లోపలి పేజీల్లో

సంపుటి 27, సంచిక: 158 | ఆదివారం | 24-11-2024 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00

# అధికార కూటములదే హవా

## మహారాష్ట్రలో 'మహాయుతి' ఘన విజయం – జార్ఖండ్‌లో జెఎంఎం కూటమి విజయ దుందుభి




మహారాష్ట్ర

| పార్టీ | ఎన్నికలకు ముందు | 2024 |
|---|---|---|
| **ఎన్‌డిఎ కూటమి** | **202** | **230** |
| **భాగస్వాములు:** | | |
| బిజెపి | 102 | 132 |
| శివసేన (షిండే) | 38 | 57 |
| ఎన్‌సిపి (అజిత్) | 40 | 41 |
| బివిఎ | 3 | – |
| పిహెచ్‌జెఎస్‌పి | 2 | – |
| ఆర్‌ఎస్‌పి | 1 | – |
| జెఎస్‌ఎస్ | 1 | – |
| ఎంఎన్‌ఎస్ | 1 | – |
| ఎంఐఎం | 1 | 1 |
| **స్వతంత్రులు:** | | |
| ఇతరులు | 14 | 11 |
| **ఎంవిఎ** | **69** | **46** |
| కాంగ్రెస్ | 37 | 16 |
| శివసేన (థాక్రే) | 16 | 20 |
| ఎన్‌సిపి (శరద్) | 12 | 10 |



అభివృద్ధి, సుపరిపాలన గెలిచింది : ప్రధాని



మహారాష్ట్ర ఫలితాలు అనూహ్యం : రాహుల్, ఖర్గే

**ముంబయి/రాంచీ :** ఝార్ఖండ్, మహారాష్ట్ర అసెంబ్లీల ఎన్నికల ఫలితాల్లో అధికారపార్టీలే తిరిగి విజయం సాధించాయి. ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో జెఎంఎం సారథ్యంలోని 'ఇండియా' కూటమి పార్టీలు విజయం సాధించాయి. దీంతో హేమంత్ సోరెన్ రెండోసారి ముఖ్యమంత్రి పదవి అధిష్టించేందుకు రంగం సిద్ధమైంది. కానీ మహారాష్ట్రలో షిండే, అజిత్‌పవార్ సారథ్యంలో 'మహాయుతి' కూటమి సాధించిన చారిత్రక ఘన విజయంతో అందరూ అవాక్కయ్యారు. ఇందులో ఏదో పెద్ద కుట్ర ఉందనీ, ఈ విజయం ఎందుకో సందేహాస్పదంగా ఉందనీ శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. ఝార్ఖండ్ అసెంబ్లీలో మొత్తం 81 స్థానాలు ఉండగా ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం) సారథ్యంలోని కూటమి పార్టీలు 56 స్థానాలు గెలుచుకున్నాయి. ఎన్‌డిఎ కూటమికి చెందిన పార్టీలు 24 స్థానాలు గెలిచాయి. జెఎల్‌కెఎం పార్టీ ఒకస్థానం గెలుచుకుంది. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు చెందిన జెఎంఎం పార్టీ 35 స్థానాల్లో విజయం సాధించింది. కాంగ్రెస్‌పార్టీ 16 స్థానాలు గెలుచుకుంది. ఆర్‌జెడి నాలుగు స్థానాలు, సిపిఐ–ఎంఎల్ ఒక నియోజకవర్గాన్ని దక్కించుకున్నాయని ఎన్నికల సంఘం వెబ్‌సైట్ తెలియజేసింది. ఇక మహారాష్ట్ర అసెంబ్లీకి చెందిన 288 నియోజకవర్గాలలో ఎన్నికలు జరిగాయి. ఇందులో 234 స్థానాలను ఎన్‌డిఎకు చెందిన మహారాష్ట్ర మహాయుతి కూటమి గెలుచుకోగా, 'ఇండియా' కూటమి పార్టీలు 50 స్థానాలు, ఇతరులు నాలుగు స్థానాలు గెలుచుకున్నారు. మహావికాస్ అఘాడీ (ఎంవిఎ)లో కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి (శరద్‌పవార్)లు భాగస్వాములుగా ఉన్నాయి. మహారాష్ట్రలో బిజెపి 132 స్థానాలు గెలుచుకుంది. షిండేకు చెందిన శివసేన 57 స్థానాలు, ఎన్‌సిపి (అజిత్‌పవార్) 41 స్థానాలు గెలుచుకున్నాయి. కాగా మహావికాస్ అఘాడీ కూటమిలో కాంగ్రెస్ 16 స్థానాలు, శివసేన (యుబిటి) 20 స్థానాలు, ఎన్‌సిపి (శరద్‌పవార్) 10 స్థానాలూ గెలుచుకున్నాయి.
అక్రమధనాన్ని లెక్కల్లో చూపించకుండా తరలించారన్న ఆరోపణలపై కేంద్ర దర్యాప్తు సంస్థ హేమంత్ సోరెన్‌ను గడచిన జులైలో అరెస్టుచేసి జైలుకు తరలించిన తర్వాత ఆయన విడుదలై ముఖ్యమంత్రి పదవి చేపట్టి ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేశారు. కేంద్ర ప్రభుత్వం కుయుక్తులు పారకపోగా, ప్రజలు మళ్ళీ జెఎంఎం సారథ్యంలోని కూటమికే పట్టం కట్టారు. ఝార్ఖండ్‌లో అపారంగా ఉన్న ఖనిజ సంపదపై వచ్చే ఆదాయాన్ని రాష్ట్ర ప్రజలకోసమే ఖర్చు చేసేందుకు కేంద్రంపై పోరాటం చేస్తానని ఆయన వాగ్దానం చేశారు. కాగా, కీలకమైన దేశ ఆర్థిక రాజధాని మహారాష్ట్ర అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఎన్‌డిఎకు చెందిన మహాయుతి కూటమి

తరువాయి 2లో



జెఎంఎం కూటమి 56

జార్ఖండ్

| పార్టీ | 2019 | 2024 |
|---|---|---|
| **జెఎంఎం కూటమి** | **47** | **56** |
| **భాగస్వాములు:** | | |
| జెఎంఎం | 30 | 34 |
| కాంగ్రెస్ | 16 | 16 |
| ఆర్‌జెడి | 1 | 4 |
| సిపిఐ (ఎంఎల్)ఎల్ | – | 2 |
| **ఎన్‌డిఎ కూటమి** | **30** | |
| **భాగస్వాములు:** | | |
| బిజెపి+ | 25 | 24 |
| వికాస్‌మోర్చా | 3 | – |
| ఎజె. స్టూడెంట్స్ యూనియన్ | 2 | – |
| ఇతరులు | 0 | 1 |

## ఖర్చు, రుణాలు పెరగడం వల్లే తగ్గిన దిగుబడి

వ్యవసాయ దుస్థితిపై సుప్రీం నియామక కమిటీ మధ్యంతర నివేదిక



**న్యూఢిల్లీ :** రైతుల ఫిర్యాదులు, సూచనలపై సుప్రీంకోర్టు నియమించిన ప్యానెల్ తన మధ్యంతర నివేదికను దాఖలు చేసింది. వ్యవసాయ సంక్షోభానికి కారణాలను లిస్టింగ్ చేసింది. వాటిలో దిగుబడి. నానాటికి పెరిగిపోతున్న ఖర్చులు, అప్పులు, సరిపోని మార్కెటింగ్ వ్యవస్థ ఉన్నాయి. శంభు సరిహద్దు వద్ద ఆందోళనలు చేస్తున్న రైతుల మనోవేదనలను పరిష్కరించడానికి పంజాబ్ , హర్యానా హైకోర్టు మాజీ న్యాయమూర్తి నవాబ్‌సింగ్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 2న ఏర్పాటైన అధికార కమిటీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించే సాధ్యాసాధ్యాలను పరిశీలించింది. నేరుగా అందించే పరిష్కార మార్గాలను కూడా సూచించింది. ఆదాయ మద్దతు కమిటీని ఏర్పాటు చేస్తున్నప్పుడు రైతుల నిరసనను రాజకీయం చేయవద్దని సుప్రీంకోర్టు గమనించింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భూయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారంనాడు మధ్యంతర నివేదికను రికార్డుచేసింది. పరిశీలించాల్సిన అంశాలను రూపొందించినందుకు, ఆందోళనను తగ్గించడానికి కమిటీ చేసిన కృషిని ప్రశంసించింది.కమిటీ తన 11పేజీల మధ్యంతర నివేదికలో 'దేశంలో సాధారణంగా, ముఖ్యంగా పంజాబ్, హర్యానా రాష్ట్రాలలోని రైతు సమాజం గత కొంతకాలంగా తీవ్రమవుతోన్న సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అందరికీ తెలిసిన విషయమే. 1990మధ్య నుండి దిగుబడి, ఉత్పత్తి వృద్ధిలో స్తబ్ధత, హరిత విప్లవం ప్రారంభంలో అధికలాభాల అనంతరం సంక్షోభానికి నాంది పలికింది'

తరువాయి 12లో



కొండపోచమ్మ, మల్లన్నసాగర్ నుంచి

## హైదరాబాద్‌కు తాగునీరు

తరలింపుపై సమగ్ర నివేదిక తయారుచేయండి

అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం

ప్రజాపక్షం/హైదరాబాద్

కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నుంచి హైదరాబాద్‌కు నీటి తరలింపుపై సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌కు తాగునీటి అవసరాల కోసం 20 టిఎంసిల గోదావరి జలాల తరలింపుపై సిఎం రేవంత్ రెడ్డి నీటిపారుదల, జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల్లో నీటి లభ్యత, హైదరాబాద్ తరలింపునకు ఎంత

తరువాయి 2లో

## ఫార్మా కంపెనీ వద్దు

ఆ ప్రతిపాదనను విరమించుకోవాలి



● లగచర్ల గ్రామంలో రైతులపై నిర్బంధకాండ నిలిపి వేయాలి ● పోలీస్ క్యాంపులు ఎత్తి వేయాలి ● రైతులపై పెట్టిన అక్రమ కేసులు ఉపసంహరించుకోవాలి ● సిఎం రేవంత్‌రెడ్డికి వామపక్షాల ప్రతినిధి బృందం విజ్ఞప్తి

ప్రజాపక్షం / హైదరాబాద్

లగచర్ల ఫార్మా పరిధిలోని నాలుగు గ్రామాల్లోని రైతులపై నిర్బంధకాండను నిలిపి వేయాలని, పోలీస్ క్యాంపులను ఎత్తి వేయాలని, రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని, జైలులో ఉన్న రైతులను బేషరతుగా విడుదల చేయాలని వామపక్ష పార్టీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరాయి. లగచర్ల ఘటనపై సమగ్ర జుడీషియల్ విచారణ జరపాలని, దోషులను గుర్తించి చర్యలు తీసుకోవాలని, అమాయకులను వదిలివేయాలని వామపక్షాలు విజ్ఞప్తి చేశాయి. రైతుల అనుమతి లేకుండా బలవంతపు భూసేకరణ చేయవద్దని, వ్యవసాయానికి ఉపయోగపడే వ్యవసాయ భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటును విరమించుకోవాలని వామపక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలంలోని లగచర్లలో ఫార్మా సిటీ పేరుతో భూసేకరణ

తరువాయి 2లో

ఫార్మా సిటీ కాదు...

### ఇండస్ట్రియల్ కారిడార్

సిఎం స్పష్టీకరణ

కొడంగల్‌లో ఏర్పాటు చేసేది ఫార్మా సిటీ కాదని, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. లగచర్ల దాడికి కుట్ర చేసిన వారిని వదిలిపెట్టబోమని, అమాయక రైతులపై కేసుల విషయంలో పరిశీలిస్తామని సిఎం చెప్పారు. కొడంగల్ నియోజకవర్గంలో యువత, మహిళలకు ఉపాధి కల్పించడమే తన ఉద్దేశమని, కొడంగల్ ఎంఎల్‌ఎగా నియోజకవర్గ అభివృద్ధి తన భాధ్యత అని ముఖ్యమంత్రి చెప్పారు. వామపక్షాల నాయకులు తెలిపిన విషయాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందిస్తూ సొంత నియోజకవర్గ ప్రజలను తానెందుకు ఇబ్బంది పెడతానని, కాలుష్యరహిత పరిశ్రమలే ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. భూసేకరణ పరిహారం పెంపును పరిశీలిస్తామని సిఎం వామపక్ష నేతలకు హామీ ఇచ్చారు.

## మహాలక్ష్మీ పథకంతో లాభాల్లోకి ఆర్‌టిసి

94 శాతానికి పెరిగిన ఆక్యుపెన్సీ

రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రజాపక్షం/హైదరాబాద్

మహాలక్ష్మి పథకంతో గతంలో నష్టాల్లో ఉన్న ఆర్‌టిసి లాభాల్లోకి వెళ్లిందని, రాష్ట్ర ప్రజా రవాణా వ్యవస్థకు ఇది శుభసూచకమని రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లోని రవాణా శాఖ ప్రధాన కార్యాలయంలో శనివారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టిజిఎస్ ఆర్‌టిసి) పనితీరుపై మంత్రి ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో

తరువాయి 12లో



'మహిళా రిజర్వేషన్'ను అమలు చేయకుండా

## మోదీ ప్రభుత్వం కుట్ర

ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సదస్సులో వక్తల ఆగ్రహం

మహిళా రిజర్వేషన్ కోసం ఇంకెంత కాలం ఎదురుచూడాలి?

ప్రజాపక్షం/హైదరాబాద్

అనేక కుంటిసాకులతో 'మహిళా రిజర్వేషన్'ను అమలు చేయకుండా ప్రధాని మోదీ ప్రభుత్వం కుట్రకు పాల్పడుతోందని పలువురు వక్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలు కోసం ఇంకేంత కాలం వేచిచూడాలని కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని వారు నిలదీశారు. దేశవ్యాప్త జనగణన నియోజకవర్గాల పునర్ విభజనతో ముడిపెట్టకుండా మహిళా రిజర్వేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమాఖ్య (ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు) 22వ నిర్మాణ జాతీయ మహాసభల సందర్భంగా "తెలంగాణ రాష్ట్ర మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో "మహిళా రిజర్వేషన్ చట్టం 2023"ను జనాభా లెక్కలు, నియోజకవర్గ పునర్విభజనకు సంబంధం లేకుండా వెంటనే అమలు చేయాలి" అనే అంశంపై రాష్ట్ర సదస్సు శనివారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. తెలంగాణ

తరువాయి 2లో

### జనగణన ఎప్పుడు పూర్తవ్వాలి ?

మహిళా రిజర్వేషన్లు ఎప్పుడు అమలవ్వాలి: పశ్యపద్మ

మహిళా రిజర్వేషన్ల బిల్లు రానున్న 2029 ఎన్నికల్లో అమలయ్యే విధంగా మహిళలంతా దృష్టి కేంద్రీకరించాలని ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యు సీనియర్ నాయకులు పశ్యపద్మ అన్నారు. దేశంలో జనగణన ఎప్పుడు జరగాలి, ఆ ప్రక్రియ ఎప్పుడు పూర్తవ్వాలి?, ఆ తర్వాత ఇంకెప్పుడు మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తారు ?

తరువాయి 2లో

## బాల్యం బందీ

నాలుగు గోడల మధ్యే ప్రపంచం

సెల్‌ఫోన్, టివిలే స్నేహితులు

ఆటపాటలకు దూరం

తగ్గిన శారీరక.. మానసిక దృఢత్వం



ప్రజాపక్షం/ఖమ్మం

బాల్యం ఓ మధుర జ్ఞాపకం. బాదర బంధీలేని జీవితం ఆటపాటలతో ఎంతో ఉల్లాసంగా గడిచిపోయింది, ఇదంతా ఒకప్పుడు. ఇప్పుడు బాల్యం నాలుగు గోడల మధ్య బంధీ అవుతోంది. మారిన జీవన పద్దతులు అప్పుడే ఏదో సాధించేయాలన్న ఆశలు బాల్యాన్ని తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయి. ఒకప్పుడు ఉదయం

తరువాయి 12లో

# గాజాలో ఊచకోత,ఆకలి చావులకు నేతన్యాహూ–గాలంట్ కారకులు

## అరెస్టు వారెంట్ అమలు బాధ్యత ఐసిసి సభ్యదేశాలదే


## అంతర్జాతీయకోర్టు ధర్మాసనం ఏకగ్రీవ తీర్మానం





**నోట్టింగ్‌హాం :** గాజాలో 13 నెలలుగా కొనసాగుతున్న సామూహిక హత్యాకాండ, ఊచకోతలు, ఆకలి చావులకు ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నేతన్యాహూ, మొన్నటివరకూ రక్షణమంత్రిగా పనిచేసిన యోవ్ గాలంట్ ఇద్దరూ సమాన బాధ్యులని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసిసి) త్రిసభ్య ధర్మాసనం ఏకగ్రీవంగా ప్రకటించింది. ఈ మేరకు వారికి అధికారికంగా శనివారం నాడు అరెస్టు వారెంట్లు జారీ చేసింది. ఒకవేళ నేతన్యాహూను అరెస్టు చేస్తే ఆయనపై విచారణ జరుగుతుంది. ఆయనకు శిక్ష పడుతుంది. ఈ విధంగా అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఇప్పటికే రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతన్‌కు కూడా అరెస్టు వారెంటు జారీ చేసింది. ఈ విధంగా అరెస్టు వారెంట్లు మోసే నాయకులను అరెస్టు చేసే బాధ్యత ఐసిసి సభ్యదేశాలదే. కానీ పుతిన్ ఈ మధ్య మంగోలియాలో పర్యటించినప్పటికీ ఆ దేశ ప్రభుత్వం పుతిన్‌ను అరెస్టు చేయలేదు. కాగా ఈ విధంగా అరెస్టు వారెంటు పొందిన మొదటి వెస్టర్న్ దేశ నాయకుడు నేతన్యాహూ. ఐతే అరెస్టుకు సంబంధించి అనేక చిక్కులు ఉన్నాయి. ఆయన ఎక్కువగా ఇతర దేశాల్లో పర్యటించదంలేదు. ఇందులో ఎన్నో నాటకీయ పరిణామాలకు కూడా అవకాశం ఉంది. తన రాజకీయ నిర్ణయాల కారణంగా ఐసిసి ఎప్పటికైనా చర్యలు తీసుకుంటుందని, తనను బాధ్యుణ్ణి చేస్తుందని నేతన్యాహూకు ముందుగానే తెలుసు. కానీ ఈ అరెస్టు వారెంటువల్ల నేతన్యాహూ తన స్వదేశంలో ప్రజల్లో పాపులారిటీ కోల్పోయే అవకాశం ఉంది. పాలస్తినాకు అనుకూలంగా అమెరికాలోని 500 కాలేజీలలో గత ఏడాది కాలంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఎక్కువ యూరప్ దేశాలు కూడా నేతన్యాహూను అరెస్టు చేయాలనే కోరుకుంటున్నాయి. కానీ అమెరికా వ్యతిరేకిస్తున్నందువల్ల ఆ దేశం యూరప్‌లో ఏకాకిగా మారిపోయింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారని ఇప్పటికే అనేకమంది నాయకులకు చరిత్రలో ఐసిసి వారెంట్లు జారీ చేసింది. లైబీరియా నాయకుడు ఛార్లెస్, ఛాడ్ దేశ నాయకుడు హిస్సేన్ హబ్రే, ఇరాక్ నియంత సద్దాం హుస్సేన్, చిలీ నేత ఆగస్టో పినోచెట్, సెర్బియా నాయకుడు స్లోబోడన్ మిలోసెవిక్, సెర్బియా నాయకుడు రాడోవన్ కరడ్జిక్, ఉగాండా నాయకుడు ఈది అమిన్, కాంబోడియా అధినేత పోల్‌పాట్, సోవియట్ యూనియన్ మాజీ నాయకుడు జోసెఫ్ స్టాలిన్, చైనా నేత మావో జెడాంగ్, జర్మనీ నయంత అడాల్ఫ్ హిట్లర్లను మానవ వ్యవస్థకు, మానవతా వాదానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడవనట్లుగా పరిగణించారు. అదేవిధంగా హమాస్ ఉగ్రవాద సంస్థ మిలిటరీ విభాగాధిపతి మహ్మద్ డైఫ్‌కు కూడా అరెస్టు వారెంటు జారీ చేసింది. ఐతే డైఫ్‌ను యుద్ధంలో గగనతల దాడులద్వారా ఈ ఏడాది జులై నెలలో హతమార్చామని ఇజ్రాయెల్ అధికారికంగా ప్రకటించినప్పటికీ డైఫ్‌కు ఈ అరెస్టు వారెంటు జారీ అయ్యింది. ఒక వేళ డైఫ్ గాయపడి చికిత్స పొందుతున్నా కూడా అతడు శిక్షార్హుడేనని ప్రకటించింది. డైఫ్ మరణించినట్లు హమాస్ ధృవీకరించలేదు. గత ఏడాది అక్టోబరు నుండి ఈ ఏడాది మే నెల వరకూ గాజాలో జరిగిన దాడులు, హత్యలు, ప్రజలు ఆకలితో మల మల మాడిపోవడం, అంటురోగాలతో మరణించడం, ఆసుపత్రి సేవలు అందుబాటులో ఏకపోవడం, వలసలు వంటివన్నింటినీ మానవతా వ్యతిరేక చర్యలుగా పరిగణిస్తున్నట్లు అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ధర్మాసనం ప్రకటించింది. నేతన్యాహూ, గాలంట్ ఇద్దరూ యుద్ధ నేరాలకు పాల్పడ్డారని, ఇది ప్రపంచంలో అతి తీవ్రమైన నేరమని ధర్మాసనం పేర్కొంది.

# గాజా,బీరూట్‌లలో ఇజ్రాయెల్ దాడులు

## 23 మంది మృతి





**బీరూట్ :** అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు ఒకవైపు నేతన్యాహూపై అరెస్టు వారెంటు జారీచేసి యుద్ధ నేరస్థుడిగా ప్రకటించినప్పటికీ ఆయన లక్ష్యపెట్టకుండా గాజా, లెబనాన్‌లలో దాడులు కొనసాగిస్తూనే ఉన్నారు. గాజాలో శనివారంనాడు ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడిఎఫ్) చేసిన దాడుల్లో 19 మంది మరణించారు. బీరూట్‌లో జరిపిన దాడుల్లో మరో నలుగురు మరణించారు.మరో 23 మంది గాయపడ్డారు. ఐతే గాజాలో పౌర రక్షణ దళ అధికార ప్రతినిధి సమాచారం ప్రకారం ఈ దాడుల్లో మరో 40 మంది గాయపడ్డారు. శుక్రవారం అర్థరాత్రి దాటిన తర్వాత నుండీ శనివారం ఉదయం తర్వాత వరకూ గాజా స్ట్రిప్‌లో ఐడిఎఫ్ గగనతల దాడులు కొనసాగించింది. బాస్తా ఏరియాలో ప్రజలకు ఎలాంటి ముందస్తు హెచ్చరికలూ లేకుండానే ఐడిఎఫ్ విచక్షణా రహితంగా దాడులు కొనసాగించిందని లెబనాన్ ఆరోగ్యశాఖ పేర్కొంది. లెబనాన్‌లో ఉన్న హిజ్బొల్లా ఉగ్రవాదులను అంతం చేయాలని ఐడిఎఫ్ లక్ష్యంగా చేసుకున్న తర్వాత ప్రధానంగా బాస్తా జిల్లాపై ఇజ్రాయెల్ సైనికులు దృష్టి సారించారు. బాస్తాలో వరుస వరుసగా రెండుసార్లు ఒక్క రోజులోనే దాడులు చేశారు. గడచిన 48 గంటల్లో గాజాలో జరిపిన దాడుల్లో 120 మంది పాలస్తీనియన్లు మరణించారు. మరో 205 మంది గాయపడ్డారు.13 నెలలలో ఐడిఎఫ్ సైన్యం గాజాలో 44,176 మంది పాలస్తీనియన్లను చంపింది. లెబనాన్‌లో 4,645 మందిని చంపింది.

# దేశాధ్యక్షుణ్ణి చంపుతా: కిల్లర్‌తో మాట్లాడా


## ఫిలిప్పీన్స్ ఉపాధ్యక్షురాలు హెచ్చరిక



**మనీలా :** ఒకవేళ నన్ను గనుక చంపితే దేశ అధ్యక్షుడు ఫెర్డినాండ్ మార్కోస్ జూనియర్‌ను, ఆయన భార్యను, పార్లమెంటు దిగువసభ స్పీకర్‌ను కూడా హత్య చేయిస్తానని, అందుకోసం కిల్లర్‌తో కాంట్రాక్టు మాట్లాడాననీ ఫిలిప్పీన్స్ ఉపాధ్యక్షురాలు సారా డ్యుటెర్ట్ బహిరంగ హెచ్చరిక చేశారు. దీంతో ఫిలిప్పీన్స్‌లో రెండు ప్రముఖ రాజకీయ కుటుంబాలమధ్య వైరం మరింత పెద్దదిగా మారిపోయింది. ప్రస్తుత అధ్యక్షుడు మార్కోస్‌కు ముందు దేశాన్ని పాలించిన అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్ట్ కుమార్తె సారా డ్యుటెర్ట్. ఇంతకుముందు కూడా సారా డ్యుటెర్ట్ దేశాధ్యక్షుడిపై వివాదాస్పద విమర్శలు చేశారు. అతడు పరిపాలనకు తగడనీ, అసమర్థుడనీ విమర్శించారు. దేశంలో రాబోయే మే నెలలో మధ్యంతర ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. అందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం అప్రమత్తమై అందుకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకునేందుకు సిద్ధపడింది. శనివారం ఉదయం ఫిలిప్పీన్స్ దేశ ఉపాధ్యక్షురాలు సారా డ్యుటెర్ట్ పత్రికాగోష్ఠి ఏర్పాటుచేశారు. ''నేను ఒక వ్యక్తితో మాట్లాడా, ఒకవేళ నన్ను హత్య చేస్తే వెంటనే మార్కోస్‌ను, దేశ మొదటి మహిళ లిజా అరనెతా, దిగువసభ స్పీకర్ రోమ్యాల్డెజ్‌లను హత్య చేయాలని చెప్పాను, వాళ్ళను చంపే వరకూ వదలకుండా వెంటాడు అని చెప్పా, ఇది నవ్వులాట విషయం కాదు, హాస్యం అంతకన్నా కాదు'' అని దేశ ఉపాధ్యక్షురాలు డ్యుటెర్ట్ చెప్పారు. దీంతో దేశంలో పెద్ద గగ్గోలు చెలరేగింది. ఆమె హెచ్చరికలపై దేశాధ్యక్షుడి కమ్యూనికేషన్ల కార్యాలయం తక్షణం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ విషయాలన్నీ తాము విన్నామని, ఆమె ఒక కిల్లర్‌తో మాట్లాడారని చెప్పారని, అందుకు తగినట్లుగా తాము తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. దేశాధ్యక్షుడికి ఏదైనా జరిగితే పరిస్థితులు చాలా తీవ్రంగా ఉంటాయని, పైగా ఆమె చాలా బాహాటంగా ఈ ప్రకటన చేసినందువల్ల దీనికి సాక్ష్యాలు పెద్దగా అవసరం లేదని పేర్కొంది.

## మా కొత్త క్షిపణి 'ఓరెష్నిక్'ను

# ఎవరూ అడ్డుకోలేరు: పుతిన్





**మాస్కో :** ఉక్రేన్‌పై కొత్తరకం క్షిపణిని ప్రయోగిస్తామని రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ శనివారం నాడు ప్రకటించారు. తమవద్ద అతిశక్తిమంతమైన కొత్తరకం క్షిపణి ''ఓరెష్నిక్'' సిద్ధంగా ఉందని, దానిని ప్రయోగిస్తామన్నారు. ఉక్రేన్ నగరం డ్నిప్రోపై కొత్త బాలిస్టిక్ క్షిపణి ప్రయోగించిన ఒకరోజు తర్వాత పుతిన్ ఈ ప్రకటన చేశారు. పుతిన్ శనివారం నాడు టీవీ తెరపై ఆకస్మికంగా కనిపించి ఈ ప్రకటన చేశారు. తమ కొత్త క్షిపణి 'ఓరెష్నిక్'ను ఏ శక్తీ అడ్డుకోలేదన్నారు. ఈ క్షిపణిని అనేక పరీక్షలకు గురిచేసి సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే అణ్వస్త్రాలతో దాడులకు కూడా దేశీయంగా తమ చట్టాలను ఆయన సిద్ధం చేశారు. అణుసామర్థ్యం లేని దేశానికి ఆయుధాలు సరఫరా చేసి తమ భూభాగంలోకి దాడులు చేయిస్తే ఆ దేశాన్ని కూడా తమపై యుద్ధం ప్రకటించిన దేశంగానే పరిగణిస్తామని, వారిపై కూడా దాడిచేసే హక్కు తమకు ఉంటుందని పుతిన్ ఇప్పటికే ప్రకటించారు. గురువారంనాడు ఆయన బాలిస్టిక్ క్షిపణిని ఉక్రేన్‌పై ప్రయోగించారు. ఉక్రేన్‌కు దీర్ఘశ్రేణి క్షిపణులు ప్రయోగించేందుకు అమెరికా అధ్యక్షుడు బైడెన్ అనుమతి ఇచ్చిన తర్వాత జెలెన్స్కీ వాటిని రష్యాపై ప్రయోగించారు. దానికి ప్రతిగా పుతిన్ ఖండాంతర క్షిపణిని మొదటిసారి ఉక్రేన్‌పై ప్రయోగించారు. దీనిపై ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఒక ప్రకటన చేస్తూ రష్యా దూకుడుపై ప్రపంచదేశాలు స్పందించాలని ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. యుద్ధాన్ని ఉధృతం చేయాలని పుతిన్ కోరుకుంటున్నారన్నారు. ట్రంప్ బాధ్యతలు చేపట్టాక త్వరలో ఉక్రేన్‌లో యుద్ధం ముగుస్తుందని జెలెన్స్కీ చెప్పిన విషయం గమనార్హం. ఐతే ఆ ప్రకటన చేసిన తర్వాత జెలెన్స్కీ రష్యాపై దీర్ఘశ్రేణి క్షిపణులు ప్రయోగించడంతో పుతిన్ దానిని సవాలుగా తీసుకుని మరిన్ని ఎదురుదాడులకు దిగారు. ఇప్పటికే రష్యాకు మద్దతుగా 12 వేలమంది ఉత్తర కొరియా సైనికులు సరిహద్దుల్లో సిద్ధంగా ఉన్నారు.

## మోదీ ప్రభుత్వం కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఉస్తేల సృజన అధ్యక్షతన జరిగిన సదస్సును ఎన్ఎఫ్ఐడబ్ల్యు జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.రజని ప్రారంభించగా, ఎన్ఎఫ్ఐడబ్ల్యు సీనియర్ నాయకులు పశ్యపద్మ, శ్రామిక మహిళా ఫోరం రాష్ట్ర కన్వీనర్ ప్రేమ్‌పావని, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి, వర్కింగ్ ప్రెసిడెంట్ మండ సదాలక్ష్మి, ఉపాధ్యక్షురాలు ఎస్.ఛాయాదేవి తదితరులు ప్రసంగించారు. ఎటువంటి షరతులు లేకుండా 2029 ఎన్నికల్లో 'మహిళా రిజర్వేషన్' అమలయ్యే విధంగా పోరాటాన్ని మరింత ఉధృతం చేయాలని, ఆ దిశగా క్షేత్రస్థాయి నుంచి మహిళలల్లో చైతన్యం తీసుకురావాలని వక్తలు పిలుపునిచ్చారు. 'మహిళా రిజర్వేషన్ 'జాయింట్ సెలెక్ట్ కమిటీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన మహిళా సమాఖ్య నాయకురాలు గీత ముఖర్జీ రిజర్వేషన్ అమలు కోసం పార్లమెంట్‌లోని అన్ని రాజకీయ పార్టీలకు చెందిన మహిళా ఎంపిలను ఒక తాటిపైకి తీసుకొచ్చారని కొనియాడారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యు పోరాటాల ఫలితంగానే మహిళలకు అనేక హక్కులు, చట్టాలు వచ్చాయని వారు గుర్తు చేశారు. డాక్టర్ కె.రజని ప్రారంభోపన్యాసం చేస్తూ మహిళలు అనేక రంగాలలో రాణించినప్పటికీ, ప్రభుత్వ నిర్ణయాల్లో భాగస్వామ్యమైనప్పుడే పరిపూర్ణత లభిస్తుందన్నారు. పార్లమెంట్‌లో మహిళా సభ్యుల సంఖ్య 13.6 శా తానికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రేమ్‌పావని మాట్లాడుతూ ప్రజా, మహిళా పోరాటాలతోనే కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి పెంచడం ద్వారా మహిళా రిజర్వేషన్ల అమలు సాధ్యమౌతుందన్నారు.నేదునూరి జ్యోతి మాట్లాడుతూ ఎన్నికల్లో ఓట్లు పొందేందు కే మహిళా రిజర్వేషన్ అమలుపై కేంద్రంలోని బిజెపి కుంటి సాకులు చెప్పిందని విమర్శించారు. మండ సదాలక్ష్మి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్లలో ఎస్‌సి, ఎస్ టి, బిసి, మైనార్టీ రిజర్వేషన్లను కూడా అమలు చేయాలని డిమాండ్ చేశా రు. ఉస్తేల సృజన, ఎస్.ఛాయాదేవి మాట్లాడుతూ ఎటువంటి షరతులు విధించకుండా మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో మహిళా సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎం.నళినిరెడ్డి, బండి జంగమ్మ, సహాయ కార్యదర్శులు ఫైమీద, లతాదేవి,కోశాధికారి జయలక్ష్మి, ఎన్ఎఫ్ఐడబ్ల్యు సీనియర్ నాయకురాలు జ్యోష్యబట్ల కల్పన, పోటు కళావతి తదితరులు ప్రసంగించారు.

## హైదరాబాద్‌కు తాగునీరు

(మొదటి పేజీ తరువాయి)

ఖర్చవుతుందనే అంశాలపై పూర్తి అధ్యయనం చేయాలని అధికారులకు తెలిపారు. వచ్చే నెల 1 నుంచి టెండర్ల ప్రక్రియ చేపట్టేలా కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సిఎం సూచించారు. సమీక్షలో పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఎం. దానకిషోర్, జలమండలి ఎం.డి. అశోక్ రెడ్డి, నీటి పారుదల శాఖ కార్యదర్శి ప్రశాంత్ జె.పాటిల్ తదితరులు పాల్గొన్నారు.


## జనగణన ఎప్పుడు పూర్తవ్వాలి ?

(మొదటి పేజీ తరువాయి)

అని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. కులగణన జరిగే వరకు రిజర్వేషన్లను అమలు చేయకుండా బిజెపి కుట్ర చేస్తోందని విమర్శించారు. బంగ్లాదేశ్‌లో 20 శాతం, పాకిస్తాన్‌లో 21 శాతం, క్యూబాలో 53 శాతం మంది మహిళలు పార్లమెంట్‌లో ఉన్నారని, కానీ భారతదేశంలో మాత్రం ప్రస్తుతం కేవలం 13.63 శాతం మాత్రమే ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు అమలు జరిగితే పార్లమెంట్‌లో మహిళల సంఖ్య పెరుగుతుందని రాజకీయ పార్టీలకు భయం పట్టుకుందని, ఆ కారణంగానే కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడపిల్లలకు ఆస్థిలో భాగం, విడాకుల, హిందూకోడ్ చట్టాలను తీసుకురావడంలో మహిళా సమాఖ్య అనేక పోరాటాలు చేసిందన్నారు. అరుణ ఆసఫ్ అలీ దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారని, ఆమె బ్రిటీష్ వారికే సవాల్ విసిరారని, మహిళా రిజర్వేషన్లపై గీతాముఖర్జీ ఇలా అనేక మంది మహిళా నాయకులు పోరాటాలు చేశారని పశ్యపద్మ వివరించారు.

## ఫార్మా కంపెనీ వద్దు

(మొదటి పేజీ తరువాయి)




ప్రయత్నాలు, ఆ సందర్భంగా జరిగిన ఘటనల నేపథ్యంలో లగచర్లను సందర్శించిన వామపక్ష పార్టీల నాయకుల ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, కార్యదర్శివర్గ సభ్యులు పశ్యపద్మ, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, వామపక్షాల నాయకులు కె.రమ, ఎస్ఎల్.పద్మ (సిపిఐ (ఎంఎల్ మాస్ లైన్), వనం సుధాకర్ (ఎంసిపిఐ(యు),పాపయ్య (సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ), సిహెచ్.మురహరి (ఎస్‌యుసిఐ ), ఎం.రమేష్ రాజా (సిపిఐ ఎంఎల్ లిబరేషన్), ప్రసాదన్న (సిపిఐ ఎంఎల్), ఎ.జానకి రాములు(ఆర్ఎస్‌పి) లగచర్లలో ఘటన, సమస్యలు, పరిష్కారాలపై వామపక్షాలు అభిప్రాయాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించారు. లగచర్లలో మహిళలపై అసభ్యంగా ప్రవర్తించిన పోలీస్లపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, నాలుగు గ్రామాల్లో వరి కోత యంత్రాలకు అనుమతులు ఇవ్వాలని, ఐకెపి సెంటర్‌ను ఏర్పాటు చేయాలని, ఫార్మా కంపెనీకి పడావుగా వున్న కొడంగల్ దొరల సీలింగ్ భూములు 1156 ఎకరాలను తీసుకొనే విషయం పరిశీలించాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రైతుల సమ్మతి లేకుండా భూములు తీసుకోవద్దని వారు సిఎంను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 6 గ్యారంటీలతో పాటు ఏడో గ్యారంటీ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య పునరుద్ధరణ చర్యలు లగచర్లలో చేపట్టాలని, ప్రజలకు ధైర్యం ఇచ్చే విధంగా స్వేచ్ఛా వాతావరణం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

**అమాయక గిరిజనులపై కేసులు ఎత్తివేసేందుకు సిఎం సానుకూలం : కూనంనేని**

లగచర్ల ఘటనపై విచారణ చేపట్టి అమాయకులైన గిరిజనులపై మోపబడిన కేసులు ఎత్తివేయాలని ముఖ్యమంత్రిని కోరినట్లు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అనంతరం మీడియాతో చెప్పారు. లగచర్లలో జరిగిన ఘటనను ప్రభుత్వం విచారణ చేపట్టవచ్చని, కానీ గిరిజనులపై ఎలాంటి కేసులు లేకుండా విడుదల చేయాలని కోరామని, అందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా అంగీకరించినట్లు సాంబశివరావు తెలిపారు. లగచర్లలో అక్కడ ఏర్పాటు చేస్తున్నది ఫార్మాసిటీ కాదని, అక్కడ ఇండస్ట్రియల్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారని, ఆ విషయాన్ని వాపక్షాలు కూడా ప్రజల్లోకి చెప్పాలని ఆయన కోరారని అన్నారు. విష పదార్థాలు వెదలజల్లే ఫార్మా కంపెనీలను జనావాసాల మధ్య నెలకొల్పవద్దని, అవసరమైతే ఏడారి ప్రాంతాలలో ప్రజలకు నష్టం జరగని స్థలాలలో ఏర్పాటు చేసుకోవాలని వామపక్షపార్టీలు ముఖ్యమంత్రికి సూచించినట్లు సాంబశివరావు వివరించారు. ఒక వేళ ప్రభుత్వం జనావాసాలలో ఫార్మాకంపెనీలను ఏర్పాటు చేస్తే వామపక్ష పార్టీలుగా తాము అంగీకరించబోమని స్పష్టం చేశామని ఆయన తెలిపారు. ఏదైనా పరిశ్రమలు ప్రభుత్వ మిగులు భూములలో ఏర్పాటు చేసుకోవాలని, గత్యంతరం లేని పరిస్థితులలో మాత్రమే రైతులను స్వచ్ఛందంగా ఒప్పించి రైతులకు పూర్తి నష్టపరిహారం అందించిన తరువాతే వారి భూములలో పరిశ్రమలు పెట్టుకోవాలని స్పష్టం చేసినట్లు సాంబశివరావు తెలిపారు. మల్లన్నసాగర్ నిర్వాసితులు ఇప్పటివరకు సెటిల్ కాలేదని ప్రభుత్వం నుండి వచ్చిన రూ.6 లక్షల పరిహారం డబ్బులు అయిపోయాయి కానీ కొత్తగా భూములు కొనుగోలు చేయలేకపోయారని సాంబశివరావు వివరించారు. ఈ సందర్భంగానైనా భూనిర్వాసితుల పాలసీని మార్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, వారిని సంతృప్తి పరిచేవిధంగా పరిహారం పెంచి ఇవ్వాలని, భూమికి బదులు అంతే భూమిని వేరే చోట అయినా ఇప్పిస్తేనే రైతులు ఒప్పుకుంటారని సాంబశివరావు అన్నారు. పేద ప్రజలకు, రైతులకు, భూ నిర్వాసితులకు ఇబ్బందులు వచ్చినప్పుడు, పోలీసులు అత్యుత్సాహం చూపినప్పుడు కమ్యూనిస్టు పార్టీలు స్పందిస్తాయని సాంబశివరావు తెలిపారు.

**రెండు పంటలు పండే భూములు తీసుకోవద్దని కోరాం : తమ్మినేని వీరభద్రం**

ఇండస్ట్రియల్ పార్క్ కోసం అయినా రెండు పంటలు పండే భూములు తీసుకోవద్దని సిఎం రేవంత్‌రెడ్డికి చెప్పామని తమ్మినేని వీరభద్రం తెలిపారు. లగచర్ల వద్ద మహిళలపై పోలీసులు దారుణంగా ప్రవర్తించారు. ఈ దాడిని సిఎం వద్ద తీవ్రంగా ఖండించాం. లగచర్లలో ప్రస్తుతం నిర్బంధ పరిస్థితుల్లో దాదాపు కల్లోలిత ప్రాంతాలుగా ఉన్నాయని, ఈ పరిస్థితులను చక్కదిద్దాలని, శాంతి యుత పరిస్థితులను తీసుకురావాలని చెప్పామన్నారు. సిఎం సానుకూలంగా స్పందించారని, తమ ముందే వికారాబాద్ కలెక్టర్‌కు ఫోన్ చేశారని, ఇలాంటి పరిస్థితులు ఉండడానికి వీలు లేదని, జరిగిందేదో జరిగిపోయిందని, వెంటనే అక్కడ వరికోత యంత్రాలు అక్కడ ప్రవేశించడానికి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్‌ను ఆదేశించారని వీరభద్రం తెలిపారు. అవసరమైతే లగచర్లలో మరోసారి పర్యటన చేస్తామని సిఎం రేవంత్‌కు వెల్లడించామన్నారు.

**రైతుల భూములు లాక్కోవద్దు: పశ్య పద్మ**

రైతులు సాగు చేసుకుంటున్న భూములను వదులుకునేది లేదని రైతులు ఇప్పటికే స్పష్టం చేశారని, ప్రభుత్వం వారి భూములను బలవంతంగా లాక్కోవద్దని ప్రభుత్వాన్ని కోరినట్లు పశ్య పద్మ చెప్పారు. 'తాము చావనైనా చస్తాం. గానీ సాగు భూములను వదిలేదిలేదని అక్కడి రైతులు అంటున్నారు. ప్రభుత్వం కోటి రూపాయలు ఇస్తే వదులుతారా? అని ప్రశ్నించినా వారు ఇవ్వమంటున్నారు. ఈ భూములను తరతరాలుగా సాగు చేసుకుంటున్నామని, కాబట్టి ఇవ్వబోం' అని రైతులు చెప్పిన విషయాలను సిఎం రేవంత్‌రెడ్డి దృషిXXగికి తీసుకువచ్చామని, ఈ విషయంలో ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని సిఎంను కోరామని పశ్య పద్మ చెప్పారు.

## అధికార కూటములదే హవా

(మొదటి పేజీ తరువాయి)

విజయం సాధించింది. ఈ రెండు రాష్ట్రాలలో ఎన్నికలకు 'ఇండియా', ఎన్‌డిఎ కూటములమధ్య హోరాహోరీగా ప్రచారం సాగింది. మరోవైపు రెండు రాష్ట్రాలలో అధికారంలో ఉన్న కూటమిపార్టీల కార్యకర్తలు స్వీట్లు పంచుకుని ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని నృత్యాలు చేస్తూ సంబురాలు చేసుకున్నారు.

**ప్రజలకు మోదీ కృతజ్ఞతలు:** ఝార్ఖండ్, మహారాష్ట్ర ప్రజలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందనలు తెలియజేశారు. జెఎంఎం సారథ్యంలోని 'ఇండియా' కూటమి పార్టీలు సాధించిన విజయానికి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి అండగా నిలిచినందుకు ఝార్ఖండ్ రాష్ట్ర ప్రజలకు ఆయన విడిగా కృతజ్ఞతలు తెలియజేశారు.మహారాష్ట్రలో మహాయుతి కూటమి విజయం సాధించడంపై మోదీ హర్షం ప్రకటించారు. ''అభివృద్ధి గెలిచింది, సుపరిపాలన గెలిచింది, ఐక్యంగా మేం ఇప్పుడు ఆకాశంకంటే ఇంకా ఎత్తుకు పైకెగిరాం, నా మహారాష్ట్ర సోదరీమణులకు, సోదరులకు హృదయపూర్వక కృతజ్ఞతలు,ప్రత్యేకించి ఎన్‌డిఎ కూటమికి ఇంత చరిత్రాత్మకమైన తీర్పు ఇచ్చినందుకు యువకులు, మహిళలకు కృతజ్ఞతలు, వారి ప్రేమాభిమానాలు వెలకట్టలేనివి, దేనికీ అసమానమైనవి'' అని నరేంద్రమోదీ ఎక్స్ వేదికగా ఒక పోస్టింగ్ పెట్టారు. ఎగ్జిట్‌పోల్స్‌లో చెప్పిందే నిజమైందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే వ్యాఖ్యానించారు. ద్వేషం, పగ, ప్రతీకారాలతో కూడిన రాజకీయాలను ప్రజలు తిరస్కరించారనీ, అభివృద్ధి, సంక్షేమ రాజకీయాలకే ప్రజలు పట్టం కట్టారని షిండే అన్నారు. ''ఈ రోజు ఎంతో చరిత్రాత్మకమైనది, ప్రజలు ఎన్నికలను తమ చేతుల్లోకి తీసుకున్నారు, మహాయుతి కూటమికే ఘన విజయం చేకూర్చారు'' అని షిండే అన్నారు. లడ్కీ బెహన్ వంటి సంక్షేమ పథకాలకే ప్రజలు ఓటు వేశారని మహాయుతి కూటమిలో మిగిలిన భాగస్వామ్యపార్టీల నాయకులు వ్యాఖ్యానించారు. బాలాసాహెబ్ ఠాక్రే ఆశయాలను ఎవరు ముందుకు తీసుకువెళతారో ఈ ఎన్నికల ఫలితాలే తేల్చి చెప్పాయని శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే అన్నారు. శివసేన (యుబిటి)ని నాయకత్వం వహిస్తున్న శివసేన వ్యవస్థాపకుడి కుమారుడు ఉద్ధవ్ ఠాక్రే వారసత్వాన్ని ఆయన వేలెత్తి చూపించారు.

**మహారాష్ట్ర ఫలితాలు అనూహ్యం**

**రాహుల్‌గాంధీ, ఖర్గే వ్యాఖ్యలు:** మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాలు చాలా అనూహ్యంగా ఉన్నాయని పార్లమెంటులో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అన్నారు. ఎక్స్ వేదికగా ఆయన హిందీలో ఈ మేరకు ఒక పోస్టింగ్ పెట్టారు. మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాలపై తాము సమగ్రంగా విశ్లేషణ చేస్తామన్నారు. తమకు మద్దతు తెలియజేసిన రెండు రాష్ట్రాల ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పనిచేశారన్నారు. ఝార్ఖండ్ ఎన్నికలలో 'ఇండియా' కూటమి సాధించిన విజయం రాజ్యాంగంతోపాటు నీరు, అడవులు, భూమి రక్షణకోసం సాధించిన విజయమని అన్నారు. కేరళలోని వయనాడ్‌లో ప్రియాంకాగాంధీ విజయంతో ఆ నియోజకవర్గ ప్రాంతం అంకితభావంతో కూడిన గొప్ప ప్రగతికి దారిదీపంగా నిలుస్తుందని అన్నారు. ''వయనాడ్‌లో నా కుటుంబసభ్యులందరూ ప్రియాంకాగాంధీపై ఎంతో గొప్ప విశ్వాసం ఉంచారు, అందుకు నాకు ఎంతో గర్వంగా ఉంది, ఆమె ఎంతో ధైర్యసాహసాలతో, చెక్కుచెదరని అంకితభావంతో ఈ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకువెళతారు, ఈ నియోజకవర్గంలో ప్రియాంకాగాం ధీ ఎన్నో గొప్పమార్పులు తీసుకువస్తారు, పరివర్తన జరుగుతుంది'' అని ఎక్స్ పోస్టింగ్‌లో రాహుల్‌గాంధీ రాశా రు. కాగా, కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జు న ఖర్గే కూడా ప్రజలకు కష్టపడి పనిచేసిన పార్టీ నాయకు లు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో బిజెపి అనుసరించిన విభజన రాజకీయాలను, కుటిల రాజకీయాలను ఆ రాష్ట్ర ప్రజలు తిరస్కరించారన్ని అన్నారు. మహారాష్ట్రలో ఎన్నికల ఫలితాలు అనూహ్యం గా ఉన్నాయని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఖర్గే పైవిధంగా స్పందించారు. ''ఝార్ఖండ్ రాష్ట్ర ప్రజలు హక్కులకు, నీటికీ, అడవులు, భూముల సంరక్షణకే ప్రాధా న్యం ఇచ్చారు, జై జోహార్, వారు విభజన రాజకీయాలను, ఆ పార్టీలను తిరస్కరించారు , రాజ్యాం గ వ్యవస్థలను దుర్వినియోగం చేసే ఆటలను ప్రజలు ఓడించా రు'' అని తన పోస్టింగ్‌లో ఖర్గే రాశారు. ఝార్ఖం డ్ ము ఖ్యమంత్రి హేమత్ సోరెన్‌కు, కూటమిలో భాగస్వామ్యపార్టీ నాయకులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ''మనందరం సామాజిక న్యాయంకోసం పోరా టం చేశాం, ప్రజల గొంతుకను వినిపిం చాం,ప్రజలకు జవాబుదారీగా ఉండే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం, ప్ర జలకు మనపై విశ్వాసం చెక్కుచెదరకుం డా ఉం ది, కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు విశ్వసించారు'' అని ఖర్గే తన పోస్టింగ్‌లో రాశారు.

**షిండే ఎంఎల్ఏలందరూ ఎలా గెలవగలిగారు?**

మహారాష్ట్ర ఎన్నికల్లో విచ్చలవిడిగా డబ్బు వెదజల్లారని నా బుర్రలో చిన్న సందేహం ఉందని శివసేన (యుబిటి) నాయకుడు సంజయ్ రౌత్ అన్నారు. ఈ ఫలితాలు సందేహాస్పదంగా ఉన్నాయని, ఏదో కుట్ర జరిగిందని అన్నారు. ఈ ఎన్నికల ఫలితాలు ముఖ్యమంత్రి షిండే త రపున పోటీ చేసిన ఎంఎల్ఏలు అందరూ ఈ ఎన్నిక ల్లో ఎలా గలిగారని ప్రశ్నించారు. మహారాష్ట్రకు ద్రోహం చేసి ప్రజాగ్రహం చూసిన అజిత్ పవార్ ఎలా గెలవగలిగారని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ఫలితాల ధోరణికి ఈ ఫలితాలు పూర్తి భిన్నంగా ఉన్నాయన్నారు.

# కేంద్ర ప్రభుత్వంపై 26న కార్మిక, రైతుగర్జన

కేంద్రంలో నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చింది. సాధారణ మెజార్టీ కూడా సంపాదించుకోలేక, తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ యునైటెడ్ వంటి మిత్రపక్షాలతో కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన బిజెపి తన తీరు మార్చుకోలేదు. ఎప్పటి మాదిరిగానే హామీలతో ఊదరగొట్టారు. ఘనమైన లక్ష్యాలను ప్రకటించారు. కానీ బడ్జెట్లో కేటాయింపులు గానీ, తీసుకుంటున్న చర్యలుగానీ వారు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు కార్యాచరణ లేదు. కార్పొరేట్ల ప్రయోజనం కోసం దేశ స్వాతంత్ర్యాన్ని, స్వావలంబనను తాకట్టు పెడుతుంది. నిత్యం స్వదేశీ జపం చేస్తూ విదేశీ సంస్థలకు సాగిలపడుతుంది. మన జాతీయ వనరులు, సంపదను లూటీ చేస్తున్నది. నయా ఉదారవాద సంస్కరణలను దూకుడుగా కొనసాగించడానికి 100 రోజుల లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. తమకు ప్రజలు అధికారాన్ని కట్టబెట్టారని మోడీ ప్రభుత్వం చాటుకుంటుంది. లేబర్ కోడులను నోటిఫై చేయడం, భారతీయ న్యాయ సంహిత 2023(బిఎన్ఎస్)ను అమలు చేయడం, నేషనల్ మ్యానిటైజేషన్ పైప్లైన్ ద్వారా కార్పొరేట్, పెట్టుబడిదారుల, బడావ్యాపారస్తులకు ఆర్థిక వెలుసుబాట్లను కల్పించే చర్యలను వేగవంతం చేసింది. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలంటూ ఊదరగొట్టిన బిజెపి, అధికారంలో ఉన్న 10సం.రాలలో ఉపాధి కల్పన దిశగా సరియైన అడుగులు వేయలేదు, ఘోరంగా విఫలమైంది. దేశం మొత్తం జనాభాలో 47 శాతానికి వ్యవసాయమే జీవనాధారమని 2022–23 ఆర్థిక సర్వేలో తేలింది. దేశంలో అత్యధిక శాతం మంది గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. దేశంలో కోట్లాదిమందికి గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న 'ఉపాధి హామీ పథకానికి' ఈ బడ్జెట్లో నిధులను తగ్గించారు. గత ఆర్థిక


(ఫైల్)

సంవత్సరంలో కేటాయించిన రూ.98వేల కోట్లు నుండి రూ.86 కోట్లకు తగ్గించారు. దేశంలో నిరుద్యోగం రికార్డ్ స్థాయికి చేరుకోగా, ఖాళీగా ఉన్న 30లక్షల ఉద్యోగాల నియామకాల గురించి ఊసే ఎత్తలేదు. కేంద్ర బడ్జెట్లో వ్యవసాయ రంగానికి, ఆహార ఉత్పత్తుల సబ్సిడీలకు భారీగా కోతలు విధించింది. ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాలపై ఉక్కు పాదం మోపుతుంది. పౌరుల ప్రాథమిక హక్కులను హరిస్తుంది. ఈ నేపథ్యంలో 10 జాతీయ కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం), వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్యంగా దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే నవంబర్ 15 నుండి క్యాంపెయిన్ చేపట్టారు.

**రైతాంగ వ్యతిరేక విధానాలు :**

ఇప్పటికే రైతులపై నడ్డి విరిగే విధంగా గత పార్లమెంటులో మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలను నిరంకుశంగా ఆమోదించుకున్నప్పటికీ రైతాంగ, కార్మిక, వ్యవసాయ కార్మికుల సమరశీల సుదీర్ఘ ఉద్యమాలతో ఆ చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. అయినా 2016లో నరేంద్ర మోదీ పార్లమెంట్‌లో ఇచ్చిన కనీస మద్దతుధర హామీ నేటికీ అమలు కాలేదు. రైతుల డిమాండ్ ప్రకారం (సి2+50 శాతం) పంటలు పెట్టుబడి ఖర్చు ఆధారంగా 50 శాతం కలిపి మద్దతు ధరలను పెంచడం లేదు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ రూ.48.25లక్షల కోట్లలో.. వ్యవసాయ అనుబంధ రంగాలకు కేటాయించినది రూ.1,51,000 కోట్లు మాత్రమే. అంటే దేశ జనాభాలో 60 శాతం ఆధారపడిన రంగానికి మూడు శాతం నిధులు మాత్రమే కేటాయించారు. పంటల భీమా గురించి, కనీసం మద్దతు ధర గురించి రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే పరిగణనలోకి తీసుకోవడంలేదు. వ్యవసాయ రంగంపై తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెపుతున్న మోడీ, ఆదాయం రెట్టింపు కాకపోగా అప్పుల ఊబిలో రైతాంగం కూరుకుపోతు రోజురోజుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

**కార్పొరేట్లకు అనుకూల విధానాలు :**

మరొకపక్క కార్పొరేట్ వర్గాలకు 10సంవత్సరాలలో రూ.14.46లక్షల కోట్లు మాఫీ చేసినది చాలక, ఇప్పుడు మరొక రూ.10.20లక్షల కోట్ల మాఫీకి ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ పేరుతో దేశ ప్రజల ఆస్తులను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**కార్మికవర్గ వ్యతిరేక విధానాలు :**

బిజెపి వర్గం స్వభావికంగా కార్పొరేట్లకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఆర్థిక విధానాలు చేపడుతూ, కార్మిక వర్గ హక్కులపైన, ఉద్యమాలపైన ఉక్కుపాదం మోపుతుంది. పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 కార్మిక చట్టాలను పూర్తిగా రద్దుచేసి, నాలుగు లేబర్ కోడులుగా తీసుకొచ్చింది. రోజుకు 12 గంటల పని విధానాన్ని తీసుకొస్తుంది. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న 47కోట్ల మంది కార్మికులకు ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పిస్తామని ఇచ్చిన ఏ ఒక్కటీ నెరవేర్చలేదు. కనీస వేతన విధానాన్ని కూడా తీసుకురాలేదు.. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ, ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నది. ఈ 10 సంవత్సరాలలో బిజెపి ప్రభుత్వం కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశాలకు తిలోదకాలిచ్చారు.

ఈ బడ్జెట్లో కార్మికవర్గ ప్రయోజనాలకు అనుకూలంగా ఏ ఒక్కటీ నిర్ణయించలేదు. మొత్తం మీద ప్రజలకు అవసరమైన అంశాల మీద మౌనం, లేదా అమలు కాని భారీ వాగ్దానాలు, కార్పొరేట్లకు అవసరమైన అంశాల మీద భారీ కేటాయింపులు, రాయితీలు ఇస్తున్న నేపథ్యంలో..మోడీ పాలనను చూస్తుంటే..ప్రజా వ్యతిరేక, కార్పొరేటీకరణ, కాషాయీకరణని చెప్పకనే చెప్పువచ్చు.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలపై 'నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసనలు, ప్రదర్శనలు' చేపట్టాలని పది కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో యావత్ శ్రామికవర్గం, ఇతర ప్రజా సంఘాలు భాగస్వాములై విజయవంతం చేయ్యాలి.

**ఉజ్జిని రత్నాకర్ రావు,**
**ఎఐటియుసి నాయకులు**
**సెల్:9490962646**



## లగచర్ల ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ విచారణ

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల గ్రామంలో ఫార్మ కంపెనీ ఏర్పాటు విషయంలో భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ చేసేందుకు వెళ్లిన జిల్లా కలెక్టర్‌పై జరిగిన దాడి ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ శనివారం విచారణ చేపట్టారు. ఈనెల 18న లగచర్ల గ్రామంలో జిల్లా కలెక్టర్‌పై దాడి జరగడంతో అర్థరాత్రి పోలీసులు ఇండ్లలోకి చొరబడి ఇష్టానుసారంగా మహిళలని కూడ చూడకుండా అసభ్యకరంగా ప్రవర్తించారని ఆందోళన వ్యక్తం చేస్తు జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై విచారణ చేపట్టిన కమిషన్ సభ్యులు ముఖేష్ డిప్యూటీ రిజిస్టర్ ఇన్ లా, ఇన్స్పెక్టర్ రోహిత్ సింగ్, యతిప్రకాశ్ శర్మలు భూబాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ సభ్యులు బాధిత మహిళలను విచారించగా దాడి ఎందుకు జరిగింది...? దాడి జరిగిన తరువాత పోలీసులు ఎందుకు ఇండ్లపైకి వచ్చారు. వచ్చిన పోలీసులు ఎలా ప్రవర్తించారు. మహిళా పోలీసులు ఏమైనా ఉన్నారా..? ఆడవాళ్లకు కొట్టారా... ఇండ్లలో ఉన్న సామాన్లను ఏమైనా దొంగిలించారా..? మీ భూములు కంపెనీలకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారా... అనే ప్రశ్నలు అడగటంతో బాధిత మహిళలు కూడా అర్థరాత్రి పోలీసులు ఇండ్లలోకి వచ్చి కరెంటు ఆపేసి అసభ్యకరంగా ప్రవర్తించడమే కాకుండా ప్రైవేట్ భాగాలను కూడా తాకడం జరిగిందని మహిళా బాధితులు కమిషన్ సభ్యులకు తెలిపారు. కొంతమంది పోలీసులు మద్యం సేవించి రావడం జరిగిందని తెలిపారు. దొరికినవారిని దొరికినట్లు స్టేషన్‌కు తీసుకువెళ్లి ఇష్టంవచ్చినట్లు కొట్టడం జరిగిందని, ఇప్పటి వరకు దెబ్బలకు నొప్పులు తగ్గలేదని కన్నీరు పెట్టుకున్నారు. మా ప్రాణాలు పోయినా ఫర్వాలేదు కానీ మా భూములు మాత్రం ఇచ్చేది లేదని అన్నారు. అయితే కమిషన్ సభ్యులు మరో రెండు రోజుల పాటు బాధితులను పరామర్శించి సమగ్ర విచారణ చేపట్టనున్నట్లు సమాచారం.

# మహబూబ్‌నగర్‌లో మూడు రోజుల రైతు సదస్సు

బహిరంగ సభలా కాకుండా రైతుల అవగాహన సదస్సుగా నిర్వహించాలి
28 నుంచి మూడు రోజుల పాటు స్టాల్స్ ఏర్పాటు చేయాలి
వ్యవసాయ శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మహబూబ్‌నగర్‌లో ఈనెల 30న నిర్వహించ తలపెట్టిన రైతు సదస్సును బహిరంగ సభ మాదిరిగా కాకుండా 'రైతులకు అవగాహన కల్పించే సదస్సు'గా నిర్వహించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వ్యవసాయంలో వచ్చిన అధునాతన సాగు పద్ధతులు, మెళకువలను రైతులకు తెలియజేసే విధంగా వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ, పశుసంవర్ధక శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాట్లు చేయాలని సిఎం సూచించారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం అభివృద్ధి చేసిన కొత్త వంగడాలు, ఆయిల్ పామ్ కంపెనీల నూతన ఆవిష్కరణలు, రైతులకు ఉపయోగపడేందుకు అందుబాటులోకి వచ్చిన వివిధ కంపెనీల వినూత్న ఉత్పాదనలన్నీ ఇక్కడ స్టాల్స్‌లో ఉంచాలని సిఎం సూచించారు. అధునాతన పరికరాలు, ఎలక్ట్రిక్ ట్రాక్టర్లు, డ్రోన్లు అన్నింటినీ అక్కడ ప్రయోగాత్మక ప్రదర్శనకు సిద్ధంగా ఉంచాలని చెప్పారు. ముఖ్యమంత్రి హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం వ్యవసాయ శాఖపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ప్రజా ప్రభుత్వ విజయోత్సవాల్లో భాగంగా ఈనెల 30న మహబూబ్‌నగర్‌లో జరగనున్న రైతు సదస్సుపై సమావేశంలో ప్రధానంగా చర్చించారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసే సదస్సులో రాష్ట్రంలోని రైతులందరూ పాల్గొనే విధంగా, సభ విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

రైతులందరూ 30న జరిగే సభకు అప్పటికప్పుడు వచ్చి వెళ్లే విధంగా కాకుండా రైతులకు అవగాహన కల్పించేలా మూడు రోజుల పాటు మహబూబ్‌గర్ రైతు సదస్సు నిర్వహించాలని సిఎం ఆదేశించారు. ఈనెల 28వ తేదీ నుంచే ఈ స్టాళ్లను అందుబాటులో ఉంచాలని సిఎం చెప్పారు. తద్వారా రాష్ట్రంలోని రైతులు దేశంలో వ్యవసాయ సాగు విధానాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకునేలా సదస్సు నిర్వహించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం 23 లక్షల మంది రైతులకు ఇప్పటికే రూ.2లక్షల వరకు రుణమాఫీ జరిగిందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

కొన్ని చోట్ల ఆధార్ నెంబర్ల తప్పులు, బ్యాంకు ఖాతాల్లో పేర్ల తప్పులు, కుటుంబాల నిర్ధారణ కారణాలతో కొందరికి రుణమాఫీ జరగలేదని వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి నివేదికను అందించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపి చామల కిరణ్‌కుమార్ రెడ్డి, ఎంఎల్ఎ సుదర్శన్ రెడ్డి, సిఎంఒ స్పెషల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి, వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు పాల్గొన్నారు.

# జడ్జిల నియామకాలలో.. బడుగు, బలహీన వర్గాలకు న్యాయం

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి జడ్జిల నియామకాలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ వర్గాలకు సరైన ప్రాతినిధ్యం కల్పించి, తగు న్యాయం చేయాలని రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం బిసి, ఎస్‌సి, ఎస్‌టి అడ్వకేట్స్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ జెల్ల లింగయ్య అధ్యక్షతన 'ఉన్నత న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం – ప్రస్తుత పరిస్థితులు' అనే అంశంపై శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ (బిజెపి), రాజ్యసభ మాజీ సభ్యులు వి.హనుమంతరావు (కాంగ్రెస్), దాసోజు శ్రవణ్ (బిఆర్ఎస్), బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాజ్యాంగం, అంబేద్కర్ స్ఫూర్తిని పాలకులు అర్థం చేసుకోకపోవడం వల్లే బిసిలు వెనుకబాటుకు గురయ్యారని తెలిపారు. అంబేద్కర్ కన్న కలలు ఇంకా నెరవేరడంలేదని పేర్కొన్నారు. న్యాయవాదులు తమ వాటా కోసం పోరాడటం న్యాయపరమైన అంశమేనన్నారు. ఇప్పటికీ కొంతమంది న్యాయవాదులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే న్యాయవాదులకు రూ.5వేల పెన్షన్‌ను నెలవారీగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వి.హనుమంతరావు మాట్లాడుతూ ప్రతిభలో అందరూ సమానమేనని, బడుగు, బలహీనవర్గాల న్యాయవాదులు ఐక్యమై జడ్జిల నియామకాలలో న్యాయం కోసం జరుగుతున్న పోరాటాన్ని ఇలాగే కొనసాగించాలని సూచించారు. న్యాయవాదుల పోరాటానికి తమ మద్దతు ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ న్యాయవాదుల పోరాటం దేశంలో పెనుమార్పుకు పునాదిగా నిలుస్తుందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు. ఫోర్త్ ఎస్టేట్స్‌లో ఉన్నతస్థానాల్లో అగ్రవర్ణాలే ఉన్నారని, దేశవ్యాప్తంగా బిసి వర్గాలు అభివృద్ధిలో వెనుకబాటుకు గురయ్యారని తెలిపారు. ఉన్నత పదవుల్లో వాటా కోసమే కాకుండా రాజకీయంగా అధికారం చేపట్టేందుకు కూడా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలు కొట్లాడాలని పిలుపునిచ్చారు. ముందుగా, లింగయ్య అధ్యక్షోపన్యాసం చేస్తూ ఉమ్మడి ఎపి, తెలంగాణ ఏర్పడ్డాక హైకోర్టులో మొత్తం 211 మంది జడ్జిలుగా నియామకమయ్యారని తెలిపారు.

ఇందులో పదిశాతం జనాభా ఉన్న అగ్రవర్ణాల వారికి 80శాతం వాటా దక్కగా, 80శాతం జనాభా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 20శాతం వాటా దక్కిందని తెలిపారు. దీన్నిబట్టి బడుగు, బలహీనవర్గాలు ఎంత అన్యాయానికి గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చని చెప్పారు. అన్నివర్గాలకు సమానవాటా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని తెలిపారు. సమావేశంలో హైకోర్టు జిపి పాండు, మాజీ పిపి విజయ్ ప్రశాంత్, అరుణ్‌కుమార్, న్యాయవాదులు ఉపేందర్, జగన్, శివరాజు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగల ఎస్‌సి వర్గీకరణ చేస్తాం

మంత్రి దామోదర రాజనర్సింహ్మా

**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి :** 30 ఏళ్ల మాదిగల చిరకాల స్వప్నం ఎస్సీ వర్గీకరణ చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా అన్నారు. పట్టణంలోని అంబేద్కర్, జ్యోతి రావు పూలే, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనమైన నివాళులర్పించారు. క్లాక్ టవర్ నుండి ఎన్జీ కాలేజీ వరకు భారీగా సాగిన ర్యాలీలో ఎంఎల్ఎ వేముల వీరేశం డప్పు కొట్టి ర్యాలీలో పాల్గొన్నారు. నల్లగొండ ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి కాంగ్రెస్ ముందునుంచి మద్దతు తెలుపుతూ వస్తుందని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ వర్గీకరణ వచ్చిపోయిన సమయంలో వర్గీకరణ కోసం యుపిఎ ప్రభుత్వం ఉషా మెహార్ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తు చేశారు. 30 ఏళ్ల సుదీర్ఘ ఎస్సీ వర్గీకరణ పోరాటం సుప్రీంకోర్టు తీర్పు ఆగస్టు



1న ఇవ్వడంతో తెలంగాణ నిండు అసెంబ్లీలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్గీకరణ చేసి తీరుతామని అసెంబ్లీ ప్రకటించడం జరిగిందని గుర్తుచేశారు. మాదిగలు అధైర్య పడవద్దు కొన్ని కారణాలవల్ల కొంత సమయం ఆలస్యమైనా వర్గీకరణ చేసి తీరుతామన్నారు. ఎఐసిసి నాయకులు సంపత్ కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాలలో వెనుకబడిన మాదిగలకు అండగా సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని నాడు, నేడు ఎప్పటికైనా ఆయన ఇచ్చిన మాట తప్పలేదని పేర్కొన్నారు. వర్గీకరణ చేసే దమ్ము ధైర్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందని, మాదిగలంతా కాంగ్రెస్ ప్రభుత్వంకి అండగా ఉండాలని కోరారు. ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ న్యాయబద్ధమైన మాదిగల ఎస్సీ వర్గీకరణ చేయడంలో గత పాలకులు చేసిన మోసంతో ఎంతో మంది మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. మాదిగలకు ఉద్యోగాలు, భూములు, సంక్షేమ పథకాలు దక్కాలంటే వర్గీకరణ ఏకైక మార్గమని అందుకోసం కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే వర్గీకరణ చేయాలని కోరారు.

కార్యక్రమానికి నకిరేకల్ ఎంఎల్ఎ వేముల వీరేశం అధ్యక్షత వహించగా విప్ అడ్లూరి లక్ష్మణ్, ఎంఎల్ఎలు మందుల సామేలు, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, గోవింద్ నరేష్, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు నరేష్. పిడమర్తి రవి,కొండేటి మల్లయ్య, బొర్ర సుధాకర్, కళాకారులూ ఏపూరి సోమన్న, సుక్క రామనర్సయ్య, వేముల పుష్ప ఉన్నారు.

## ప్రభుత్వ,ప్రైవేటు ఆస్పత్రులలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు

పది బృందాలతో తనిఖీలు చేపట్టి..నివేదికను సమర్పించండి: మంత్రి దామోదర రాజనర్సింహ్మా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ,ప్రైవేటు ఆస్పత్రులలో అగ్ని ప్రమాద నివారణ చర్యలను తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ్మా అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అగ్నిప్రమాద భద్రత విషయంలో తనిఖీలు నిర్వహించి, నివేదికను రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులలో అగ్నిప్రమాద నివారణ చర్యలపైన మంత్రి దామోదర రాజ నర్సింహ్మా ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో శనివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇటీవల ఉత్తర ప్రదేశ్‌లోని ఒక ఆస్పత్రిలో అగ్నిప్రమాదంలో పిల్లలు చనిపోయిన ఘటనపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

ఇలాంటి ఘటనలు బాధాకరమన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ తనిఖీల నిమిత్తం వెంటనే పది బృందాలను ఏర్పాటు చేసి, ఆ బృందాలు తొలుత గాంధీ, ఉస్మానియా, నీలోఫర్, ఎంజిఎం వంటి పెద్ద ఆస్పత్రులలో తనిఖీలు చేసి నివేదికను సమర్పించాలని సూచించారు. ఫైర్ అలారం, స్మోక్ డిటెక్టర్స్ ఉన్నదా? లేదా అనే అంశాలను కూడా పరిశీలించాలన్నారు. మంటలను ఆరిపేందుకు యంత్రాలు సరిపడా ఉన్నాయో? లేదా కూడా చూడాలని, వాటి గడువు తేదీలను పరిశీలించాలని చెప్పారు. మంటలను ఆర్పేందుకు ఉపయోగించే యంత్రాల వినియోగంపై ఆస్పత్రుల్లో పని చేసే భద్రతా సిబ్బందికి, ఇతర సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ఆస్పత్రులలో విద్యుత్ సరఫరాను, పాత ఎలక్ట్రిక్ కేబుల్స్ ఉంటే, వాటి స్థానంలో, నాణ్యమైన కొత్త కేబుల్స్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్థానిక ఆస్పత్రులు తమ సమీపంలోని అగ్నిమాపక సిబ్బందితో అందుబాటులోఉండాలని, అలాగే ఆస్పత్రులలో అగ్నిప్రమాదంపైన మాక్‌డ్రిల్స్ నిర్వహించాలన్నారు. ప్రతి ఆస్పత్రికి ఫైర్ ఎవరేషన్ ప్లాన్‌ను రూపొందించాలని మంత్రి దామోదర రాజనర్సింహ్మా తెలిపారు.

## నీలోఫర్ ఆసుపత్రిలో పసికందు కిడ్నాప్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీలోఫర్ ఆసుపత్రిలో శనివారం పసికందు కిడ్నాప్‌కు గురయ్యాడు. గుర్తుతెలియని మహిళ తాను ఆసుపత్రి సిబ్బంది అని చెప్పి.. వైద్యం కోసం బాబును తీసుకెళ్లి కిడ్నాప్‌కు పాల్పడింది. వివరాలు ఇలా ఉన్నాయి. జహీరాబాద్‌కు చెందిన హసీనా బేగం, గఫర్ దంపతులకు నెల రోజుల క్రితం బాబు జన్మించాడు. పసికందుకు పసరికలు (జాండీస్) రావడంతో చికిత్స నిమిత్తం తల్లి, అమ్మమ్మ వైద్యం కోసం నీలోఫర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. అయితే చికిత్స కోసం ఎదురుచూస్తున్న వీరి వద్దకు ఆస్పత్రి సిబ్బంది అని చెప్పిన గుర్తు తెలియని మహిళ.. చికిత్స కోసం చిన్నారిని తీసుకెళ్లింది. ఎంతసేపటికి బాబును తీసుకురాకపోవడంతో ఆస్పత్రి మొత్తం వెతికినా బాబు, ఆ మహిళ కనిపించలేదు. అనుమానం వచ్చిన తల్లి హసీనా తన కుమారుడు కిడ్నాప్‌కు గురయ్యాడని గ్రహించి వెంటనే నాంపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో భద్రతా వైఫల్యం కారణంగానే కిడ్నాప్ చేశారని బాధిత తల్లి ఆరోపిస్తున్నారు. పోలీసులు సిసిటివి పుటేజ్‌లను పరిశీలిస్తున్నారు.

## గవర్నర్ ప్రతిభా పురస్కారములకు దరఖాస్తుల గడువు పెంపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గవర్నర్ ప్రతిభా పురస్కారాల కొరకు దరఖాస్తు గడువును పెంచామని గవర్నర్ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నెల 30వ తేదీ సాయంత్రం 5 గంటలకు వరకు అభ్యర్థులు దరఖాస్తులను పంపవచ్చని ప్రకటనలో తెలిపారు. 'గవర్నర్ ప్రతిభా పురస్కారాలు 2024'కు పర్యావరణ పరిరక్షణ విభాగము, దివ్యాంగుల సంక్షేమం విభాగము, క్రీడల విభాగము, సాంస్కృతిక విభాగంలో గత ఐదేళ్లలో 2019 నుండి ఆదర్శమైన అభివృద్ధికి కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలు, సొసైటీలు, ట్రస్టుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

వివిధ వర్గాల నుండి గడువు పొడిగించుటకై వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోనికి తీసుకొని, అవార్డుల కోసం దరఖాస్తులు దాఖలు చేయుటకు గడువు తేదీని పొడిగించడమైనది. ఇట్టి విషయమును గమనించి అర్హులైన వ్యక్తులు, సంస్థలు తమ దరఖాస్తులను గడువు లోపున సమర్పించవచ్చును. దరఖాస్తులను తెలంగాణ రాజ్‌భవన్ వెబ్‌సైట్ https://governor.telangana.gov.inలో అందుబాటులో ఉన్న నిర్దేశిత ఫార్మాట్‌లను సక్రమంగా డౌన్లోడ్ చేసుకుని నామినేషన్ ఫారాలను పూరించి, గవర్నరుకు, ముఖ్య కార్యదర్శి, గవర్నర్ సెక్రటేరియట్, రాజ్ భవన్, సోమాజిగూడ, హైదరాబాద్ 500041 కు స్పీడ్ పోస్ట్ ద్వారా లేదా వ్యక్తిగతంగా అన్ని సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు సమర్పించాలి.


గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
సరూర్‌నగర్ సర్కిల్-5.
NIT.No. 16/EE5/SRNR/GHMC/2024-25, తేది: 22.11.2024
పని పేరు: ''ఐఆర్‌టి'' కోసం (5) పనులు. అంచనా విలువ: రూ.61.60 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం : 29.11.2024న మ.3.01గం.ల వరకు. సంప్రదించవలసిన చిరునామా మరియు సెల్ నం.: శ్రీ కె.శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, జిహెచ్ఎంసి. సెల్: 9989930602. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా http://www.eprocurement.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సరూర్‌నగర్ సర్కిల్-5, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 6989-PP/CL/ADVT/1/2024-25, Date: 23-11-2024


# 'ఉపాధి' నిర్వీర్యం కుట్రను భగ్నం చేద్దాం

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ బాల మల్లేష్

**ప్రజాపక్షం/ధర్మసాగర్:** భారతదేశంలో గ్రామీణ ఉపాధి హామీచట్టంను నిర్వీర్యం చేయడానికి ప్రయత్నం చేస్తున్న బిజెపి కుట్రలకు వ్యతిరేకంగా వ్యవసాయ కార్మిక సంఘాలు అన్నీ దేశవ్యాప్తంగా ఐక్య ఉద్యమాలు కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.బాలమల్లేష్ అన్నారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షులు మంచాల తిరుపతి, నాయకులు మునిగాల బిక్షపతి అధ్యక్షతన ధర్మసాగర్ మండలం, పెద్ద పెండాలలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్ లో జరిగిన హన్మకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలో



బాల మల్లేష్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాలను అమలు పరచడంలో అనేక అవరోధాలు కల్పిస్తూ, గ్రామీణ ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేస్తూ గ్రామీణ ప్రాంతంలో యువతీ యువకులకు ఉపాధిని దూరంగా చేస్తూ దుర్భర పరిస్థితులను కల్పిస్తున్నారని విమర్శించారు. బిజెపి హయాంలో దేశంలో ఆకలి, నిరుద్యోగం, నిరక్షరాస్యత లాంటి సామాజిక రుగ్మతులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ప్రపంచ ఆకలి సూచికలో భారతదేశం 105వ స్థానానికి పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేశంలో గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ కేటాయింపులు పెంచి ఈ పథకాన్ని సక్రమంగా అమలు చేస్తే దేశంలో పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాలు, ఆదివాసులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి ప్రసంగిస్తూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇండ్లు లేని నిరుపేద ప్రజలు వేల సంఖ్యలో ఉన్నారని, వారంతా ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారని, వారందరికీ ఇండ్లు పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహాసభలో బికెఎంయు జాతీయ నాయకులు మోతె లింగారెడ్డి సభా ప్రారంభానికి ముందు ఎర్రజెండా ఎగరవేసిన అనంతరం ప్రసంగించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మంచాల తిరుపతి, జిల్లా కార్యదర్శి కర్రె లక్ష్మణ్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దెల ఎల్లేష్, మునిగాల బిక్షపతి,రాములు,శ్రీనివాస్,శంకర్, గోకుల రాజయ్య, బండ్లోజు రాజమణి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# షో కే స్

# క్రీడ

## మేటి ఆల్‌రౌండర్ బోథమ్

*ప్రపంచ మేటి ఆల్‌రౌండర్లలో ఇంగ్లాండ్ ఆటగాడు ఇయాన్ బోథమ్ పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. అటు బ్యాటింగ్‌లోనూ, ఇటు బౌలింగ్‌లోనూ రాణించిన బోథమ్ అగ్రశ్రేణి క్రికెటర్‌గా వెలుగొందాడు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత కామెంటేటర్‌గా, కోచ్‌గా సేవలు అందిస్తున్నాడు.*

జననం:
24 నవంబర్, 1955
(68 సంవత్సరాలు)

టెస్టు క్రికెట్
బ్యాటింగ్ గణాంకాలు
మ్యాచ్‌లు:102
ఇన్నింగ్స్: 161
నాటౌట్: 6
పరుగులు: 5,200
అత్యధిక స్కోరు: 208
సెంచరీలు: 14
అర్ధ సెంచరీలు: 22
ఫోర్లు: 621
సిక్సర్లు: 44

**బౌలింగ్ గణాంకాలు**
మ్యాచ్‌లు:102
ఇన్నింగ్స్: 168
వేసిన బంతులు: 21,815
మెయిడిన్లు: 788
ఇచ్చిన పరుగులు: 10,878
సాధించిన వికెట్లు: 383
అత్యుత్తమ బౌలింగ్: 8/34
ఒక ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 17 సార్లు
ఒక ఇన్నింగ్స్‌లో కనీసం 5 వికెట్లు: 27.

### వన్డే ఇంటర్నేషనల్స్ బ్యాటింగ్ గణాంకాలు

మ్యాచులు: 116
ఇన్నింగ్స్: 108
నాటౌట్: 15
పరుగులు: 2,113
అత్యధిక స్కోరు: 79
సెంచరీలు: 0
అర్ధ సెంచరీలు: 9
ఫోర్లు: 197
సిక్సర్లు: 44

**బౌలింగ్ గణాంకాలు**
మ్యాచ్‌లు:116
ఇన్నింగ్స్: 115
వేసిన బంతులు: 6,271
మెయిడిన్లు: 109
ఇచ్చిన పరుగులు: 4,139
సాధించిన వికెట్లు: 145
అత్యుత్తమ బౌలింగ్: 4/31
ఒక ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు: 3 సార్లు
ఒక ఇన్నింగ్స్‌లో కనీసం5వికెట్లు: 0.



# సింగపూర్‌లో 'చెస్ ప్రపంచ యుద్ధం'

అసాధారణ మేధా శక్తికి కొలమానంగా భావించే చదరంగం (చెస్) ప్రపంచ యుద్ధం ఈనెల 25 నుంచి మొదలుకానుంది. ప్రపంచ చెస్ సమాఖ్య 'ఫిడె' ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీమెంట్ ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది అభిమానులను ఆకట్టుకోనుంది. 64 గళ్లు... ఇద్దరు ఆటగాళ్లు... వందలు వేల ఎత్తులు.. పైఎత్తులు... చెస్ అభిమానుల పండుగ. ఆధిపత్యాన్ని రుజువు చేసుకునేందుకు ఆటగాళ్లు వ్యూహాత్మకంగా బలగాలను (పావులు) కదిలిస్తుంటే, ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది ఆసక్తిగా చూస్తారు. డిసెంబర్ 13 తేదీ వరకూ జరిగే ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా), చాలెంజర్ గుకేష్ దొమ్మరాజు (భారత్) అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అవసరమైతే టైబ్రేక్‌లతో ఫలితాన్ని తేల్చే ఈ టోర్నమెంట్‌లో 14 గేమ్స్ ఉంటాయి. ఏడున్నర పాయింట్లు సాధించిన ఆటగాడు విజేతగా నిలుస్తాడు. ఒకవేళ ఇద్దరు ఆటగాళ్లకు చెరి ఏడు పాయింట్లు వస్తే, టైబ్రేకర్‌ను అమలు చేస్తారు. కాగా, టోర్నమెంట్‌కు 2023లో అనుసరించిన విధానానికి భిన్నంగా ఈసారి టైబ్రేకర్‌ను ప్లాన్ చేశారు. క్లాసికల్ విధానంలో మొదటి 40 ఎత్తులకు 120 నిమిషాలు (రెండు గంటలు) కేటాయిస్తారు. ఆ తర్వాత ఎత్తులకు నిమిషాల సమయం మాత్రమే ఉంటుంది. 41వ ఎత్తు నుంచి, వేగంగా పావులు కదిపిన ఆటగాడికి 30 సెకన్ల ఇన్సెంటివ్ ఇస్తారు. మొత్తం 14 గేమ్స్‌లో ఎవరు ముందుగా 7.5 పాయింట్లు సంపాదిస్తారో వారికే టైటిల్ దక్కుతుంది. ఒకవేళ స్కోరు సమానంగా ఉంటే, ఒక్కోవైపు 15 నిమిషాల వ్యవధిగ 4 ర్యాపిడ్ గేమ్స్‌లో ఇరువురు ఆటగాళ్లు తలపడాల్సి వస్తుంది. 2.5 పాయింట్లు దక్కించుకున్న ఆటగాడు విజేతగా నిలుస్తాడు. ర్యాపిడ్ విధానంలోనూ చెరి 2 పాయింట్లతో సమవుజ్జీలుగా ఉంటే, ఫలితాన్ని తేల్చడానికి రెండు ర్యాపిడ్ మినీ గేమ్స్‌ను ఆడిస్తారు. ఒక్కో వైపు 10 నిమిషాలు, 5 సెకన్ల ఇంక్రిమెంట్‌తో ఈ పోటీ ఉంటుంది. ఈ ర్యాపిడ్ పోర్షన తర్వాత కూడా స్కోరు సుమానంగా ఉంటే, రెండు బ్లిజ్‌టైమ్‌ల మనీ మ్యాచ్ జరుగుతుంది. దీనిని ఒక్కోవైపు 3 నిమిషాల సమయ నియంత్ర, రెండు సెకెన్ల ఇంక్రిమెంట్‌తో ఆడిస్తారు. 1.5 పాయింట్లు సంపాదించిన ఆటగాడిని విజయం వరిస్తుంది. ఎవరు తెల్లపావులతో ఆడాలనే విషయాన్ని డ్రా ద్వారా నిర్ణయిస్తారు. ఒకవేళ ఈ గేమ్ డ్రా అయితే, రివర్స్ట్ కలర్స్ (గత మ్యాచ్‌లో ఆటగాళ్లు ఆడిన పావులను పరస్పరం మార్చడం)తో మరొక బ్లిట్జ్ గేమ్‌ను అదే సమయ నియంత్రణకు లోబడి జరుపుతారు. ఎవరో ఒకరు గెలిచే వరకూ ఈ గేమ్ ప్రక్రియ కొనసాగుతుంది. ఆ విధంగా చెస్ ప్రపంచ చాంపియన్ ఆవిర్భవిస్తాడు.

### టోర్నమెంట్ షెడ్యూల్

టోర్నమెంట్‌లో ఈనెల 23న ప్రారంభమవుతుందిగానీ, పోటీలు 25న మొదలవుతాయి. 23వ తేదీ శనివారం, మీడియా సమావేశం, ప్రారంభోత్సవం, సాంకేతిక విభాగ సమావేశాలు ఉంటాయి. మరుసటి రోజు, 24వ తేదీని విశ్రాంతి దినంగా నిర్ధారించారు. 25వ తేదీ సోమవారం నుంచి 27వ తేదీ బుధవారం వరకు మొదటి మూడు గేమ్స్ జరుగుతాయి. 28వ తేదీ గురువారం విశ్రాంతి. 29వ తేదీ శుక్రవారం నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు, వరుసగా 4, 5, 6 గేమ్స్ జరుగుతాయి. డిసెంబర్ 2వ తేదీ సోమవారం తిరిగి విశ్రాంతి. 3వ తేదీ మంగళవారం నుంచి 5వ తేదీ గురువారం వరకూ వరుసగా 7, 8, 9 గేమ్స్‌ను నిర్వహిస్తారు. 6వ తేదీ శుక్రవారం విశ్రాంతి. డిసెంబర్ 7వ తేదీ శనివారం నుంచి 9వ తేదీ సోమవారం మధ్య 10,11, 12 గేమ్స్ ఉంటాయి. 10వ తేదీ విశ్రాంతి. 11, 12 (బుధ, గురువారాలు) 13, 14 గేమ్స్ ఆడతారు. ఒకవేళ ఇద్దరు ఆటగాళ్లు సమానమైన పాయింట్లు సంపాదిస్తే, డిసెంబర్ 13వ తేదీ శుక్రవారం టైబ్రేక్ ఉంటుంది. డిసెంబర్ 14వ తేదీ, శనివారం నాటి ముగింపు వేడుకతో టోర్నమెంట్ ముగుస్తుంది. ఒకవేళ టోర్నమెంట్ పద్నాలుగు కంటే తక్కువ గేమ్‌లలోనే పూర్తయితే, ముగింపు వేడక తేదీని ముందుకు జరుపుతారు.




డింగ్ లిరెన్ 1992 అక్టోబర్ 24న జన్మించాడు. వయసు 32 సంవత్సరాలు. 2023 ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌ను గెల్చుకున్న అతను ప్రస్తుతం 2,728 ఎలో రేటింగ్ పాయింట్లతో, ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 23వ స్థానంలో ఉన్నాడు. లిలెన్‌ను సవాలు చేస్తున్న భారత స్టార్ గుకేష్ 2006, మే 29న జన్మించాడు. వయసు 18 సంవత్సరాలు. ఈ ఏడాది జరిగిన క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో గెలవడం ద్వారా ప్రపంచ చాంపియన్‌షిప్‌లో లిలెన్‌తో పోటీ పడే అవకాశాన్ని దక్కించకున్నాడు. 2,783 ఎలో రేటింగ్స్‌గల గుకేష్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 5వ స్థానంలో కొనసాగుతున్నాడు.

ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరేన్‌తో పోటీపడే అవకాశాన్ని సంపాదించడానికి గుకేష్ క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో తీవ్రమైన పోటీని ఎదుర్కొని సత్తా చాటాల్సి వచ్చింది. 2023 ప్రపంచ చాంపియన్‌షిప్ రన్నరప్ హోదాలో ఇయాన్ నెపోమ్నియాచి క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో ఆడే అవకాశాన్ని సంపాదించాడు. ఆ తర్వాత ప్రపంచ చాంపియన్‌షిప్ 2023లో మొదటి మూడు స్థానాల్లో ఉన్న ప్రపంచ నంబర్ వన్ కార్లస్ మాగ్నస్ (2,830 ఎలో పాయింట్లు), ఆర్. ప్రజ్ఞానంద (రన్నరప్), ఫాబియానో కరౌనా (మూడో స్థానం) పోటీపడాల్సి ఉండింది. అయితే, కార్ల్‌సన్ టోర్నీ నుంచి వైదొలగడంతో, నిరుటి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో నాలుగో స్థానాన్ని సంపాదించిన నిజత్ అబసోవ్‌కు క్యాండిడేట్స్ చెస్‌లో ఆడే అవకాశం లభించింది. అంతర్జాతీయ చెస్ సమాఖ్య 'ఫిడే' నిర్వహించిన గ్రాండ్ స్విస్ టోర్నమెంట్ 2023లో విజతే విజేత గుజరాతీ, రన్నరప్ హికారు నకమురా కూడా చోటు దక్కించుకున్నారు. క్వాలిఫయింగ్ పోటీల్లో పాల్గొనకపోయినప్పటికీ, ఫిడే సర్క్యూట్‌లో అత్యుత్తమ స్థానాన్ని సంపాదించిన గుకేష్ దొమ్మరాజుకు పోటీపడే అవకాశం లభించింది. అప్పటికే అర్హత సంపాదించి, 2024 జనవరి నాటికి అత్యుత్తమ ర్యాంక్‌లో కొనసాగుతున్న కారణంగా అలిరెజా ఫిరౌజా కూడా రంగంలో ఉన్నాడు. మొత్తం మీద క్యాండిడేట్స్ టోర్నమెంట్‌కు 8 మంది అర్హత సంపాదించగా, 14 గేమ్స్ ద్వారా 9 పాయింట్లు సంపాదించిన గుకేష్ విజేతగా నిలిచి, ప్రపంచ చాంపియన్‌షిప్ 2024లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌తో పోటీకి అర్హత పొందాడు. భారత ఆటగాళ్లలో ప్రజ్ఞానంద ఐదు, విదిత్ గుజరాతీ ఆరు స్థానాలను ఆక్రమించారు.

చెస్ మొట్టమొదట భారత దేశంలో ఆడేవారని అనడానికి ఆధారాలు ఉన్నాయి. 'చతురంగ' దళాలతో కూడినది కాబట్టి దీనికి 'చదరంగం' అనే పేరు స్థిరపడింది. చెరి 32 చొప్పున, తెలుపు, నలుపు రంగుల్లో మొత్తం 64 గళ్లు చెస్‌బోర్డులో ఉంటాయి. ఈ చెస్ బోర్డును యుద్ధ మైదానంగా భావించారు. ఒక్కో రంగు ఒక్కో రాజు లేదా రాజ్యానికి ప్రతీక. కాల్బలము లేదా భటులు, గుర్రాలు, ఏనుగులు, రథాలు అనే నాలుగు బలగాలను ఇందులో మోహరింప చేస్తారు. ఒక్కో పావుకు ఒక్కో రకమైన కదలికను నిర్ధారించారు. మంత్రికి అన్ని పావుల కదలికలూ ఉంటాయి. రాజును కాపాడడమే లక్ష్యంగా ఈ దళాలను ఆటగాళ్లు ముందుకు నడిపిస్తారు. యుద్ధ కళకు దీనిని ప్రతిరూపంగా పేర్కొంటారు. కాలానుగుణంగా పావుల పేర్లు ఒక్కో ప్రాంతంలో ఒక్కో విధంగా మారినప్పటికీ, కీలక అంశాలు, నిబంధనల్లో మాత్రం ఎలాంటి మార్పు లేదు. కొంత మంది రాజులు తమ పైశాచిక ఆనందం కోసం భారీ చెస్ బోర్డును నేలపైన గీయించి, నిజమైన భటులు, ఏనుగులు, గుర్రాలను మైదానంలోకి దించేవారు. పావులను చంపే విధానంలోనే, వాస్తవంగానే చంపడాలు కొనసాగేవి. అయితే, అలాంటి కొన్ని ఘటనలు లేదా కొంత మంది వికృత చేష్టలను మినహాయిస్తే, దశాబ్దాలుగా చెస్ కోట్లాది మందిని అలరిస్తునే ఉంది. మేధాశక్తికి, ప్రత్యేకించి యుద్ధకళా ప్రావీణ్యానికి నిదర్శనంగా నిలుస్తున్నది.



## 26న ఊరూ–వాడా సిపిఐ ఉత్సవాలు

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** డిసెంబర్ 26న జరిగే సిపిఐ పార్టీ శత వార్షికోత్సవ వేడుకలను ఏడాదిపాటు ఊరు,వాడ ఏకమై ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించాలని సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శనివారం నేరేడుచర్లలోని సిపిఐ కార్యాలయంలో జరిగిన పార్టీ మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా మాట్లాడారు. ఉమ్మడి నేరేడుచర్ల మండలంలో సిపిఐని విస్తృత పరచడం కోసం పార్టీ శ్రేణులు కృషి చేయాలని,మండలంలో పార్టీలేని గ్రామాలలో ప్రజాసంఘాలను నిర్మించడం ద్వారా పార్టీని విస్తృతపర్చవచ్చునని తెలియజేశారు. నవంబర్ 26 నుండి డిసెంబర్ 26 వరకు పార్టీ ప్రజాసంఘాల సభ్యత్వం పునరుద్ధరణ చేపట్టాలని, అన్ని శాఖా మహాసభలను పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ 30న నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రారంభ బహిరంగ సభ జరుగుతుందన్నారు. సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు ధూళిపాళ ధనుంజయ్ నాయుడు, ఉదర వెంకన్న,జిల్లా కార్యవర్గ సభ్యులు మండవ వెంకటేశ్వర్లు,పట్టణ సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాస్‌రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రావుల సత్యం,కొమ్మరాజు వెంకట్,పరికే భరత్ పాల్గొన్నారు.

## కోచింగ్ సెంటర్లపై చర్యలేవి?



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జిల్లా కేంద్రంలో అనుమతులు లేకుండా కోచింగ్ సెంటర్లు నిర్వహిస్తూ నిరుద్యోగులతో చెలగాటం ఆడుతున్నారని అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి బ్రాహ్మండ్లపల్లి యుగంధర్ జిల్లా అడిషినల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం యుగంధర్ మాట్లాడుతూ సరైన సౌకర్యాలు కల్పించకుండా అంబేద్కర్ స్టేడియాన్ని అడ్డగా చేసుకుని నిరుద్యోగుల నుంచి వేలాది రూపాయల వసూలు చేస్తున్నారన్నారు. సరైన ఫ్యాకల్టీ, వసతి లేకుండా ఇరుకిరుకు గదుల్లో ఎస్ఐ, కానిస్టేబుల్, గ్రూప్ 1,2,3,4 బోధిస్తూ విధ్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గరిచేస్తున్నారన్నారు. తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు ప్రైవేట్ కోచింగ్ ఇన్సిటిట్యూట్ వద్ద డబ్బులు దండుకుని గాలికి వదిలేశారన్నారు. సురేందర్ అమరేందర్ రెడ్డి, మహేష్, అనిల్, ప్రకాష్ తదితరులున్నారు.

## 26న కలెక్టరేట్ ముట్టడి



**ప్రజాపక్షం/ఖమ్మం:** కిసాన్ సంయుక్త మోర్చా పిలుపు మేరకు ఈనెల 26న జరిగే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని అఖిలపక్ష రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. 2022లో జరిగిన రైతాంగ పోరాటం సందర్భంగా మోడీ ప్రభుత్వం పోరాటానికి తలొగ్గి రైతాంగ న్యాయబద్దమైన డిమాండ్స్‌ను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని ముఖ్యంగా మూడు నల్ల చట్టాలను రద్దు చేస్తామని చెప్పిందని,దొడ్డి దారిన ఆ చట్టాలను తెచ్చేందుకు ప్రయత్నిస్తుందని సమావేశం ఆరోపించింది. శనివారం రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక అఖిల పక్ష సంయుక్త సమావేశం కాంగ్రెస్‌కార్యాలయంసంజీవరెడ్డిభవన్‌లోజరిగింది. నాయకులు మాట్లాడారు. ఐఎన్‌టియుసి నాయకులు కొత్తా సీతారాములు, ఎండివై పాషా, నరాల నరేష్ మోహన్ నాయుడు,ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గాదె లక్ష్మినారాయణ, తోట రామాంజనేయులు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులుదొండపాటి రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, టియుసిఐ నాయకులు శ్రీనివాస్ ఉన్నారు.

# అదానీ లంచాలపై నాన్చుడు ఎందుకో?

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కేంద్రప్రభుత్వం ఆదానీ లంచాలపై నాన్చుడు ధోరణి ఎందుకని సిపిఐరాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సిపిఐజిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌతం ఆదాని ముడుపుల వ్యవహారంపై ప్రభుత్వ విచారణ సంస్థలు ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. ఈడి, సిబిఐ, సెబీ, ఎన్ఎస్ఈ, బిఎస్ఈలు ఈఅంశంపై ఎందుకుమౌనం వహిస్తున్నారని అనుమానం వ్యక్తంచేశారు. ప్రతిపక్షపార్టీల ప్రతినిధులు, బిజెపియేతర ప్రభుత్వాల్లోని వ్యక్తులపై రూ.100కోట్ల మోసం ఆరోపణలువస్తేనే అడ్డగోలు విచారణలుచేపట్టే ఈఏజెన్సీలు ఆదానివేలకోట్ల లంచాలు ఇచ్చారని స్పష్టమవుతున్న నిశ్శబ్దంగా ఉండటం గమనార్హం. ప్రధానిమోడికి అత్యంత సన్నిహితుడిగా గుర్తింపుపొందిన ఆదాని మోడిగారే పరోక్షంగా రక్షణ కల్పిస్తున్నారని లేకపోతే ఆయనను ఎందుకు అరెస్టుచేయడం లేదని మోడికి నిజాయితి ఉంటే ఆదానిని అరెస్టుచేసి విచారణ జరిపించి ఆయన నిజాయితిని నిరూపించుకోవాలని అన్నారు. ప్రతిపక్షపార్టీ నాయకులను అరెస్టుచేయడంలో చూపిన శ్రద్ధ మోడికి ఆదానిమోసాలపై లేదన్నారు. అదేవిధంగా ఎన్నికల్లో ఇచ్చినటువంటి అన్ని హామీలను రాష్ట్రప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని, రైతుభరోసా, రుణమాఫీ, 4వేల ఫించన్, అంబేద్కర్ అభయహస్తం, మహాలక్ష్మి పథకం వంటివాటిని వెంటనే అమలుచేయాలని లేనిచో రాష్ట్రప్రభుత్వం పైన పోరాటం తప్పదన్నారు. కార్యక్రమంలో జిల్లాకార్యవర్గసభ్యులు హెచ్.ఆనంద్‌జి, కేశవులుగౌడ్, వార్లవెంకటయ్య, చంద్రమౌళి, యేసయ్య, బొల్లెద్దుల శ్రీను, కృష్ణాజి, లక్ష్మి పతి, శివశంకర్, శంకర్‌గౌడ్, మర్యాదవెంకటయ్య, ప్రేమ్, అంజి పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలు వీడండి.. అభివృద్ధికి తోడ్పడండి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** మాధకద్రవ్యాలను విడనాడి సమాజ అభివృద్ధి నేటి యువత కృషిచేయాలని, నేర పూరిత చర్యల పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శతజయంతి వార్షికోత్సవాలను పురస్కరించుకుని అఖిల భారత యువజన సమాఖ్య( ఏఐవైఎఫ్) పెద్దపల్లి జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా మెడికల్ అసోషియేషన్‌హాల్ లో మాదక ద్రవ్యాల నిర్మూలన సమాజ అభివృద్ధిలో నేటి యువత పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మానస్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ముఖ్య నేతలుగా పాల్గొన్నారు.కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ గంజాయి, కొకైన్, హెరాయిన్, చరాస్ తదితర వంటి నిషేధిత డ్రగ్స్‌కు 15 నుండి 25 సంవత్సరాల లోపు విద్యార్థులు ఆకర్షితులు అవుతున్నారని, ఈ విధానాలు రాష్ట్ర అభివృద్ధికి విఘాతం కల్గిస్తాయన్నారు.ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి లింగం రవి మాట్లాడుతూ యువతను నేటి బూర్జువా పార్టీలు కీలు బొమ్మలుగా మార్చాయని, మద్యానికి వ్యసనాలకు బానిసలుగా చేసి యువజన సమస్యలపై పోరాటం చేసేపటిమనుదూరం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం మాట్లాడుతూ మార్పు రావాల్సింది, మార్పు తేవాల్సింది కూడా యువతే కానీ నేటి యువత తమ కర్తవ్యాన్ని విస్మరించి మత్తులో తేలియాడి జ్ఞానాన్ని, విచక్షణను, శక్తిసామర్థ్యాలను కోల్పోయినిర్వీర్యమై. నిస్తేజంగా మారుతున్నారన్నారు. ఏఐవైఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి మార్కపురి సూర్య,జిల్లా ఆఫీస్ బేరర్స్ తాళ్ళపెల్లి సురేందర్,ఆసాల నవీన్, సాధుల శివ,నేతలు ప్రదీప్, నరహరి, కిరణ్, ధీరజ్, భరత్,మురళిలతో పాటు 80 మంది పాల్గొన్నారు.

## యాదవులు రాజకీయంగా మరింత ఎదగాలి



**ప్రజాపక్షం/మునుగోడు:** నీతి నిజాయితీకి కట్టుబడి విశ్వాసానికి మారుపేరు యాదవ కులమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు.శుక్రవారం రాత్రి మునుగోడు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మునుగోడు మండల గొల్ల కురుమ సంఘం ఆధ్వర్యంలో సదర్‌సమ్మేళన ఉత్సవాన్ని నిర్వహించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యంతో కలసి ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిజ్యోతి ప్రజ్వలన చేశారు.జ్యోతి ప్రజల్వన చేసి యాదవ సోదరులతో కలిసి దున్నపోతును ఆడించారు.ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలలో యాదవులు ఆర్థికంగా రాజకీయంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు.సదర్ ఉత్సవాన్ని మొదటగా మునుగోడు నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సదర్‌ను రాష్ట్ర పండగగా గుర్తించిందన్నారు. మునుగోడు నియోజకవర్గ కేంద్రంలో గొల్ల కురుమ సంఘ భవనం కోసం కలెక్టర్ తో మాట్లాడి స్థలం కేటాయింపు జరిగేలా చూస్తానని భవన నిర్మాణానికి తన వంతుగా రెండు లక్షల రూపాయలు ఇస్తానని హామీ ఇచ్చారు. సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాట్లాడుతూ తెలంగాణ అంటేనే ప్రేమ,అభిమానాలు ఉన్న రాష్ట్రం సామాజికమంతాపూలను బతుకమ్మలను పూజించాం. ఇప్పుడు యాదవ సోదరులు పశుసంపదలను పూజిస్తున్నారన్నారు. మునుగోడు ప్రాంతం చైతన్యవంతమైన ప్రాంతమని ఈ ప్రాంతంలో గొల్ల,కురుమల ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను జరుపుకోవడం చాలా ఆనందకరమన్నారు. మాజీ రాజ్య సభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ దూదిమట్ల బాలరాజు యాదవ్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, డిసిసిబి ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ కుంభం శ్రీనివాస్ రెడ్డి,జక్కలి అయిలయ్య యాదవ్,తీర్పారి వెంకటేశ్వర్లు,బూడిద లింగయ్య యాదవ్, చాపల శ్రీను, కర్నాటి స్వామి యాదవ్, లొడంగి గోవర్ధన్, తాటి కొండ సైదులు, దోటి నారాయణ,సాగర్ల లింగ స్వామి, బొల్లం వెంకన్న, చాపల విప్లవ్, బీసం విజయ్,బెల్లి పూర్ణ, నక్క వెంకన్న పాల్గొన్నారు.



## విజయోత్సవాలకు డబ్బు ఉండి.. ఫీజు బకాయికి లేవా? : మణికంఠరెడ్డి

**ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల సెమిస్టర్ పరీక్షలకు ఆటంకం కలుగుతుందని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన ప్రసంగించారు. రాష్ట్రంలో సంక్షేమ, గురుకులాల హాస్టళ్ళలో విద్యార్థులకు ఫుడ్ పాయిజన్‌లు జరుగుతూ విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజా విజయోత్సవాలకు ఉన్న పైసలు ఫీజు బకాయిల విడుదలకి లేవా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలసాని లెనిన్, జిల్లా కన్వీనర్ బచ్చలి అభిరామ్, నాయకులు ప్రశాంత్, జనగామ ప్రణయ్, ఎలుపుల సాయి నీక్షిత్, సందీప్, ప్రశాంత్, వెంకటేశ్, మనిదీప్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య పోరులో సిపిఐది కీలకపాత్ర



**ప్రజాపక్షం/ (నల్లగొండ) కేతపల్లి :** భారత దేశ స్వాతంత్ర సమరంలో, తెలంగాణ రాష్ట్ర సాధన విషయంలో సిపిఐ ప్రముఖ పాత్ర వహించడం జరిగిందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. కేతపల్లి మండలం గుడివాడలో సిపిఐ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దేశంలో అనేక పోరాటాలకు ఆలవాలమై 100 సం వత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నల్లగొండలో గొప్ప బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. వాగ్దానాలను వెంటనే అమలు పరచాలని ఆయన కోరారు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు గౌనీ లక్ష్మీ నరసయ్య, మండల కన్వీనర్ ఊట్కూరు నరసింహారాజు, జాజాల జంగయ్య, గోలి అంజయ్య, సూరారపు అంబేద్కర్ పాల్గొన్నారు.

## తొలి అడుగులోనే..
# ప్రియాంక గాంధీ విజయఢంకా

**వయనాడ్ :** కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ వాద్రా తొలి అడుగులోనే విజయఢంకా మోగించారు. వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో భారీ విజయాన్ని సాధించారు. ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాల ప్రకారం సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్‌కు చెందిన సత్యం మొకెరిపై 4.1 లక్షల ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఎల్‌డిఎఫ్ అభ్యర్థి సత్యం మొకెరి 2,11,407 ఓట్లతో రెండోస్థానంలో, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ అభ్యర్థి నవ్య హరిదాస్ 1,09,939 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో వయనాడ్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఆమె సోదరుడు రాహుల్ గాంధీకి లభించిన 6,47,445 ఓట్ల కంటే ప్రియాంకకు 6,22,338 ఓట్లు వచ్చాయి, అయితే రాహుల్ గాంధీ 3,64,422 ఓట్ల మెజారిటీ సాధించగా, అంతకన్నా ఎక్కువగా ప్రియాంక 4,10,931 ఓట్ల మెజారిటీతో విజయఢంకా మోగించారు. 14 లక్షలకు పైగా ఓటర్లు ఉండగా, ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 74 శాతం పోలింగ్ నమోదైంది. అయితే ఈ ఉప ఎన్నికల్లో 65 శాతానికి తగ్గింది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో వయనాడ్‌లో సిపిఐకి చెందిన అన్నీ రాజా 2,83,023 ఓట్లతో రెండో స్థానంలో నిలవగా, బిజెపి అభ్యర్థి కె. సురేంద్రన్ 1,41,045 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. అయితే, కొండ ప్రాంతంలో ఓటింగ్ శాతం తగ్గినప్పటికీ, ఉపఎన్నికల్లో రెండు ఫ్రంట్‌లు తమ పనితీరును ప్రతిబింబించలేకపోయాయి.



**వయనాడ్ ప్రజలకు ప్రియాంక ధన్యవాదాలు**

కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి జరిగిన ఉప ఎన్నికల్లో యుడిఎఫ్ అభ్యర్థి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా 4 లక్షలకు పైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా స్పందిస్తూ పార్లమెంట్‌లో వయనాడ్ ప్రజల గొంతుకగా ఉండేందుకు ఎదురు చూస్తున్నానన్నారు. తనకు మార్గంచూపి అనునిత్యం తన వెన్నంటే ఉన్న ప్రతిపక్ష నేత, తన సోదరుడు రాహుల్‌గాంధీకి ప్రియాంక ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా వయనాడ్‌లో శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో అఖండ విజయం సాధించిన తరువాత పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీలోని ఆయన నివాసంలో కలిశారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా తనకు మద్దతు తెలిపినందుకు ప్రియాంక ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. 'వయనాడ్‌లోని నా ప్రియమైన సోదరీమణులారా, సోదరులారా, మీరు నాపై ఉంచిన నమ్మకానికి నేను కృతజ్ఞతతో ఉప్పొంగిపోయాను. ఈ విజయం మీ విజయమని మీరు నిజంగా భావిస్తున్నారని మీకు ప్రాతినిధ్యం వహించడానికి మీరు ఎంచుకున్న వ్యక్తి మిమ్మల్ని అర్థం చేసుకుంటుందని నేను భావిస్తున్నాను. మీలో ఒకరిగా మీ కోసం పోరాడుతుంటా' అని ప్రియాంక గాంధీ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. యుడిఎఫ్‌లోని తన సహచరులు, కేరళలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వలంటీర్లు, తన కార్యాలయ సహచరులు, ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. రోజుకు 12 గంటల పాటు కారు జర్నీలు చేస్తూ, నిజమైన సైనికుల్లా పనిచేస్తూ సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కూడా పార్లమెంట్‌లో తమ వాణిని వినిపించేందుకు 'ఉగ్రమైన, నిబద్ధత కలిగిన' నాయకుడిని ఎన్నుకున్నందుకు వయనాడ్ ప్రజలను అభినందించారు.

## ఉప ఎన్నికల్లో
# అధికారపార్టీలకే పట్టం

**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలు సహా 15 రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ స్థానాలు, రెండు లోక్‌సభ స్థానాలకు ఉప ఎన్నికలు జరిగ్గా.. శనివారం ఫలితాలు వెలువడ్డాయి. మహారాష్ట్రలో మహాయుతి, జార్ఖండ్‌లో జెఎంఎం–కాంగ్రెస్‌లతో కూడిన విపక్ష కూటమి ఘన విజయం సాధించింది. అనేక రాష్ట్రాల ఉప ఎన్నికల్లోనూ బిజెపికి మిశ్రమ ఫలితాలు వచ్చాయి. అస్సాం, బీహార్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లో మెజార్టీ స్థానాలు ఎన్‌డిఎ గెలుచుకోగా.. బెంగాల్‌లో మాత్రం ఆరు స్థానాలను టిఎంసి కైవసం చేసుకుంది. ఆయా రాష్ట్రాల ఉప ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే.. అస్సాంలో ఐదు స్థానాలకు ఐదింటినీ ఎన్‌డిఎ కైవసం చేసుకుంది. సమగురి నియోజకవర్గంలో పోటీ ఇచ్చినప్పటికీ కాంగ్రెస్ ఓటమి చవిచూసింది. బీహార్‌లో నాలుగు స్థానాలు ఎన్‌డిఎ గెలుచుకుంది. రెండు స్థానాల్లో బిజెపి అభ్యర్థులు, హిందుస్తానీ అవామ్ మోర్చా, జెడియులు ఒక్కో చోట విజయం సాధించాయి. ప్రశాంత్ కిశోర్ పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టినప్పటికీ.. ఏ ఒక్కరూ విజయం సాధించలేదు. ఛత్తీస్‌గఢ్‌లో ఒక స్థానానికి ఉప ఎన్నిక జరిగ్గా.. అందులో బిజెపి అభ్యర్థి సునీల్ కుమార్ సోనీ విజయం సాధించారు. గుజరాత్‌లో వావ్ అసెంబ్లీ స్థానానికి పోలింగ్ జరిగింది. ఇక్కడ బిజెపి అభ్యర్థి ఠాకూర్ స్వరూప్ జీ సర్దార్జీ గెలుపొందారు. కర్ణాటకలో మూడు స్థానాలకు గాను మూడింటినీ కాంగ్రెస్



కైవసం చేసుకుంది. పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చెన్నపట్నలో జెడిఎస్ నేత కుమారస్వామి తనయుడు నిఖిల్ పోటీ చేసి ఓడిపోయాడు. కేరళలో రెండు స్థానాలకు ఎన్నిక జరిగింది. పాలక్కాడలో కాంగ్రెస్, చెలక్కరలో సిపిఐ(ఎం) అభ్యర్థులు గెలుపొందారు. ఇక్కడి వయనాడ్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ నేత ప్రియాంక గాంధీ 4 లక్షలకుపైగా మెజార్టీతో ఘన విజయం సాధించారు. మధ్యప్రదేశ్‌లో రెండు స్థానాలకు ఉప ఎన్నిక జరగ్గా.. విజయ్‌పుర్‌లో కాంగ్రెస్ విజయం సాధించగా, బుద్నీలో బిజెపి అభ్యర్థి ఆధిక్యంలో కొనసాగుతున్నారు. మేఘాలయాలో ఒక స్థానానికి పోలింగ్ జరిగింది. ఇక్కడ నేషనల్ పీపుల్స్ పార్టీ అభ్యర్థి విజయం సాధించారు. పంజాబ్‌లో నాలుగు స్థానాలకు జరిగిన ఉప ఎన్నికలో మూడు చోట్ల ఆమ్ ఆద్మీ పార్టీ కాంగ్రెస్ ఒకచోట గెలుపొందాయి. రాజస్థాన్‌లో ఏడు స్థానాలకు గాను ఐదు చోట్ల బిజెపి విజయం సాధించింది. దౌసాలో కాంగ్రెస్ అభ్యర్థి, చొరాసీలో భారత్ ఆదివాసీ పార్టీ అభ్యర్థులు గెలుపొందారు. సిక్కింలో రెండు స్థానాల్లో సిక్కిం క్రాంతికారీ మోర్చా గెలుపొందింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో మొత్తం తొమ్మిది స్థానాలకు ఉపఎన్నిక జరిగింది. భాజపా ఆరు స్థానాల్లో విజయం సాధించగా సమాజ్ వాదీ పార్టీ (ఎస్‌పి) రెండు, ఆర్ఎల్‌డి ఒక చోట విజయం సాధించాయి. ఉత్తరాఖండ్‌లో ఒక అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో బిజెపి గెలుపొందింది. పశ్చిమ బెంగాల్‌లో ఆరు స్థానాలకు అన్నింటినీ తృణమూల్ కాంగ్రెస్ కైవసం చేసుకుంది. వయనాడ్ లోక్‌సభ నుంచి కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ గెలుపొందగా, నాందేడ్ నుంచి బిజెపి అభ్యర్థి సంతకుక్‌రావ్‌లు విజయం సాధించారు.

## ప్రభావం చూపని చిన్న పార్టీలు

**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో చిన్న పార్టీలు ఏ మాత్రం ప్రభావం చూపలేదు. రాజ్‌ఠాక్రేకు చెందిన 'ది మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్)', ప్రకాష్ అంబేద్కర్ పార్టీ 'వంచిత్ బహుజన్ అఘాడీ (విబిఎ)' పార్టీ ఎంత మాత్రమూ ప్రభావం చూపించలేకపోయాయి. శనివారం వెలువడిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయాన్ని సాధించింది. అయితే సమాజ్‌వాది పార్టీ, ఎంఐఎం కొంచం మెరుగైన స్థానాన్ని కనబరిచాయి. కాగా, ఎంఎన్‌ఎస్ 125 స్థానాల్లో అభ్యర్థులను పోటీకి దింపగా, విబిఎ 200 మంది అభ్యర్థులను బరిలోకి దించింది. ముంబయిలోని మహిం సీటులో పోటీ చేసిన ఎంఎన్‌ఎస్ చీఫ్ కుమారుడు అమిత్ ఠాక్రే మూడవ స్థానానికే పరిమితయ్యారు. రాజు శెట్టి నేతృత్వంలోని స్వాభిమాని పక్ష 19 నియోజకవర్గాల్లో పోటీ చేయగా, ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయింది. పశ్చిమ మహారాష్ట్రలో రైతులపై ప్రభావం చూపినట్లు తెలిసింది. యాదృచ్ఛికంగా, ఓట్ల లెక్కింపు ముందు అంబేద్కర్ మాట్లాడుతూ తన పార్టీకి గణనీయమైన సంఖ్యలో సీట్లు వస్తాయని, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల పక్షాన్ని ఎన్నుకుంటామని పేర్కొన్నారు.

# మహారాష్ట్రలో సజావుగా కొత్త ప్రభుత్వం

### విలేకరుల సమావేశంలో ఏక్‌నాథ్‌షిండే, దేవేంద్రఫడ్నవీస్, అజిత్‌పవార్ స్పష్టీకరణ

**ముంబయి :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చరిత్రాత్మకమైనవని, ప్రభుత్వ ఏర్పాటు సజావుగా ఏర్పాటు అవుతుందని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే స్పష్టం చేశారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి), శివసేన పార్టీ ఎవరికి చెందాలో వారు నిర్ణయించుకున్నారని తెలిపారు. శనివారం వెలువడుతున్న ఫలితాలలో అధికార బిజెపి, శివసేన, ఎన్‌సిపి సంకీర్ణం భారీ విజయం సాధించేందుకు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో మహాయుతి నేతలు శనివారం ముంబయిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తదుపరి ప్రభుత్వం సజావుగానే ఏర్పడుతుందన్న దీమా వ్యక్తం చేశారు. ఉపముఖ్యమంత్రి దేవేందర్ ఫడ్నవీస్ మాట్లాడుతూ ప్రజలు బుజ్జగింపు రాజకీయాలను తిరస్కరించారని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన 'ఏక్ హై తో సేఫ్ హై' ఐక్యతా సందేశానికి ప్రజలు ప్రతిస్పందించారని తెలియజేశారు. భారీ ఓటమితో అధికారకూటమికి ఒరిగిందేమీలేదని, ఆర్థిక క్రమశిక్షణ వస్తుందని ఎన్‌సిపి నేత, డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్‌పవార్ అన్నారు. ప్రత్యర్థివర్గాల పేలవ ప్రదర్శనను



ప్రస్తావించగా షిండే, అజిత్‌పవార్ ఇద్దరూ స్పందిస్తూ శివసేన, ఎన్‌సిపి ఎవరికి చెందాలన్నది ప్రజలు ఫలితాల ద్వారా చూపించారని చెప్పారు.అన్ని ఫలితాలు ప్రకటించిన తర్వాత మా ఎమ్మెల్యేలు ముంబయికి వస్తారు. మూడు పార్టీలు వారి నాయకుడిని ఎన్నుకుంటాయి అని ఫడ్నవీస్ అన్నారు. మూడు పార్టీలు తమ సీట్ల పంపకాన్ని సామరస్య పూర్వకంగా ఖరారుచేశాయని, ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియకు ఎలాంటి ఆటంకం ఉండదని ఏక్‌నాథ్ షిండే చెప్పారు.లోక్‌సభ ఎన్నికల పరాజయం నుంచి పాఠాలు నేర్చుకుని ఈ అసెంబ్లీ ఎన్నికలలో దిద్దుబాటు చర్యలు చేపట్టామని అజిత్ పవార్ వివరించారు.

**మహారాష్ట్ర సిఎం పోస్టుపై గొడవపడకండి : ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్**

అంతకు ముందు విలేకరుల సమావేశంలో బిజెపిముఖ్యనేత, మహారాష్ట్ర డిప్యూటీ సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవిపై ఎలాంటి వివాదం లేదని, మహాయుతి నేతలు అందరూ కలిసికట్టుగా నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. బిజెపి, శివసేన, ఎన్‌సిపిలతో కూడిన మహాయుతిలో ముఖ్యమంత్రి పదవిపై ఎలాంటి గొడవలు లేవని ఫడ్నవీస్ స్పష్టం చేశారు. బిజెపిలోని కొందరు నేతలు ఫడ్నవీస్‌నే ముఖ్యమంత్రి చేయాలని డిమాండ్ చేయడంతో మహారాష్ట్ర బిజెపి ముఖ్యనాయకుడైన దేవేంద్ర ఫడ్నవీస్ ముంబయిలో విలేకరుల సమావేశంలో ఈ వివరణ ఇచ్చారు. మహారాష్ట్ర ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతు నిస్తుందని, మహారాష్ట్ర ప్రజలు ఎన్నికల ఫలితాల ద్వారా స్పష్టం చేశారని, ముఖ్యంగా మహిళా ఓటర్లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ఫడ్నవీస్ అన్నారు. నాథ్ షిండే సారథ్యంలోని పార్టీయే బాలాసాహెబ్ ఠాక్రేకు నిజమైన శివసేన పార్టీయని మహారాష్ట్ర ప్రజలు నిరూపించారని దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. తాను ఎవరిపైనా ప్రతీకారం తీర్చుకోనని, ఎవరిని ఎన్నుకోవాలనేది ప్రజలు నిర్ణయించేది కాబట్టి వారి తీర్పును శిరసావహిస్తానన్నారు. ఈ సారి ప్రజలు తమ పార్టీ వైపు నిలబడ్డారని, సంఖ్యను బట్టి ప్రతిపక్ష సభ్యులకు విలువ ఇవ్వకుండా చిన్న చూపు చూడనని, మా పార్టీ నాయకుల నుంచి నేను ఎంతో మద్దతు సాధించగలిగాను కాబట్టే కొంతమంది ఫడ్నవీస్‌ను ముఖ్యమంత్రి చేయాలనే కోరికను వ్యక్తం చేశారని ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ స్పష్టం చేశారు.

## నోటాకు తగ్గిన ఓట్లు

**న్యూఢిల్లీ :** మరోసారి 'నోటా'ను ఓటర్లు పెద్దగా పట్టించుకోలేదు. మహారాష్ట్ర, జార్ఖండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు శనివారం వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్రలో నోటాకు 0.75 శాతం, జార్ఖండ్‌లో 1.32 శాతం ఓట్లు వచ్చాయి. మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరగగా, నోటాకు ఒక శాతం కంటే తక్కువగా ఓట్లు వచ్చినట్లు ఎన్నికల కమిషన్ (ఇసి) గణాంకాల ద్వారా వెల్లడైంది. జార్ఖండ్‌లో ఒక శాతం దాటినట్లు తేలింది. ఈనెల 20వ తేదీన మహారాష్ట్రలో ఒక విడతలో జరిగిన ఎన్నికల్లో 65.02 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈనెల 13, 20వ తేదీల్లో రెండు దశల్లో పోలింగ్ జరగగా, మొదటి విడతలో 66.65 శాతం, రెండవ విడతలో 68.45 శాతం ఓటింగ్ జరిగింది. కాగా, ఇటీవల జమ్మూకశ్మీర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హర్యానా కంటే ఎక్కువగా నోటాకు ఓట్లు వచ్చాయి. 90 స్థానాలు ఉన్న హర్యానా అసెంబ్లీ జరిగిన ఎన్నికల్లో 67.90 శాతం ఓటింగ్ జరగగా, 0.38 శాతం ఓట్లు నోటాకు వచ్చాయి.

## అసోంలో ఘోర రోడ్డు ప్రమాదాలు

### 8 మంది మృతి, మరో నలుగురికి గాయాలు

గువహటి : అసోంలో ఘోర రోడ్డు ప్రమాదాలు జరిగాయి. బజలీ, ధుబ్రీ జిల్లాల్లో వేర్వేరుగా జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం చెందారు. బజలీ జిల్లాలో బాధితుల వాహనం ఓ స్టేషనరీ ట్రక్కును ఢీకొట్టింది. దీంతో వాహనంలో ఉన్న ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. ధుబ్రీ జిల్లాలో జరిగిన మరో ఘటనలో అగోమనిలోని గారేహట్ సమీపంలో ఓ వాహనం, స్టేషనరీ ట్రక్కు ఢీకొన్నాయి. దీంతో వాహనంలో ఉన్న ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. బజలీ ఘటనలో బాధితులు రాస్ పండుగకు వెళ్లి అనంతరం వారు నల్బారీకి తిరిగి వస్తుండగా భాబనిపూర్ వద్ద బాధితులు ప్రయాణిస్తున్న వాహనం ట్రక్కును ఢీనకగా అక్కడికక్కడే ఐదుగురు మృతి చెందారు. ప్రమాదంలో గాయపడిన మరో ఇద్దరిని ఫఖ్రుద్దిన్ అలీ అహ్మద్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రికి తరలించామని, వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతులను ఆశీష్ హబీబ్ ఖాన్, మిజ్‌నూర్ రెహమాన్, రాయల్ ఖాన్, మిజనూర్ ఖాన్, మోనియల్ హెక్యూగా గుర్తించారు. ధుబ్రీ ప్రమాదంలో బాధితులు గౌరీపూర్ నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహర్‌లో జరిగుతున్న రాస్‌కు వెళ్తుండగా ప్రమాదం వాటిల్లింది. దీంతో ఘటనాస్థలిలోనే ముగ్గురు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులు ధుబ్రీ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.571 కోట్ల కేటాయింపు



- రెండేళ్లలో 45 వేల ఎకరాలకు సాగునీరు
- ఉన్నతాధికారుల సమీక్షలో మంత్రులు ఉత్తమ్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** మంథని శాసనసభ నియోగవర్గం పరిధిలోని 63 గ్రామాలను సస్యశ్యామలం చేయగల చిన్న కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 2007లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు పనులు ఇప్పటిదాకా 75 శాతం పూర్తయ్యాయి. కాగా ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకాన్ని తక్షణం పూర్తి చేయాలసిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చింది. శనివారం ఎర్రమంజిల్ జలసౌధలో నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబుల సమక్షంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. చిన్న కాళేశ్వరం (ముక్తేశ్వర్) ఎత్తిపోతల పథకం పనులకు రూ.571.57 కోట్ల పరిపాలన అనుమతి లభించినట్టు సమీక్ష అనంతరం మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. మొత్తం 45 వేల ఎకరాలకు సాగునీరు, అర టిఎంసిల నీటిని మంచి నీటి సరఫరా కోసం వినియోగించనున్నట్టు ఆయన తెలిపారు. గోదావరి నుంచి అప్రోచ్ కెనాల్ ద్వారా నీటిని తరలించి కన్నెపల్లి వద్ద ఒకటో పంప్ హౌజ్ ద్వారా 4.2 టిఎంసిల నీరు దిగువన రెండో పంప్ హౌజ్‌కు నీరు సరఫరా అవుతుంది. మొదటి పంపు హౌజ్ సెకనుకు 600 క్యూబిక్ ఫీట్ల నీటిని ఎత్తిపోస్తుంది. అక్కడి నుంచి మందిరం చెరువు, ఎర్ర చెరువుకు నీటి సరఫరా జరుగుంది. మిగిలిన నీరు రెండో పంపు హౌజ్‌కు చేరుతుంది. కాటారంలో ఏర్పాటు చేసే రెండో పంపు హౌజ్ ద్వారా గారెపల్లి, పోలారం, తాంద్ర, యెల్లాపూర్, కొత్తపల్లి, రుద్రారం, ధన్వాడ, ఆదివారంపేట, గుమ్మలపల్లి, వీరాపూర్, గూడూర్ చెరువులకు గోదావరి జలాలు చేరతాయి. ఈ పథకంలో భాగంగా ఎర్ర చెరువు సామర్థ్యాన్ని పెంచుతారు. వరదకు తెగిపోయిన రుద్రారం చెర్వు గండిని పూడ్చి బలోపేతం చేసే పనులు కూడా పూర్తి కావచ్చాయి. రానున్న రెండేళ్లలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేసి చెరువుల ద్వారా సాగునీరు అందించాలని నీటి పారుదల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది.శ్రీరాంసాగర్ నీటితో 28 వేల ఎకరాల ఆయకట్టు ప్రస్తుతం మంథని నియోజకవర్గంలో శ్రీరాంసాగర్ జలాలతో 28,800 ఎకరాలకు సాగునీరు అందుతోంది. డి 83 డిస్ట్రిబ్యూటరీ కెనాల్ ద్వారా గుండారం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాలు చేరుకుంటాయి. అక్కడి నుంచి 24 మైనర్ కాల్వల ద్వారా మొత్తం 28.800 ఎకరాలకు సాగునీరు అందేది. కాగా కాలక్రమేణ మైనర్ల కాలువ పూడిక చేరడం లాంటి పలుకారణాల వల్ల నిర్దేశిత ఆయకట్టుకు నీరు అందడం లేదు. గుండారం చెరువు నుంచి మైనర్ల చివరి వరకు మరమ్మతులు జరిపి నీటి సామర్థ్యాన్ని పెంచాలని మంత్రి శ్రీధర్ బాబు ఈ సందర్భంగా శ్రీరాంసాగర్ ఇంజనీర్లను ఆదేశించారు.

## పాక్‌లో కొనసాగుతున్న హింస

### తెగల మధ్య ఘర్షణ : 37 మంది పైగా మృతి!

**పెషావర్ :** పాకిస్థాన్ వాయువ్యప్రాంతంలో హింసాకాండ ఎడతెగకుండా కొనసాగుతున్నది. తెగల మధ్య చెలరేగిన హింసాకాండలో 37 మంది మరణించారు. మరో 33 మంది గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. స్వతంత్ర, వైద్య సహాయ బృందాలు కూడా ఈ సమాచారాన్ని ధృవీకరించాయి. ఇళ్ళు, దుకాణాలు దగ్ధమయ్యాయి. ఉన్నతస్థాయి అధికారులు హుటాహుటిన హెలికాప్టర్లలో ఆ ప్రాంతానికి తరలివెళ్ళారు. ఇదిలా ఉండగా తెగలమధ్య హింస, ఉగ్రవాద దాడులను వ్యతిరేకిస్తూ పాకిస్థాన్‌లో శనివారంనాడు నిరసన ప్రదర్శనలు జరిగాయి. అఫ్గానిస్థాన్ సరిహద్దుల్లో ఉన్న కుర్రం జిల్లాలో అలిజై–బగన్ తెగలమధ్య ప్రధానంగా ఈ హింసాత్మక ఘర్షణలు చెలరేగాయి. ఉద్రిక్తత నెలకున్న గ్రామాల్లో ప్రజలు భయంతో సురక్షిత ప్రాంతాలకు పారిపోయారు. పరిస్థితి క్షీణించడంతో కుర్రం జిల్లాలో శనివారంనాడు విద్యాసంస్థలను మూసివేశారు. జిల్లా అంతటా మొబైల్ సిగ్నల్స్ అందకుండా అధికారులు స్తంభింపజేశారు.

ఈ ప్రాంతంలో బలిష్కెల్, ఖార కలి, కుం జ్ అలిజై, మఖ్బాల్ తెగలమధ్య కాల్పుల యుద్ధం కొనసాగుతున్నది. శాంతిని పునరుద్ధరించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు. ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలో గడచిన 24 గంటల్లో హింసాకాండ చెలరేగిందని పోలీసులు శనివారం చెప్పారు. కుర్రంజిల్లా పెషావర్–పరఛినర్ మధ్య గురువారంనాడు పోలీసు మద్దతుతో బగన్ టౌన్ నుండి రహదారిపై 200 ప్రయాణికుల వాహనాలు వెళుతుండగా ఉగ్రవాదులు నాలుగు వైపులనుండీ దాడులు చేసి కాల్పులు జరపడంతో 47 మంది మరణించారు. బగన్, మందురి, ఒఛాట్ ల లో 50కిపైగా ప్రయాణికుల వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటన తర్వాత ఈ ప్రాంతం లో పరిస్థితులు అదుపులోకి రాలేదు. దాని కొనసాగింపుగా అలిజై–బగన్ తెగలమధ్య హింసాకాండ చెలరేగింది. గిరిజనలు ఒకరిపై మరొకరు ల క్ష్య ంగా దాడులు చేసుకుంటూ రక్తం కళ్ళజూస్తున్నా రు. ఇంతకుముందు జులై, సెప్టెంబరు నెలల్లో కూ డా ఘర్షణలు చెలరేగి డజన్లసంఖ్యలో మరణా లు సంభవించాయి. దాంతో గిరిజన మండళ్ళు రంగంలోకి దిగి ఒప్పంద సయోధ్యలు, రాజీలు చే శా యి. ఆ తర్వాత కూడా ఈ హింస కొనసాగుతున్నది.

# మూగజంతువులూ 'ఉక్కిరిబిక్కిరి' !

### యజమానులు..జంతుప్రేమికులు ఆవేదన

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో పెరిగిపోతున్న కాలుష్య స్థాయిలతో పెంపుడు కుక్కలు, వీధి జంతువులు నరకయాతనను అనుభవిస్తున్నాయి. నోరులేని మూగజీవుల ఆరోగ్యసమస్యలు, ప్రవర్తనామార్పుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని వాటి యజమానులు,



జంతు సంక్షేమ కార్యకర్తలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని శనివారం ఇక్కడి పశువైద్యాధికారులు తెలియజేశారు. ఇటీవలి కాలుష్య తీవ్రతతో చాలా జంతువులు శ్వాసకోస సమస్యలను ఎదుర్కొంటున్నాయని, తీవ్రస్థాయిలో దగ్గు, ముక్కుకారడం, వాంతులు, విరేచనాలు, ఛాతీ, రక్తచలన దోషాలు సంభవించడంతో వాటి యజమానులు, జంతు ప్రియులు ఆందోళనకు గురవుతున్నారని పశువైద్యాధికారులు చెప్పారు. ఢిల్లీ అటవీ, వన్యప్రాణుల శాఖకు చెందిన సుమిత్‌నగర్ నివాసియైన కన్సల్టింగ్ వెటర్నరీ డాక్టర్ ఒకరు మాట్లాడుతూ జంతువులలో శ్వాసపరమైన వ్యాధులు అధికం అవుతున్నాయని తెలిపారు. ఢిల్లీలో మనుషులు ఎదుర్కొంటున్న తరహాలోనే జంతువులు కూడా అదే పరిస్థితిని ఎదుర్కోవడం బాధ కలిగిస్తోందని, ఊపిరితిత్తుల డ్యామేజీ, ఊపిరితిత్తుల్లో నిమ్ము వ్యాధులతో ఊపిరాడటంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవడం గతంలో ఎన్నడూ ఈ రీతిలో, తీవ్రస్థాయిలో జరగలేదన్నారు. దీపావళి పండుగ సందర్భంగా శబ్దకాలుష్యం, శరీరం కాలడం లాంటి సమస్యలు తీవ్రతరం కావడం నిర్ఘాంతపరిచిందన్నారు. అంతేకాకుండా ప్రత్యేకించి కోతులు ఆ శబ్దాలకు అనుకోకుండా కరెంట్ వైర్లను పట్టుకుని షాక్‌కు గురై తల్లడిల్లిపోతున్న హృదయవిదారక దృశ్యాలు కంటబడి కలిచివేశాయని పశువైద్యాధికారులు ఆవేదన చెందారు. ఈ కాలుష్య బారి నుంచి పెంపుడు జంతువులకు ఊరట కల్పించేందుకు వాటిని ఔట్‌డోర్ వాక్ కు తీసుకెళ్లినపుడ్పు ఇతర కుక్కలు దాడిచేయడంతో ప్రవర్తనలో మార్పులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఉదయం, పగలు నాకుక్కలను ఔట్‌డోర్ వాక్‌కు తీసుకు వెళ్లడం కష్టతరం అవుతోంది. విషపూరితమైన వాయువుల వల్ల కుక్కలు దగ్గుబారిన పడుతున్నాయని, వాంతులు చేసుకుంటున్నాయి' అని పితంపుర నివాసి సుజాత భట్టాచార్య తీవ్రస్థాయిలో ఆవేదన వ్యక్తం చేశారు.

## టి-సాట్ ను సందర్శించిన పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ శాసన మండలి సభ్యులు, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ శనివారం టి సాట్ (తెలంగాణ శాటిలైట్ స్కిల్ అండ్ అకాడమిక్స్) ను సందర్శించారు. సిఇఒ బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి ఆహ్వానం మేరకు టిసాట్ కార్యాలయాన్ని సందర్శించిన మహేష్ కుమార్ గౌడ్ కార్యాలయ నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేస్తూ వేణుగోపాల్ రెడ్డిని అభినంధించారు. తొలి సారి టిసాట్ కార్యాలయానికి వచ్చిన మహేష్ కుమార్ గౌడ్ ను సిఇఒ వేణుగోపాల్ రెడ్డి ఘనంగా సత్కరించి, సన్మానించారు. అనంతరం కార్యాలయంలోని వివిధ విభాగాలను సిఒఇ తో కలిసి పరిశీలించారు. టిసాట్ పనితీరుకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాల అమలులో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా టిసాట్ నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పరంగా అవసరమై సహాకారాన్ని అందించేందుకు సహకరిస్తానని మహేష్ కుమార్ గౌడ్ హామీ ఇచ్చారు.



## ఇమ్రాన్‌ఖాన్ నిరసన ర్యాలీ భగ్నానికి భారీ ఏర్పాట్లు

**ఇస్లామాబాద్ :** ఇస్లామాబాద్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టాలని పాకిస్థాన్ మాజీ ప్రధానమంత్రి ఇమ్రాన్‌ఖాన్ (72) ఇచ్చిన పిలుపును విఫలం చేసేందుకు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేసింది. ఈ నెల 23 నుండి 25 వరకూ పంజాబ్ రాష్ట్రంలో కూడా 144వ సెక్షన్‌ను అమలులోకి తెచ్చారు. కొన్ని రకాల వాహనాలను ఉపయోగించకూడదని ఆంక్షలు విధించారు. జైలులో ఉన్న ప్రతిపక్ష తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ పార్టీ కార్యకర్తలతోపాటు తనను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఇమ్రాన్‌ఖాన్ భారీ నిరసన యాత్రకు పిలుపు ఇచ్చారు. దీనిని విఫలం చేసేందుకు ప్రభుత్వం భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. పారామిలిటరీ రేంజర్స్‌ను, సరిహద్దు దళాలను రాజధానిలో పోలీసులతోపాటు మోహరించారు. ఐనాగానీ ఇమ్రాన్‌పార్టీ కార్యకర్తలు ర్యాలీకి సిద్ధపడుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన జరిగిన



పాకిస్థాన్ జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఇమ్రాన్‌ఖాన్ పార్టీని ఎన్నికల్లో పోటీ చెయ్యనివ్వకుండా నిషేధించడంతో ఆ పార్టీ కార్యకర్తలు స్వతంత్ర అభ్యర్థులుగా రంగంలోకి దిగి భారీ విజయాలు సాధించారు. పెద్దసంఖ్యలో సీట్లు గెలుచుకున్నారు. ప్రజల మద్దతు తమకే ఉందని ఇమ్రాన్‌ఖాన్ వాదిస్తూ నిరసనలకు పిలుపు ఇచ్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న పాకిస్థాన్ ముస్లిం లీగ్–నవాజ్ (పిఎంఎల్–ఎన్), దాని కూటమిలోని భాగస్వామ్యపార్టీలు తమను కాలరాసి తమకు దక్కాల్సిన అధికారాన్ని లాక్కున్నారని, ప్రజాతీర్పును వారి వశం చేసుకుని తమను జైళ్ళల్లో బంధించారని ఇమ్రాన్‌ఖాన్ అనేక నెలలుగా గొంతు చించుకుని వాపోతున్నారు.

# ట్రంప్‌కు శిక్ష వాయిదా

**న్యూయార్క్ :** శృంగార తార స్టార్మీ డేనియల్స్‌తో లైంగిక కార్యకలాపాలు సాగించిన డోనాల్డ్ ట్రంప్ ఆమెకు డబ్బిచ్చి నోరు మూయించారన్న కేసులో శిక్షను న్యూయార్క్ న్యాయ స్థానం వాయిదా వేసింది. ట్రంప్ దే శాధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించడంతో ప్రజలు ఆయనకు నీరాజనాలు పట్టారని, ఈ కేసులో శిక్షను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు సదరు న్యాయస్థానాధిపతి ప్రకటించారు. శృంగార తార నోరు విప్పి ట్రంప్ పరువుకు భంగం కలిగించకుండా ఉండేందుకు ఆమెకు ఎన్నికల కోసం సేకరించిన నిధుల నుండి భారీగా డబ్బు ముట్టజెప్పారని కేసు నమో దైంది. దీంతో ట్రంప్ అభాసుపాలయ్యారు. ఈ కేసులో ట్రంప్ శిక్ష అను భవించాల్సి ఉండగా ఆయనకు అధ్యక్ష ఎన్నికల్లో గెలుపు ఒక వరంగా మారిం ది. దీంతో కోర్టు ఆయనకు విధించాల్సిన శిక్షను నిరవధికంగా వాయిదా వేసింది.



**జోరుగా మరిన్ని నియామకాలు**

ట్రంప్ కొత్త పాలనాయంత్రాంగంలో అధికారులను నియమించే కార్యక్రమం జోరుగా కొనసాగుతున్నది. ఈ నియామకాలలో భాగంగా శనివారంనాడు కాబోయే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరో ముగ్గురిని నియమించారు. స్కాట్ బెస్సెంట్‌ను ట్రెజరీ సెక్రటరీగా, కాంగ్రెస్ మహిళ లోరీ ఛావెజ్–డీరెమెర్‌ను లేబర్ సెక్రటరీగా, డా.జెన్నెట్ నెషైవత్‌ను తదుపరి అమెరికా సర్జన్ జనరల్‌గా నియమించారు. ట్రంప్ తన కొత్త పాలనాయంత్రాంగ్రంలో స్వయంగా సుమారు 4,500 మందిని వివిధ పదవులకు, అధికార హోదాలకు నియమించుకునే అధికారం ఉంది. అందులో భాగంగా ఆయన ఈ నియామకాలు చేస్తున్నారు. అదేవిధంగా వ్యాధుల నియంత్రణ కేంద్రం డైరెక్టర్‌గా కాంగ్రెస్‌లో మాజీ సభ్యుడు డాక్టర్ దేవ్ వెల్డన్‌ను ఎంపిక చేశారు. మార్టీ మాకరేను ఆహారం, ఔషధ పాలనకు కమిషనర్‌గా ఎంపిక చేశారు.




## భవిష్యత్తులో క్లౌడ్ సీడింగ్‌పైనే భారం?




పర్యావరణ కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ కారణంగా అతివృష్టి, అనావృష్టి ఘటనలు పెరుగుతున్నాయి. వర్షాలు ఎప్పుడు కురుస్తాయో ఎవరూ చెప్పలేని పరిస్థితి. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలు వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఆఫ్రికా దేశాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. ఎక్కడ చూసినా కరువు పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఇలాంటి తరుణంలో, వ్యవసాయాన్ని నిలబెట్టడాని కి, తాగు నీటి అవసరాలు తీర్చడానికి క్లౌడ్ సీడింగ్‌పైనే ఆధారపడక తప్పదన్న వాదన వినిపిస్తున్నది. కృత్రిమంగా వర్షాన్ని కురిపించడాన్నే క్లౌడ్ సీడింగ్ అంటారు. వాతావరణ మార్పుకు అనుగుణంగా రూపొందిన సాంకేతికత. వర్షపాతాన్ని ప్రేరేపించడానికి అవసరమైన రసాయనాలు, ఇతర పదర్థాలను మేఘాల్లోకి ప్రవేశపెట్టడం ద్వారా అవపాతాన్ని మెరుగుపరుస్తారు. సిల్వర్ అయోడైన్, పొటాషియం అయోడైడ్ లేదా డ్రై ఐస్ వంటి పదార్థాలను మేఘాల్లోకి వెదజల్లినప్పుడు, వీటి కణాలు నీటి బిందులు ఏర్పడడానికి కేంద్రకాలుగా పనిచేస్తాయి. అవపాతం పెరగడానికి అనుకూలమైన పరిస్థితులు ఏర్పడతాయి. విమానాలు, భూ ఆధారిత జనరేటర్ల ద్వారా ఈ క్లౌడ్ సీడింగ్ ప్రక్రియను జరుపుతారు. కొన్ని సందర్భాల్లో రాకెట్లను ఉపయోగిస్తారు. సూక్ష్మంగా చెప్పాలంటే, మేఘాల బిందువుల వ్యాసార్థాన్ని పెంచడానికి క్లౌడ్ సీడింగ్‌ను జరుపుతారు. అవి పెరిగినప్పుడు, గురుత్వాకర్షణ కారణం గా వర్షం కురుస్తుంది. వాయు కాలుష్యం సందర్భంలో, క్లౌడ్ సీడింగ్ అనేది గాలి నుండి నలుసు పదార్థం, ఇతర కాలుష్య కారకాలను 'కడిగివేయడానికి' ఒక అద్భుతమైన పద్ధతి.

## ఉపగ్రహాలు కాలిపోతున్నాయ్!



అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిన ఉపగ్రహాలు కాలిపోయే ప్రమాదం ఉంది. ఆస్ట్రేలియాకు చెందిన కర్టిన్ విశ్వవిద్యాలయం ప్రయోగించిన మూడు ఉపగ్రహాలు రోదసిలో కాలిపోవడంతో ఈ విషయం స్పష్టమైంది. సౌర కార్యకలాపాల కారణంగా ఈ పరిస్థితి నెలకొందని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. సౌర వ్యవస్థపై అవగాహనను పెంచడానికి, అంతరిక్షంలో పనిచేయడంలో ఎదురయ్యే అడ్డంకులను నిరోధించడానికి 'బైనార్ స్పేస్ ప్రోగ్రామ్'ను కర్టిన్ విశ్వవిద్యాలయం చేపట్టింది. 2021 సెప్టెంబర్‌లో ఈ ప్రాజెక్టు కింద మొదటి ఉపగ్రహం 'బైనార్ 1'ను ప్రయోగించారు. సూర్యుడి నుంచి వెలువడే జ్వాలలు తక్కువగా ఉన్నప్పుడు, ఈ ఉపగ్రహం ఏడాది పాటు పని చేస్తుందని అంచనా వేశారు. వారి అంచనాల మేరకే, పది సెంటీమీటర్ల క్యూబ్ ఉపగ్రహం భూమికి 420 కిలోమీటర్ల ఎత్తులోని కక్షలో 364 రోజులు పనిచేసింది. కాగా, ఈ ప్రాజెక్టులో భాగంగానే బైనార్ 2, బైనార్ 3, బైనార్ 4 ఉపగ్రహాలను కూడా పంపింది. సౌర జ్వాలలు పెరగడం, సౌర శ్రేణుల నుంచి అదనపు ఉపరితల వైశాల్యం ఏర్పడడం, సౌర కార్యకలాపాలు అధికమవడం వంటి కారణాలను దృష్టిలో ఉంచుకొని, ఈ ఉపగ్రహాల జీవితకాలాన్ని ఆరు నెలలుగా భావించారు. కానీ, సౌర జ్వాలలు ఊహించిన దానికంటే ఎక్కువగా కావడంతో ఈ మూడు ఉపగ్రహాలు రోదసిలో కాలిపోయాయి. సూర్యుడి అయస్కాంత క్షేత్రం ఎప్పటికప్పుడు మారుతుంది. ప్రతి 11 సంవత్సరాలకు ఒకసారి అయస్కాంతక్షేత్ర ఉత్పత్తి తారుమారవుతుంది. ఈ క్రమంలో సౌర కార్యకలాపాలు అత్యధికంగా ఉంటాయి. గత కొన్ని నెలల్లో ఇవి ఊహించిన స్థాయి కంటే ఎక్కువగా ఉన్నాయని ఉపగ్రహాలు పేలిపోవడంతో స్పష్టమైంది.

## ప్రమాదంలో ఆఫ్రికన్ పెంగ్విన్



ఆఫ్రికన్ పెంగ్విన్ జాతి ప్రమాదంలో ఉందని ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయుసిఎన్) ప్రకటించింది. దక్షిణాఫ్రికా, యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన అంతర్జాతీయ పరిశోధకుల బృందం ఇటీవల జరిపిన కొత్త అధ్యయనంలో, కృత్రిమ గూళ్లు ఆ జాతి సంతానోత్పత్తికి దోహదపడతాయని నిర్ధారించారు. మిగతా పెంగ్విన్‌లతో పోలిస్తే ఆఫ్రికన్ పెంగ్విన్ కొన్ని ప్రత్యేక లక్షణాలతో ఆకట్టుకుంటుంది. దీని ఒంటిపై నల్లటి గీత, ఛాతీపై ప్రత్యేకమైన నల్లని మచ్చలు ఉంటాయి. అదే విధంగా ఎక్కువ ఉష్ణోగ్రతల్లో వీటి కళ్లపైన ఉండే గులాబీ గ్రంధులు బయటపడతాయి. ఆడ పెంగ్విన్ల కంటే మొగ వాటికి ముక్కు పెద్దదిగా ఉంటుంది. ఆఫ్రికా పెంగ్విన్‌లు సాధారణంలో సుముద్ర తీరం నుంచి 40 కిలోమీటర్ల పరిధిలోనే ఉంటాయి. సంతానోత్పత్తి, విశ్రాంతి కోసం వివిధ తీరప్రాంత ఆవాసాలను వెతుక్కుంటూ తీరానికి చేరుతాయి. ఈ జాతి పెంగ్విన్ ఆఫ్రికన్ ప్రధాన భూభాగంలో హోలామ్స్ బర్డ్ ఐలాండ్, నమీబియా నుండి బర్డ్ ఐలాండ్, అల్గోవా బే, దక్షిణాఫ్రికా వరకు కనిపిస్తాయి. సంతానోత్పత్తికి ఈ ప్రాంతాలనే ఎంచుకుంటాయి. బొరియలు తవ్వి, వాటిలో గుడ్లు పెట్టడం ద్వారా అధిక ఉష్ణోగ్రతల నుంచి పిల్లలను కాపాడుకోగలుగుతాయి. వీటి జీవితకాలం 20 సంవత్సరాలు. సార్డిన్, ఆంకోవీ వంటి పెలాజిక్ స్కూలింగ్ చేపలను తింటుంది. వాతావరణ మార్పులు, సముద్రాల్లో తరచు ఏర్పడే వాయుగుండాలు, తుఫాన్లు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు వంటి సమస్యల కారణంగా ఆఫ్రికన్ పెంగ్విన్ల ఉనికి ప్రమాదం లో పడింది. ఇవి అంతరించిపోతున్నాయని, కాపాడేందుకు తక్షణ చర్యలు చేపట్టపోతే,ఈ జాతి మొత్తం కనుపరుగవుతుందని ఐయుసిఎన్ హెచ్చరిస్తున్నది.

## జైళ్లకూ తప్పని తిప్పలు!



పోలీసులు అరెస్టు చేసిన అనుమానితులు... కోర్టుల్లో శిక్షపతిన దోషులు చేరుకునే స్థానం జైలు. తప్పు చేసిన వారు తమ తప్పు తెలుసుకోవడానికి ఉద్దేశించిన జైళ్లే సమస్యలను ఎదుర్కోవాల్సి రావడం విచిత్రం. కానీ, దేశంలో ప్రస్తుతం ఇలాంటి పరిస్థితే నెలకొంది. శిక్షను అమలు చేయడం, పునరావాసాన్ని కల్పించడం వంటి రెండు భిన్నమైన పాత్రలను జైళ్లు పోషిస్తున్నాయి. రెంటి మధ్య సమతుల్యానికి కష్టపడుతున్నాయి. ఈ సమస్యలను దృష్టిలో ఉంచుకొని 'మోడల్ ప్రిజన్స్ యాక్ట్ 2023'ను తీసుకొచ్చారు. జైళ్ల వ్యవస్థను ఆధునీకరించడం, దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడం అనేవి ఈ కొత్త చట్టం ప్రధాన లక్ష్యాలు. 4.36 లక్షల సామర్థ్యం ఉన్న జైళ్లలో 5.73 లక్షల మంది ఖైదీలు ఉంటున్నారని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) నివేదిక స్పష్టం చేస్తున్నది. కొన్ని జైళ్లలో సామర్థ్యం కంటే 200శాతం అధికంగా ఖైదీలు ఉంటున్నారు. జైళ్లలో అవసరమైన సిబ్బందిలో 33 శాతం పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఖైదీల్లో అండర్ ట్రయల్స్ సంఖ్య ఎక్కువ. నేరం రుజువు కాకపోయినప్పటికీ, కేవలం అనుమానంతో అరెస్టు చేయడం, విచారణ జరుగుతున్నంత కాలం వారిని జైళ్లలోనే ఉంచడం వంటి కారణాల వల్ల, మొత్తం ఖైదీల్లో అండర్‌ట్రయల్స్ 68 శాతం ఉంటున్నారు. ఇంత కంటే దారుణం మరొకటి లేదు. నేరం చేశారో.. లేదో కూడా తెలియకుండా జైళ్లలో కుక్కి, సంవత్సరాలపాటు విడుదల చేయకుండా వేధించి....చివరికి కోర్టులు బెయిల్ మంజూరు చేయడంతో వారిని విడుదల చేస్తున్న తీరు గర్హనీయం. చాలామంది కనీసం నేరారోపణ కూడా లేకుండానే ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గుతున్నారు.

## 'భూ—నీర్' అమలుపై సందేహాలు!




దేశంలో అట్టహాసంగా ప్రారంభించిన 'భూ—నీర్' ప్రాజెక్టు లక్ష్యాలు అద్భుతంగా ఉన్నప్పటికీ, దాని అమలుపైనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దేశంలో భూగర్భ జలాల నియంత్రణ కోసం పోర్టల్‌ను ప్రారంభించారు. నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) సహకారంతో జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ అథారిటీ (సిజిడబ్ల్యు) ఈ పోర్టల్‌ను అభివృద్ధి చేసింది. పాన్ ఆధారిత సింగిల్ ఐడి విధానాన్ని ఈ విధానంలో అమలవుతుంది. వినియోగదారులు తమ పాన్‌కార్డు ఆధారంగానే అన్ని రకార భూగర్భ జలాల సంబంధిత కార్యకలాపాలు చేసుకోవచ్చు. ఒకే గుర్తింపు వ్యవస్థగా ఇది ఉపయోగపడుతుంది. క్యూఆర్ కోడ్‌తోపాటు ఈ పోర్టల్ నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్ఒసి)ని కూడా జారీ చేస్తుంది. ఇది సులభమైన ధృవీకరణను, ప్రామాణికతను నిర్ధారిస్తుంది. భూగర్భ జలాల వెలికితీతపై రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో నిబంధనలు, సమ్మతి, విధానాలు, స్థిరమైన పద్ధతులకు సంబంధించిన క్లిష్టమైన సమాచారాన్ని యాక్సెస్ చేసే చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌తో సమగ్ర వివరాలు అందిస్తుంది. ప్రపంచ జనాభాలో 18శాతం ఉన్న భారత్‌లో, వనరులు మాత్రం నాలుగు శాతం మాత్రమే. ప్రపంచవ్యాప్తంగా నీటిఒత్తిడిని ఎదుర్కొంటున్న దేశాల్లో భారత్ కూడా ఉంది. 2024 చివరి నాటికి ఈ సమస్యను కొంతవరకైనా పరిష్కరించే ఉద్దేశంతో భూ—నీర్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.

**బిఎస్‌ఎస్ మైత్రేయి**

# మిశ్రమ ఫలితాలు

మహారాష్ట్ర, ఝార్ఖండ్ శాసనసభలకు, 13 రాష్ట్రాల్లో 48 అసెంబ్లీ సీట్లకు జరిగిన ఎన్నికల ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. మహారాష్ట్రలో బిజెపి ఆధిపత్యంలోని మహాయుతి, ఝార్ఖండ్‌లో జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడి, సిపిఐ(ఎంఎల్)లిబరేషన్‌తో కూడిన ఇండియా కూటమి తమ అధికారం నిలుపుకున్నాయి. యుపిలో 9 ఉప ఎన్నికల్లో బిజెపి 7, ఎస్‌పి2 దక్కించుకున్నాయి. పంజాబ్‌లో ఆప్3, కాంగ్రెస్ 1 సీటు గెలుచుకున్నాయి. కర్నాటకలో 3 సీట్లనూ కాంగ్రెస్ గెలుచుకుంది. పశ్చిమ బెంగాల్‌లో 6సీట్లలో తృణమూల్ కాంగ్రెస్ తిరుగులేని విజయం సాధించింది. బిహార్‌లోని 4సీట్లలో ఎన్‌డిఎ భాగస్వాములు బిజెపి, జెడి(యు) చెరో రెండు గెలుచుకున్నాయి. మధ్యప్రదేశ్‌లో 2సీట్లూ బిజెపి ఖాతాలో పడ్డాయి. కేరళలోని 2 సీట్లను ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్ చెరి ఒకటి దక్కించుకున్నాయి. కాగా వాయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాంకాగాంధి, గత ఎన్నికల్లో తన సోదరుడు రాహుల్‌గాంధికి లభించిన 3.6లక్షల ఓట్ల మెజారిటీని పూర్వపక్షం చేశారు. రాజస్థాన్‌లోని 7సీట్లను తలా కొన్ని పంచుకోగా, అసోంలో 5 స్థానాల్లో పాలక బిజెపి కూటమి పార్టీలు తమ స్థానం నిలుపుకున్నాయి. స్థూలంగా చూస్తే దేశంలో రాజకీయ పార్టీల బలాబలాల్లో లోక్‌సభ ఎన్నికలనాటి పరిస్థితుల్లో చెప్పుకోదగ్గ మార్పు లేదు.

అయితే మహారాష్ట్ర పెద్ద రాష్ట్రం, అభివృద్ధి చెందిన రాష్ట్రం, ముంబయి దేశ ఆర్థిక రాజధాని కూడా అయినందున ఆ రాష్ట్ర ఎన్నికల ఫలితాలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. పాలక—ప్రతిపక్ష కూటముల మధ్య సీట్లలో ఇంత పెద్ద వ్యత్యాసాన్ని ఎవరూ ఊహించలేదు. 288 సీట్లలో పాలక మహాయుతికి 230 సీట్లు లభించటం అంచనాలను తలకిందులు చేసింది. అందులో బిజెపియే 132 గెలుచుకుని రికార్డు నెలకొల్పింది. కాగా కూటమి భాగస్వాములైన షిండే శివసేన 57, అజిత్ పవార్ ఎన్‌సిపి 41 సీట్లు గెలుచుకుని మాతృపార్టీలనుండి చీలిపోయి బిజెపితో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తమ పార్టీలు ఎన్నికల కమిషన్ లెక్కలోనే కాకుండా ప్రజల తీర్పులో కూడా పెద్ద పార్టీలుగా రుజువు చేసుకున్నాయి. ఎంవిఎకు అన్నీ కలిపి 46 సీట్లే లభించాయి. పెద్ద పార్టీగా ఎక్కువ సీట్లకు పోటీ చేసిన కాంగ్రెస్‌కు 16, బాలథాక్రే శివసేనకు అసలు వారసులమని నమ్మిన ఉద్ధావ్ థాక్రే శివసేనకు 20స్థానాలు, మహారాష్ట్ర రాజకీయ చాణక్యుడుగా పేరొందిన శరద్ పవార్ ఎన్‌సిపికి 10 స్థానాలు దక్కాయి. రెండు కూటములు పోటాపోటీగా ఉంటాయన్న అంచనాలు పటాపంచలైనాయి. అంతా ప్రధాని నరేంద్రమోదీ మహాత్మ్యం అంటూ బిజెపి సంబరాలు చేసుకుంటున్నది. కాగా తమ కూటమి ఘోర పరాజయాన్ని జీర్ణించుకోవటం ఎంవిఎకు కష్టమైనా, అందు కు కారణాలను లోతుగా విశ్లేషించుకుని గుణపాఠాలు తీసుకుంటేనే భవిష్యత్ ఉంటుంది.

**ప్రజాపక్షం**
**24-11-2024, ఆదివారం**

మహారాష్ట్రకు కాబోయే ముఖ్యమంత్రి ఎవరు? షిండె కొనసాగింపును బిజెపి కొనసాగిస్తుందా? సమయం లేదు. కాబట్టి రెండ్రోజుల్లో తేలిపోతుంది. అసంతృప్తి ఉన్నా షిండె, అజిత్ పార్టీలు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. అందువల్ల ప్రస్తుతానికి షిండె ముఖ్యమంత్రిగా యథాతథ స్థితిని కొనసాగించి బిజెపి విశాల హృదయం గూర్చి గొప్పలు చెప్పుకోవచ్చు. లేదా దేవేంద్ర ఫడ్నావీస్ మూడోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయవచ్చు. కీ బిజెపి చేతిలో ఉంది.

ఝార్ఖండ్‌లో అవినీతిగూర్చి, బంగ్లాదేశ్ చొరబాటుదారుల గూర్చి బిజెపి చేసిన ఎడతెగని ప్రచారం ఫలించలేదు. జెఎంఎం నుంచి చంపై సోరెన్‌ను చీల్చినా ప్రయోజనం నెరవేర లేదు. అవినీతి ఆరోపణలతో ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఇడిని ప్రయోగించి జైల్లో పెట్టటం బిజెపికి బెడిసికొట్టినట్లుంది. జెఎంఎం, కాంగ్రెస్ తదితరులతో కూడిన ఇండియా కూటమి 81 స్థానాలుగల అసెంబ్లీలో 56 స్థానాలు గెలుచుకుని తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శించింది.

2019 ఎన్నికల్లో 47 సీట్లు గెలుచుకున్న ఇండియా కూటమి ప్రస్తుతం మరో 9స్థానాల్లో విజయఢంకా మోగించింది. బిజెపి కూటమి స్థానాలు 30 నుండి 24కు తగ్గాయి. ఝార్ఖండ్ చాలా అస్థిరమైన రాష్ట్రం. గత 23 సంవత్సరాల అస్థిత్వంలో 12 మంది ముఖ్యమంత్రులు మారారు. జెఎంఎం వ్యవస్థాపకుడు శిబుసోరెన్ రెండవ కుమారుడైన హేమం త్ సోరెన్ వరుసగా రెండవ పర్యాయం ముఖ్యమంత్రి కానున్నారు. అయితే ఆయనపై ఇడి కేసు కొనసాగుతోంది. ఆయన భార్య కల్పన కూడా గెలిచారు. ఈ ఎన్నికల్లో విజేతలకు అభినందనలు. ఎన్నికల్లో వ్యక్తమైన వైషమ్యాలను మరిచి తమతమ రాష్ట్రాల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేస్తాయని ఆశించుదాం.

# అదానీ, జగన్ రెడ్డి ముడుపుల బాగోతం – మధ్యలో 'సెకి'



ఎం. కోటేశ్వరరావు

వివాదాస్పద పారిశ్రామిక, వాణిజ్యవేత్త గౌతమ్ అదానీ పరివారపు లంచాల బాగోతం బట్టబయలైంది. హరిత ఇంధన కొనుగోళ్ల వ్యవహారంలో రాష్ట్రాలలో అధికారంలో ఉన్నవారికి 26.5కోట్ల డాలర్ల మేరకు ముడుపులు చెల్లించిందని రెండు కేసులు దాఖలయ్యాయి. అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో నవంబరు 20న ఒక కేసును న్యాయశాఖ, సెక్యూరిటీలు మరియు ఎక్స్ఛేంజ్‌ల నియంత్రణ సంస్థ మరో కేసును వేసింది. ముడుపుల మొత్తంలో సింహభాగం ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ జగన్మోహనరెడ్డికి ముట్టిందని చెబుతున్నారు. అసలు తమ నేత అదానీ కంపెనీలతో ఎలాంటి ఒప్పందమూ కుదుర్చుకోలేదని కేంద్రప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకి)తో డిస్కామ్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, ఒక ప్రభుత్వరంగ సంస్థ ఎక్కడైనా లంచాలు ఇస్తుందా అని వైసిపి ఒక ప్రకటనలో అమాయకత్వాన్ని ప్రదర్శించింది. అమెరికా కోర్టులో దాఖలు చేసిన కేసుల పత్రాలలో పేర్కొన్నదాని మేరకు సంక్షిప్తంగా వివరాలు ఇలా ఉన్నాయి. తాను స్వంతంగా లేదా ప్రయివేటు సంస్థలు ఉత్పత్తి చేసిన హరిత విద్యుత్‌ను సెకి కొని అవసరమైన వారికి విక్రయిస్తుంది. ఆ మేరకు 2019 డిసెంబరు, 2020 జూలై మధ్య కాలంలో కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ కంపెనీ సెకి ద్వారా అదానీ కంపెనీ, మరో అమెరికా కంపెనీ అజూర్ పవర్ నుంచి పన్నెండు గిగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అంగీకరించింది.దానిలో అదానీ ఎనిమిది, అమెరికా కంపెనీ నాలుగు గిగావాట్లు సరఫరా చేయాల్సి ఉంది. విద్యుత్‌ను నిలువ చేయటానికి వీలుండదు గనుక తమ దగ్గర నుంచి కొనుగోలు చేసే వారి కోసం సెకి ప్రయత్నించింది. ఒప్పందాలు చేసుకుంటేనే సదరు కంపెనీలు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

అసలు కథ ఇక్కడి నుంచి ప్రారంభమైంది. అమెరికా న్యాయశాఖ ఆరోపించిన మేరకు గౌతమ్ అదానీ, అతగాడి మేనల్లుడు సాగర్ అదానీ, వినీత్ జైన్ మరో ఐదుగురు రాష్ట్రాలలో ఉన్న పాలకు లు, అధికారులకు ముడుపుల బాగోతానికి తెరతీశారు. అమెరికా, ఇతర దేశాల నుంచి అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టే వారికి తెలియకుండా ఈ అక్రమాన్ని దాచి అమెరికా చట్టాల ప్రకారం మోసం చేశా రు. సెకి నుంచి ఎవరైనా విద్యుత్‌ను కొనుగోలు చేస్తేనే అదానీ, అమెరికా కంపెనీలు ముందుకు పోవాల్సి ఉంటుంది. అయితే సెకి ధర ఎక్కువగా ఉండటంతో భారీ మొత్తంలో విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రాష్ట్రాలేవీ ముందుకు రాలేదు. అదానీ, అమెరికా కంపెనీల పెద్దలు కూర్చుని రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలంటే ఆయా రాష్ట్రాల నేతలు, అధికారులకు తామే ముడుపులు చెల్లించి సెకితో ఒప్పందాలు చేయించాలని పథకం వేశారు. దాని ప్రకారమే అంతా జరిగింది. అమెరికా కేసులో దాఖలు చేసిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని, గౌతమ్ అదానీ అందుకోసమే కలిశారన్నది ఆరోపణ. ఆ తరువాతే 2021 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు సెకితో ఒప్పందాలు చేసుకున్నాయని చెబుతున్నారు. అంటే ముడుపుల బేరసారాలకే వారి కలయిక అన్నది స్పష్టం.

ఇక ఈ ఒప్పందం గురించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తాజాగా అధికారంలోకి వచ్చిన తరువాత విడుదల చేసిన శ్వేత పత్రాల సందర్భంగా చెప్పిందేమిటి? సెకి నుంచి యూనిట్‌కు రు.2.49 చొప్పున ఏడువేల మెగావాట్లు ఆంధ్రప్రదేశ్ కొనుగోలు చేసింది. మూడువేల మెగావాట్లు 2024సెప్టెంబరు నుంచి, మరో మూడువేల మెగావాట్లు 2025 సెప్టెంబరు, మిగిలిన వెయ్యి 2026 సెప్టెంబరు నుంచి సరఫరా చేయాలి. అయితే ఒప్పంద సమయంలో మార్కెట్లో యూనిట్ ధర రు.1.99మాత్రమే ఉందని, సెకితో ఒప్పందం వలన ఏటా వినియోగదారులపై రు.850 కోట్ల మేర అదనపు భారం పడుతుందని, సోలార్ విద్యుత్ ప్లాంట్లకు విద్యుత్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేందుకు చెల్లించాల్సిన సరఫరా ఛార్జీల భారాన్ని ఏటా మూడు నుంచి మూడున్నరవేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని, ఇవన్నీ కలుపుకుంటే ఒప్పంద గడువు పాతిక సంవత్సరాలలో 62వేల కోట్ల రూపాయల భారం పడుతుందని చంద్రబాబు నాయుడు చెప్పారు. దీని మీద మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి (పార్టీ ద్వారా విడుదల చేసిన ప్రకటన) ఏమంటున్నారు ?

గతంలో చంద్రబాబు నాయుడి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల ప్రకారం యూనిట్ ధర రు.5.10కి చేరింది. ఈ భారాన్ని తగ్గించేందుకు పదివేల మెగావాట్ల సౌరవిద్యుత్ తయారీకి జగన్ సర్కార్ నిర్ణయించింది. దాన్లో భాగంగా 2020 నవంబరులో 6,400 మెగావాట్ల కోసం ఎపి గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా టెండర్లు పిలిచింది. యూనిట్ రు.2.49, 2.58చొప్పున సరఫరా చేసేందుకు 24 టెండర్లు వచ్చాయి. అయితే న్యాయపరమైన సమస్యలతో వాటిని రద్దు చేసింది. ఆ తరువాత యూనిట్ ధర రు.2.49కి సరఫరా చేసేందుకు సెకి ముందుకు వచ్చింది. అది 2019 జూన్‌లో ఒప్పందాలను కుదుర్చుకున్న సంస్థల నుంచి సరఫరా చేస్తుంది. విద్యుత్ సరఫరా చార్జీలను మినహాయించేందుకు సెకి అంగీకరించింది. దీనివలన ఏటా రాష్ట్రానికి రు.3,700కోట్ల మేర ఆదా అవుతుంది. చంద్రబాబు నాయుడు విద్యుత్ సరఫరా ఛార్జీల భారం రాష్ట్రం మీద పడుతుందని అంటే జగన్మోహనరెడ్డి లేదని చెబుతున్నారు. ఏది వాస్తవమో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి, ఒప్పంద పత్రాలను జనాల పరిశీలనకు అందుబాటులో ఉంచాలి. అప్పుడే నిజం తెలుస్తుంది.

అమెరికాలో దాఖలైన కేసు జగన్‌మోహనరెడ్డి లేదా ఇతర రాష్ట్రాలలో ఒప్పందం చేసుకున్నవారి మీద కాదు. అమెరికా, అంతర్జాతీయ మదుపుదార్లను ముడుపుల గురించి మభ్యపెట్టి అదానీ కంపెనీ మోసం చేసినదాని గురించి మాత్రమే. సూదికోసం సోదికి పోతే పాత గుట్టంతా రట్టయినట్లుగా ఈ క్రమంలో ముడుపుల బాగోతం బయటపడింది. అదానీ అండ్ కో మొత్తం 26.5 కోట్ల డాలర్లు (మన కరెన్సీలో రు.2,209కోట్లు) ముడుపులుగా ఇచ్చారని, ఈ మొత్తంలో రు.1,750కోట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలను ఒప్పించటానికి ఇచ్చినట్లు అమెరికా ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ముడుపులకు ఒప్పించిన తరువాత ఒడిషా, జమ్ము అండ్ కాశ్మీరు, తమిళనాడు, చత్తీస్‌ఘర్, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. సెకి ఒప్పందాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు అదానీ సంస్థ ఏడువేల మెగావాట్లు, అమెరికా సంస్థ 650 మెగావాట్లను మిగిలిన నాలుగు రాష్ట్రాలకు సరఫరా చేయాల్సి ఉంది. ముడుపుల గురించి దర్యాప్తు చేసేందుకు పూనుకున్న ప్రభుత్వానికి ఆటంకాలు కల్పించినట్లు అమెరికన్ ఎఫ్‌బిఐ(మన సిబిఐ వంటిది) అధికారి ఫిర్యాదు చేశాడు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సెకి ఒప్పందం కుదుర్చుకోక ముందు 2021 ఆగస్టులో సిఎం జగన్‌మోహన రెడ్డితో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా కలిసినట్లు కేసులో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముడుపులు చెల్లించటం లేదా ఇచ్చేందుకు అదానీ వాగ్దానం చేసినట్లు, ఆ కారణంగానే ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా సెక్యూరిటీస్ సంస్థ దాఖలు చేసిన కేసు 80, 81పేరాలలో పేర్కొన్నది. అదానీ గ్రీన్ మరియు అజూర్ పవర్ అంతర్గత వర్తమానాలలో సెకి నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలుకు అంగీకరించింది అనే సమాచారం ఉన్నట్లు, మరోమాటలో చెప్పాలంటే ముడుపులు చెల్లించటం లేదా వాగ్దానం పనిచేసినట్లు కూడా పేర్కొన్నది. ఒక మెగావాట్‌కు రు.25లక్షలు చెల్లించేట్లు ఆ మొత్తం రు.1,750 కోట్లని, అదానీ కంపెనీ అంతర్గత రికార్డుల్లో ఉన్న అంశం దీనికి దగ్గరగా ఉందని కూడా చెప్పింది. ఇవన్నీ తమమీద చేసిన నిరాధార ఆరోపణలు మాత్రమేనని, నేరం రుజువయ్యేవరకు నిందితులుగానే పరిగణించాలని అదానీ కంపెనీ వివరణ ఇచ్చింది.

అమెరికా కోర్టులో దాఖలైన కేసుల్లో ఏమి తేలుతుందో తెలియదు, అదానీ కంపెనీల మీద 2023లో హిండెన్‌బర్గ్ సంస్థ వెల్లడించిన నివేదిక, కొన్ని దేశాల్లో అదానీ కంపెనీల బాగోతాలు చూసిన తరువాత విదేశాల్లో మన గురించి ఒక చెడు అభిప్రాయం ఏర్పడిందన్నది వాస్తవం. ఈ ఉదంతాల గురించి అంతర్జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చినందున ప్రతి వారి నోళ్లలో మనదేశం నానుతున్నది. ప్రభుత్వరంగ సంస్థ సెకి విద్యుత్‌ను అమ్మే స్థితిలో లేదన్న సందేశం, అందుకోసమే ప్రయివేటు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ నేతలకు ముడుపులు ఇచ్చినట్లు తాజా ఉదంతంతో వెల్లడైంది. విదేశాలు తిరిగి దేశ ప్రతిష్టను పెంచానని చెప్పుకున్న నరేంద్రమోడీ అదానీ కంపెనీల మీద వచ్చిన ఆరోపణల గురించి పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరిపేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. శ్రీలంక ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి అక్కడ విద్యుత్ ప్రాజెక్టును అదానీకి ఇప్పించారని వచ్చిన వార్తల గురించి చెప్పనవసరం లేదు. గతంలో హిండెన్‌బర్గ్ సంస్థ ముందుకు తెచ్చిన ఆరోపణల నిగ్గుతేల్చేందుకు పార్లమెంటరీ కమిటీ వేయాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఎందుకంటే అది తన లబ్దికోసం పనిచేసే ప్రైవేటు సంస్థ అంటూ కొట్టివేశారు. సెబిపేరుతో విచారణను నీరుగార్చారు. ఇప్పుడు అమెరికా అధికారిక సంస్థలే కేసులు దాఖలు చేసినందున మోడీ సర్కార్ గతంలో మాదిరి తప్పించుకుంటుందా ?

# రైతులను మెప్పించాకే భూసేకరణ

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మరో రెండు వారాలలో ఏడాది పూర్తి కానుంది. దీనిని పురస్కరించుకొని రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో 'ప్రజా పాలన విజయోత్సవ సభలు' పేరిట ప్రజలకు తమ ఏడాది విజయాలను పంచుకోవాలని నిర్ణయించింది. తొలుత మంగళవారం నాడు హన్మకొండలోని ఆర్ట్స్ కాలేజీలో భారీ స్థాయిలో 'ప్రజా పాలన విజయోత్సవ సభ' జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి హాజరవడమే కాకుండా, దాదాపు మంత్రివర్గ సభ్యులంతా హాజరై ఐక్యతను చాటారు. వరంగల్‌లో కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి, అనంతరం సభా వేదిక నుంచి 23 జిల్లాల్లో ఇందిరా శక్తి భవనాలకు సిఎం శంకుస్థాపన చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనేక పథకాలు అమలు చేసినప్పటికీ, అది పూర్తి స్థాయిలో ప్రజల్లోకి వెళ్ళలేదనే భావన ఉంది. అందుకు ప్రధాన కారణం ఆరు గ్యారెంటీలతో పాటు అనేక హామీలను, పథకాలను ఎన్నికల మ్యానిఫెస్టోలో వాగ్దానం చేసింది కాంగ్రెస్. తమకు గత ప్రభుత్వ వారసత్వంగా వచ్చిన ఎనిమిదిన్నర లక్షల కోట్ల రూపాయల అప్పుతో అన్నిటినీ ఒకేసారి అమలు చేసే వెసులుబాటు కాంగ్రెస్ సర్కారుకు దక్కలేదు. అయినప్పటికీ, అమలు చేసినవి తక్కువేమి కాదు.

గడ్డు ఆర్థిక పరిస్థితులలో సైతం సాహసోపేతంగా రైతులకు రూ.2లక్షల వరకు ఒకేసారి రుణమాఫీకి రూ.18 వేల కోట్లు వ్యయం చేసింది. అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత కల్పించింది. తెలంగాణ ఉద్యమంలో కీలక నినాదమైన ప్రభుత్వ ఉద్యోగాల కల్పన విషయంలో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం శరవేగంగా చర్యలు చేపట్టింది. గతంలో నోటిఫికేషన్‌లు వేసి భర్తీ పూర్తికాని ఉద్యోగాలతో పాటు, స్వయంగా కొత్త ప్రభుత్వం నోటిఫికేషన్ వేసిన ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలు పూర్తిచేసి ఇప్పటికే రికార్డు స్థాయిలో 53,310 మందికి ప్రభుత్వోద్యోగాలు కల్పించింది. ఇందుకు ఎన్నో ఆటంకాలు ఎదురైనప్పటికీ , వాటిని ఎదురొడ్డి రాష్ట్ర ప్రభుత్వం అరలక్ష మందికి పైగాఉద్యోగాలు కల్పించటం విశేషమే. గత ప్రభుత్వ హయాంలో పడావుపడ్డట్టుగా మారిన యూనివర్సిటీలను మళ్ళీ పట్టాలెక్కించే ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికీ ఖాళీగా ఉన్న యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్‌ల పోస్టులను భర్తీ చేసి, యూనివర్సిటీలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీలను భర్తీకి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. రైతులు, మహిళలు, యువతకు మేలు చేసే అనేక హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం తక్కువ కాలంలోనే అమలు చేసింది. వీటన్నిటినీ ప్రజలకు తెలియపరిచేందుకే ప్రజా పాలన విజయోత్సవ సభలను వేదికగా మార్చుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. అయినప్పటికీ ప్రభుత్వంపై వ్యతిరేకతను రాజేసేందుకు ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్ ప్రతి రోజూ ఏదో ఒక అంశం తెరపైకి తీసుకువస్తుంది. అడగాల్సింది మీరు కాదు ప్రధాన ప్రతిపక్ష నాయకుడు , మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని బిఆర్‌ఎస్ నేతలకు హన్మకొండ సభ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాలు విసిరారు. ఈ సభకు సీనియర్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి రాలేదంటూ బిఆర్‌ఎస్ వర్గాలు నెరుసులు వెదికే ప్రయత్నం చేశాయి. రెండు రోజుల తరువాత వేములవాడలో జరిగిన ముఖ్యమంత్రి సభకు ఆయన కూడా హాజరవడం

**రాజధాని సందడి**
**– బొమ్మగాని కిరణ్‌కుమార్**

తో ఆ ప్రచారానికి ఫుల్ స్టాప్ పడింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతలు హైదరాబాద్ నగరంలో మూసీనది వెంబడి కాలనీలలో ఒక రోజు నిద్ర చేశారు. మూడు నెలలు మూసీ వెంట ఉండే ఇళ్ళల్లో నివాసం ఉంటే, వారి బాధలు మీకు తెలుస్తాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విసిరిన సవాలుకు స్పందనగా వారీ కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సైతం మూసీ ఒడ్డున కాలనీలో ఒక రాత్రి నిద్రపోయారు. అయితే, కేంద్రంలో పదేళ్ళు అధికారంలో ఉన్న బిజెపి మూసీ నది శుద్ధీకరణకు ఏమీ చేసింది? అసలు తెలంగాణపై తమ ముద్రవేసే విధంగా ఏ పనిచేసిందనే చర్చ బిజెపి వైపు మళ్ళింది.

**రైతుల విషయంలో జాగ్రత్త!**

ముఖ్యమంత్రి స్వంత నియోజకవర్గం లగచర్లలో భూసేకరణ ప్రజాభిప్రాయ సేకరణ సమావేశం సందర్భంగా కలెక్టర్, ఉన్నతాధికారులపై దాడి ఘటనలో బిఆర్‌ఎస్ హస్తం ఉందనే విషయం దర్యాప్తులో వెల్లడవుతూంది. మూడు రోజుల క్రితం ఆ గ్రామంతో పాటు, పక్కన తండాలలో పర్యటించిన వామపక్షాల బృందం కూడా ఈ విషయంపై రూఢీ చేసింది. అక్కడ రెండు భిన్నమైన అంశాలను తాము చూసినట్లు తెలిపింది. ఒకటి ఫార్మా విలేజి కోసం రైతుల నుంచి పంట భూములు తీసుకోవడం, రెండవది లగచర్లలో జరిగిన ఆందోళనలో అసాంఘిక శక్తులు జొరబడి దాడులు చేయడమని పేర్కొంది. వామపక్ష ప్రతినిధి బృందం పరిశ్రమల కోసం పంట భూములు తీసుకోవద్దని, బంజరు, బీడు భూములు తీసుకోవాలని, రైతులను ఒప్పించాలని స్పష్టమైన సూచన చేసింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతుల సమ్మతితో, మెరుగైన ప్యాకేజీతో భూమిని తీసుకోవాలని వామపక్ష నేతలు కోరారు. అత్యంత వెనుకబడిన తన నియోజకవర్గం కొడంగల్‌లో పరిశ్రమలు పెట్టించి అభివృద్ధి చేయించాలని, అది వేగంగా జరగాలనే తలంపు ముఖ్యమంత్రిలో ఉండొచ్చు. అందుకే రైతుల నుంచి భూములు సేకరించే విషయంలో కింది స్థాయిలో కొంత వత్తిడి ఉండొచ్చు. అక్కడ సుమారు 1300 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయి. రైతులను ఒప్పించి భూములు తీసుకుంటే కచ్చితంగా మంచి పేరే వస్తుంది. సున్నితమైన రైతులు, భూమి అంశంలో కొంత అటూ ఇటైనా జరిగే నష్టం ఎక్కువే. అప్పటి వరకు చేసిన మంచి కొట్టుకుపోయే ప్రమాదం లేకపోలేదు. గతంలో పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్‌లో వామపక్ష సంఘటన ప్రభుత్వ హయాంలో ఇదే జరిగింది. భూములకు ఇచ్చే పరిహారాన్ని మూడింతలు చేస్తామని, మెరుగైన ప్యాకేజీ ఇస్తామని లగచర్ల ఘటన తరువాత ప్రభుత్వం నుంచి సంకేతాలు వచ్చాయి. పరిహారం, పునరావాస ప్యాకేజీలో తాము ఘనమని బిఆర్‌ఎస్ గొప్ప లు చెబుతూ మల్లన్నసాగర్ నిర్వాసితులకు దేశంలోనే ఎక్కడా లేని విధంగా మోడల్ కాలనీలు కట్టామని చెప్పుకుంది. రెండు రోజుల క్రితం గజ్వేల్ నియోజకవర్గంలో మల్లన్నసాగర్ నిర్వాసితుల కాలనీ లో కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్యటించిన సమయంలో నిర్వాసిత ప్రజలు తమ కష్టాల గోడును వెలిబుచ్చారు. తమకు ప్యాకేజీ పూర్తిగా అందలేదని,కాలనీలో వసతులు సరిగా లేవని, ఉపాధిలేక అడ్డా కూలీలుగా వెళ్తున్నామని కన్నీళ్ల పర్యంతమయ్యారు. ప్రభుత్వాలు చెబుతున్నట్లుగా నిర్వాసితుల పరిస్థితులేమి గొప్పగా లేవు. ప్రాజెక్టులు, పరిశ్రమలు, అభివృద్ధి కోసం త్యాగం చేసిన నిర్వాసితులను పువ్వుల్లో పెట్టి కాకపోయినా,కనీసం గౌరవప్రదంగా జీవించేలా చూడడం పాలకుల బాధ్యత. అప్పుడే ఆ అభివృద్ధికి సార్థకత ఉంటుంది. అందుకే ప్రజలను ఒప్పించి, మెప్పించే ప్యాకేజీలు కల్పిం చి, వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం పై కచ్చితంగా ఉంది.

## ప్రజాపాలన విజయోత్సవాలు

# పండగలా వెల్లివిరియాలి

### సిఎం రేవంత్‌రెడ్డి సమీక్ష

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా డిసెంబర్ 1వ తేదీ నుంచి 9 వరకు పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తొలి ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలతో పాటు భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికను ప్రజలకు వివరించాలని సూచించారు. శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని, వివిధ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు శంఖుస్థాపనలు, ప్రారంభోత్సవాలను వారం రోజుల్లో జరిగేలా ప్రణాళికను రూపొందించుకోవాలని తెలిపారు. విజయోత్సవాల నిర్వహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ఉత్సవాల్లో అన్ని శాఖలు భాగస్వామ్యం పంచుకోవాలన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో 'ప్రజాపాలనవిజయోత్సవాల నిర్వహణ, ఏర్పాట్ల'అంశంపైన అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, ఉన్నతాధికారులతో సిఎం రేవంత్ రెడ్డి శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, శ్రీనివాస రాజు,సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి,ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, డిజిపి డాక్టర్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. విజయోత్సవాల్లో భాగంగా వరంగల్‌లో ఈ నెల 19న మహిళా శక్తి సంఘాలతో ఏర్పాటు చేసిన సభ విజయవంతం కావడం పట్ల అధికారులను సిఎం అభినంధించారు. కాగా సిఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు పనులను సిఎం పరిశీలించారు. అంతకు ముందు సమీక్షలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 30న మహబూబ్‌నగర్ లో ఏర్పాటు చేసే రైతు సదస్సుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని,రెండు రోజుల ముందు నుంచే(28వ తేదీ) రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని, వారికి అవసరమైన ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసాతో పాటు పంటల బీమా, సన్న వడ్లకు బోనస్.. రైతుల సంక్షేమమే ధ్యేయంగా తొలి ఏడాదిలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు. డిసెంబర్ 4న పెద్దపల్లి జిల్లాల్లో నిరుద్యోగ యువతతో విజయోత్సవ సభను నిర్వహించాలని సిఎం నిర్ణయించారు. ఆ వేదికగా గ్రూప్ 4తో పాటు వివిధ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందించేలా ఏర్పాట్లు చేయాలని సిఎం సూచించారు.



**శాఖల వారీగా నివేదికలు**

డిసెంబర్ 1వ తేదీ నుంచి శాఖల వారీగా నిర్దేశించిన కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. తమ శాఖల వారీగా రోజుకో మంత్రి తొలి ఏడాదిలో చేపట్టిన కార్యక్రమాల 'ప్రగతి నివేదిక'తో పాటు భవిష్యత్తు ప్రణాళికను మీడియా ద్వారా ప్రజలకు వివరించాలని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో రాష్ట్రమంతటా పండుగ వాతావరణం వెల్లివిరిసేలా ఉత్సవాలు నిర్వహించాలన్నారు. ఈ మూడు రోజుల పాటు హైదరాబాద్ సచివాలయ పరిసరాలు, ట్యాంక్ బండ్, నెక్లెస్ రోడ్ ప్రాంతమంతా తెలంగాణ వైభవం వెల్లివిరిసేలా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. ఈ ప్రాంతమంతా ఎగ్జిబిషన్ లాంటి వాతావరణం ఉండేలా వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే తెలంగాణ సంస్కృతి, కళారూపాలు ఉట్టి పడే కార్యక్రమాలతో పాటు మ్యూజికల్ షోలు, ఎయిర్ షో, కన్నుల పండువలా ఉండే డ్రోన్ షోలను నిర్వహించాలని సూచించారు. అన్ని వర్గాలను ఇందులో భాగస్వాములను చేయాలని సిఎం తెలిపారు. అన్ని పాఠశాలలు, హాస్టల్స్, కళాశాలల్లో ప్రజా పాలన విజయోత్సవ వేడుకలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని సిఎం ఆదేశించారు.

**9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ**

డిసెంబర్ 9న సచివాలయం ముఖద్వారం ఎదుట 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని ఆవిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ వేడుకలకు తెలంగాణ ఉద్యమకారులను, మేధావులను, విద్యావంతులను, వివిధ రంగాల్లో ప్రతిభ సాధించిన వారందరినీ ఆహ్వానించాలని అధికారులకు ఆయన సూచించారు. నియోజకవర్గానికో వెయ్యి మంది చొప్పున మహిళా శక్తి ప్రతినిధులను కూడా ఆహ్వానించి, లక్ష మంది తెలంగాణ తల్లుల సమక్షంలో 'తెలంగాణ తల్లి' విగ్రహాన్ని ఆవిష్కరించాలని, అందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్ ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సచివాలయం,నెక్లెస్ రోడ్డు, ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలు జరిగేందుకు వీలుగా వాహనాలను దారి మళ్లించాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు.

# వందే భారత్ రైలుపై దాడి

### ఇద్దరు యువకుల అరెస్టు



ప్రజాపక్షం / హైదరాబాద్ : ఇటీవలి కాలంగా దేశంలో సెమీహైస్పీడ్ వందే భారత్ రైళ్లపై దాడులు కొనసాగుతున్నాయి. తాజాగా బీహార్ రాష్ట్రం గయాలో రెండు వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లపై కొందరు దుండగులు రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో ఇద్దరు వ్యక్తులను ఆర్‌పిఎఫ్ పోలీస్ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. పాట్నా టాటా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు గయా స్టేషన్ నుంచి బయలుదేరి మన్పూర్ రైల్వే సెక్షన్ సమీపంలోకి రాగానే గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లు రువ్వారు. అదే విధంగా గయాహౌరా వందే భారత్ పై కూడా రాళ్ల దాడి చేశారు. ఘటనపై సమాచారం అందుకున్న గయా ఆర్‌పిఎఫ్ ప్రత్యేక పోలీస్ బృందం ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. దాడికి పాల్పడింది మన్పూర్ వాసులు వికాస్ కుమార్ (20), మనీష్ కుమార్ (20)గా గుర్తించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. తాము మరిన్ని రైళ్లను కూడా టార్గెట్ చేయబోతున్నట్లు విచారణలో బయటపెట్టారు. దీంతో అప్రమత్తమైన ఆర్‌పిఎఫ్ సిబ్బంది రైళ్లపై రాళ్ల దాడులను అరికట్టే చర్యలు ముమ్మరం చేశారు. వందేభారత్ రైళ్లపై రాళ్ల దాడులు చేసిన ఘటనపై అసిస్టెంట్ సబ్ ఇన్స్‌పెక్టర్ రామ్సేవక్ ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు ఆధారంగా సెక్షన్ 153, 147 రైల్వే యాక్ట్ కింద గయాలో కేసు నమోదు చేశారు.

# 'లగచర్ల ఘటన 'ప్రజల ధర్మాగ్రహం'



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : లగచర్ల ఘటన ప్రజల ధర్మాగ్రహం అని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ లక్ష్మణ్ అన్నారు. పోలీసులు అరెస్టు చేసిన లగచర్ల బాధితులను వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సేవాలాల్ సేన వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు భూక్య సంజీవ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫార్మా కంపెనీకి బలవంతంగా భూములు లాక్కొనే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని ఆయన కోరారు. లగచర్లలో ఫార్మా కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణకు రైతులు, ప్రజలు రానప్పుడు ఆ జిల్లా కలెక్టర్ కార్యక్రమాన్ని వాయిదా వేసుకోవాల్సి ఉందన్నారు. కానీ, ఇప్పటికే ఆగ్రహంతో ఉన్న రైతుల దగ్గరకు కలెక్టర్ వెళ్లడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. రైతుల ఆందోళనలను బలహీనపరిచేందుకు కలెక్టర్‌పై దాడిగా చిత్రీకరించారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం పునరాలోచించి లగచర్ల బాధితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో పౌరహక్కుల సంఘం ప్రధానకార్యదర్శి నారాయణరావు, లింగన్న, ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భీమా నాయక్, జివిఎస్ నేతలు ఇందల్ రాథోడ్, వెంకట్, నెహ్రూ నాయక్ తదితర గిరిజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

# 8 నుండి 16 వరకు ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ప్రజాపక్షం/హైదరాబాద్ : అగ్నివీరులుగా చేర్చుకొవడానికి భారతీయ ఆర్మీ రిక్రూట్ మెంట్ ర్యాలీ డిసెంబర్ 08వ తేదీ నుండి 16తేదీ వరకు నిర్వహిస్తున్నారు. రిక్రూట్‌మెంట్ ర్యాలీ గచ్చిబౌలిలోని జిఎంసి బాల యోగి అథ్లెటిక్ స్టేడియంలో జరుగుతుంది. ఈ ర్యాలీలో తెలంగాణలోని 33 జిల్లాల నుండి సైన్యంలోకి ఆభ్యర్థులు చేరనున్నారు. పదో తరగతి ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులకు అగ్నివీర్ జనరల్ డూటి, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్ , స్టోర్ కీపర్, అగ్నివీర్ ట్రేడ్స్ మెన్‌లో చేరేందుకు అర్హులు. అలాగే 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు అగ్నివీర్ ట్రేడ్స్ మెన్‌గా దరఖాస్తు చేసుకునే అర్హత కల్పించారు. మహిళా మిలిటరీ పోలీస్ (డబ్ల్యూపి) అభ్యర్థులకు, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు కేంద్ర పాలిత ప్రాంతము పుదుచ్చేరి (కరైకల్ యానాం) నుండి మహిళా మిలిటరీ పోలీస్ (డబ్ల్యూపి) అభ్యర్థులు, ఫిబ్రవరి 12, 2024 నాటి ర్యాలీ నోటిఫికేషన్ ప్రకారం ర్యాలీ సైట్ కి అన్ని డాక్యుమెంట్ లను తీసుకురావాలి.

రిక్రూట్ మెంట్ ప్రక్రియ పూర్తిగా అటోమేటెడ్, పారదర్శకంగా ఉంటుంది. ఎవరైనా ఉత్తర్ణత సాధించడానికి లెదా నమోదు చేసుకోవడానికి సహాయం చేయగలమని క్లెయిమ్ చేసే మోసపూరిత ట్వీట్ లు, మోసగాళ్ల నుండి అభ్యర్తులు జాగ్రత్త వహించాలి. వివరాలు కోసం అభ్యర్థులు రిక్రూట్ మెంట్ కార్యాలయం టెలిఫోన్ నంబర్‌లు 04027740059, 27740205కు ఫోన్ చేసి రిక్రూట్ మెంట్ అధికారులను సంప్రదించాలి.

# పది నిమిషాలు కేటాయిస్తే.. పసి ప్రాణాలు కాపాడే పరిస్థితి

### ఎంఎల్‌సి కవిత



ప్రజాపక్షం/హైదరాబాద్ : అన్ని సంక్షేమ శాఖలూ ముఖ్యమంత్రి వద్దనే ఉండడంతో సమయం వెచ్చించలేకపోతున్నట్టు కనిపిస్తోందని, కనీసం పది నిమిషాల సమయాన్ని కేటాయించి, తాజా పరిస్థితుల పైన సమీక్ష నిర్వహిస్తే పసి ప్రాణాలను కాపాడే పరిస్థితి ఉంటుందని బిఆర్‌ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సూచించారు. మరణించిన 42 మంది పిల్లల కుటుంబ సభ్యులకు రూ 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను చెల్లించాలని డిమాండ్ చేశారు. కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి గిరిజన బాలికల ఆశ్రమ పాఠ శాలలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై నిమ్స్‌ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి శైలజను, ఆమె కుటుంబ సభ్యులను కవిత శనివారం పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ పది రోజులకో పసిబిడ్డ ప్రాణం పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పసి బిడ్డల ప్రాణాలను ప్రాధాన్యతగల అంశంగా స్వీకరించి తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు ఏ ఒక్క పాఠశాలను చూసినా ఏదో ఒక సంఘటన జరిగిన దాఖలాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాల వ్యవస్థ ధ్వంసమైన పరిస్థితి కనిపిస్తోందని ఆమె తెలిపారు. నారాయణపేట హాస్టల్ ఘటన తర్వాత సిఎం సమీక్ష నిర్వహించారని, ఆ మరుసటి రోజునే మరో సంఘటన జరగడం ఆందోళనకరమన్నారు.

# సింగరేణి రిటైర్డ్ కార్మికులకు రూ. 18.27 కోట్ల దీపావళి బోనస్



ఈనెల 27న కార్మికుల ఖాతాల్లోకి బోనస్ : సిఎండి ఎన్.బలరామ్ వెల్లడి

ప్రజాపక్షం / హైదరాబాద్ : సింగరేణి సంస్థలో 2023 24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ 1, 2024 నుంచి అక్టోబరు 24, 2024 మధ్యలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులకు సంబంధించిన పర్ఫార్మెన్స్ లింక్డ్ రివార్డు స్కీమ్ ( దీపావళి బోనస్) సొమ్మును విడుదల చేస్తున్నామని , ఈనెల 27 వ తేదీన వారి ఖాతాల్లో బోనస్ సొమ్ము జమ అవుతుందని సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రిటైర్ అయిన 2,754 మంది కార్మికులకు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి గరిష్టంగా 93,750 రూపాయలు చొప్పున మొత్తం 18 కోట్ల 27 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నెల 27న రిటైర్డు కార్మికుల ఖాతాల్లో జమ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని ఆయన ఆర్థిక , సిబ్బంది వ్యవహారాల శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు.

# 'హిందీ మహావిద్యాలయ' గుర్తింపు రద్దు

### స్వయం ప్రతిపత్తి రద్దు చేయాలని యుజిసికి సిఫారసు
### విద్యార్థుల మార్కుల తారుమారు
### అక్రమాలను సహించేది లేదు
### ప్రొఫెసర్ కుమార్ మొలుగరం

ప్రజాపక్షం/హైదరాబాద్: నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల విద్యా ధృవీకరణ పత్రాలను ఫోర్జరీ చేసిన 'హిందీ మహా విద్యాలయ' కళాశాలపై ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఒయు)కఠిన చర్యలు తీసుకున్నది. ఉత్తీర్ణులైన విద్యార్థులను ఫెయిలైనట్లుగా, ఫెయిలైన విద్యార్థులను ఉత్తీర్ణులైనట్లు తప్పుడు సమాచారాన్ని అందించిన 'హిందీ మహా విద్యాలయ' అనుబంధ గుర్తింపును రద్దు చేసింది. కళాశాల స్వయంప్రతిపత్తిని రద్దు చేయాలని యుజిసి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అధికారులకు ఒయు సిఫార్సు చేసింది. ఒయు పరిధిలో మరెక్కడా హిందీ మీడియం కళాశాలలు లేనందున విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు విద్యాబోధనకు మినహాయింపునిచ్చింది. వచ్చే విద్యాసంవత్సరం 2025 2026 నుంచి ఎలాంటి యూజీ అడ్మిషన్లు చేపట్టవద్దని స్పష్టం చేసింది. 2019, 2022 వ విద్యాసంవత్సరానికి సంబంధించి యుజిలో సెమిస్టర్ పరీక్షల్లో ఫెయిలైన 49 మంది విద్యార్థులను ఉత్తీర్ణులైనట్టుగా, ఉత్తీర్ణులైన ఐదు గురు విద్యార్థులు ఫెయిలైనట్లుగా తారుమారు చేసిన జాబితాను హిందీ మహా విద్యాలయం ఒయు పరీక్షల నియంత్రణ కార్యాలయానికి సమర్పించింది. దీంతో ఆ విద్యాసంస్థ టిఆర్(ట్యాబులేషన్ రికార్డ్స్) రికార్డులపై అనుమానం వ్యక్తమవ్వగా, ఒయు అధికార యంత్రాంగం సమగ్ర విచారణకు ఆదేశించింది. మూడు దఫాలుగా హిందీ మహావిద్యాలయ విద్యా సంస్థను సందర్శించిన ఆ కమిటీ విస్తుపోయే అంశాలను గుర్తించింది. స్వయంప్రతిపత్తి కలిగిన హిందీ మాహావిద్యాలయ స్వయంగా పరీక్షల నిర్వహణ, పేపర్ ఎవాల్యూషన్ తమ అధ్యాపకుల తోనే నిర్వహిస్తోంది. ఇదే అదనుగా అక్రమాలకు పాల్పడినట్టు విచారణ కమిటీ గుర్తించింది. కమిటీ విచారణలో కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు కామర్స్ సమాధాన పత్రాలను దిద్దినట్లుట్లుగా తేలింది. విద్యార్థుల మార్కుల జాబితాలన్నీ ఫోర్జరీ చేసినట్లుగా ఆ కమిటీ గుర్తించింది. పరీక్ష పత్రాలు, ఎవాల్యూషన్, అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు సంబంధించిన నోటిఫికేషన్ వివరాలు కళాశాల యాజమాన్యం కమిటీకి సమర్పించకపోవడం గమనార్హం.

యూనివర్శిటీ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కళాశాల నిర్లక్ష్యంపై పూర్తి స్థాయిలోవిచారణ చేపట్టాల్సిందిగా కమిటీ అభిప్రాయపడింది. మరో దఫా కళాశాలను సందర్శించిన ఒయు విచారణ కమిటీ యూజీ 2023 24 బ్యాచ్ టిఆర్ రికార్డుల్లో ప్రిన్సిపల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంతకాలు, స్టాంపులు లేనట్లు గుర్తించింది. దీంతో యూనివర్శిటీ తుది నిర్ణయం తీసుకునేంత వరకు కళాశాల స్వయం ప్రతిపత్తిని అబయన్స్‌లో పెట్టాలని కమిటీ సిఫార్సు చేసింది. తుది నిర్ణయం కోసం వేసిన మరో కమిటీ కూడా అక్టోబర్ 4, 2024న సమగ్ర విచారణ చేపట్టింది. యూనివర్శిటీకి సమర్పించిన 2022 యుజి 6వ సెమిస్టర్ ఫలితాలు తప్పు అని, అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సంతకాన్ని ఫోర్జరీ చేశారని తేల్చింది.

హిందీ మాహా విద్యాలయ యాజమాన్యం 13 మంది బీకాం, 27 మంది బిఎస్‌సి, 9 మంది బిబిఎ విద్యార్థులు ఉత్తీర్ణులైనట్టుగా యూనివర్శిటీకి తప్పుడు సమాచారాన్ని అందజేసింది. నలుగురు బీకాం, ఒక బిబిఎ విద్యార్థి ఉత్తీర్ణులైనప్పటికీ ఫెయిలైనట్లుగా రికార్డులు తారుమారు చేసింది. ఈ విషయమై వివరణ ఇచ్చిన కళాశాల యాజమాన్యం తమ పరీక్షల విభాగం రికార్టుల్లో పొరపాట్లు జరిగినట్లు స్వయంగా ఒప్పుకుంది. అయినప్పటికీ తప్పు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఉస్మానియా విశ్వవిద్యాలయ పరీక్షల విభాగం ఈ విషయమై పదే పదే హెచ్చరించినప్పటికీ హిందీ మహావిద్యాలయా పెద్దగా స్పందించ లేదు. ఈ క్రమంలో విచారణ కమిటీలు తమ నివేదికలను యూనివర్శిటీ స్థాయి సంఘానికి నివేదించింది. ఈ విషయమై తీవ్రంగా స్పందించిన ఒయు స్థాయి సంఘం( స్టాండింగ్ కమిటీ) సంబంధిత రికార్డులను సత్వరమే సీజ్ చేయాలని ఒయు పరీక్షల నియంత్రణాధికారి, డీన్ సిడిసిలను అదేశించింది.

**ఫోర్జరీ చేసిన వారిపై క్రిమినల్ కేసు**

ఒయు అదనపు పరీక్షల నియంత్రణాధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసినందుకు గాను వారిపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది. సాధారణంగా పీజీ తరగతులు నాన్ అటానమస్ స్టేటస్ తో కొనసాగించుకోవచ్చని తెలిపింది. తుది సెమిస్టర్ పరీక్షలను స్వయంగా యూనివర్శిటీ నిర్వహించనుంది. స్థాయీ సంఘం( స్టాండింగ్ కమిటీ) సిఫార్సుల మేరకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు యూనివర్శిటీ ప్రకటించింది. ఫలితంగా ఎలాంటి అక్రమాలను సహించే ప్రసక్తే లేదని ఒయు సంకేతాలిచ్చింది. అనుబంధ, స్వయంప్రతిపత్తి కలిగిన విద్యాసంస్థలు, యూనివర్శిటీ, యుజిసి నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిందేనని ఒయు ఉప కులపతి ఆచార్య కుమార్ మొలుగరం తెలిపారు. విద్యా ప్రమాణాలు, పారదర్శకత, నిబంధనల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఈ ఏడు డ్రగ్స్ కేసుల్లో పెరిగిన శిక్షల శాతం

### 39 డ్రగ్స్ కేసుల్లో నిందితులకు జైలు శిక్ష
### అధికారులకు డిజిపి రివార్డులు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఈ ఏడాది ఎన్‌డిపిఎస్ చట్టం కింద నమోదైన కేసులలో శిక్షల శాతం పెరిగింది. 39 కేసుల్లో నిందితులకు జైలు శిక్ష పడే విధంగా తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టిజిఎఎన్‌బి) అధికారులు కృషి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కోర్టులలో ఈ ఏడాది 226 డ్రగ్స్ కేసులపై తీర్పులు వెలువడగా అందులో 39 కేసులలో నిందితులకు శిక్షలు పడ్డాయి. ఈ ఏడాది డ్రగ్స్ కేసులలో శిక్షల శాతం 17గా నమోదైంది. గత ఏడాది శిక్షల శాతం 11గా ఉంది. ఈ ఏడాది శిక్షల శాతం పెరగడం పట్ల డిజిపి డాక్టర్ జితేందర్ టిజిఎఎన్‌బి అధికారులను అభినందించారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డిజిపి కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డిజిపి డాక్టర్ జితేందర్, డ్రగ్స్ కేసుల విచారణ అధికారులకు, కోర్టు డ్యూటీ అధికారులకు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు ఎన్‌డిపిఎస్ చట్టం కింద తీర్పులను సాధించడంలో చేసిన కృషికి అభినందిస్తూ బహుమతులు ప్రదానం చేశారు. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్, ఖమ్మం, సైబరాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్,కరీంనగర్ జిల్లాలో అధికారులు మెరుగైన పనితీరు కనబర్చినట్లు డిజిపి పేర్కొన్నారు. ఈ జిల్లాల్లో 20 కేసుల్లోనే 50 నిందితులకు శిక్షలు పడ్డాయని డిజిపి తెలిపారు. తెలంగాణను 'నషా ముక్త్' తెలంగాణగా మార్చడం లక్ష్యంగా ఎన్‌డిపిఎస్ కేసులలో 100 శాతం తీర్పు సాధన అనివార్యమని డిజిపి తెలిపారు. 2023లో తీర్పు రేటు 11 శాతం మాత్రమే ఉండగా, 2024లో 17 శాతానికి పెరగడం గమనార్హం అన్నారు. 2023 డిసెంబర్ నుండి 2024 నవంబర్ వరకు, 22,654 మంది పోలీసులు, ఎక్సైజ్, రైల్వే, ప్రాసిక్యూషన్ శాఖలకు 59 శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.కోర్టు డ్యూటీ అధికారులకు, విచారణ అధికారులకు న్యాయ ప్రక్రియలు, ఫోరెన్సిక్ శాంపిల్ సేకరణ వంటి అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు.శిక్షణ కార్యక్రమాలు ఎప్పటికప్పుడు కొనసాగించడం ద్వారా, న్యాయ ప్రక్రియను పటిష్ఠంగా తయారు చేయడం సాధ్యమవుతుందన్నారు. న్యాయాధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, విచారణ అధికారులు, పర్యవేక్షణాధికారుల మధ్య సంయుక్త శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డిజిపి మహేష్ ఎం భగవత్, టిజిఎఎన్‌బి డైరెక్టర్ సందీప్ షండిల్యా, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ వైజయంతి, టిజిఎఎన్‌బి ఎస్‌పి పి. సాయి చైతన్య,అదనపు ఎస్‌పి పి. కృష్ణమూర్తిలు పాల్గొన్నారు.

### పట్టణ కాలుష్య సంక్షోభాన్ని నివారించడానికి

# కృతనిశ్చయంతో తెలంగాణ ప్రభుత్వం

### ఉత్తమ్ కుమార్ రెడ్డి




ప్రజాపక్షం/హైదరాబాద్ : పట్టణ ప్రాంతాల్లో పెరుగుతున్న కాలుష్య సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాలను (ఇవి) ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని నీటి పారుదల, ఆహారం, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎఎస్‌సిఐ)లో శనివారం జరిగిన ర్యాప్ ఎకో మోటార్స్ 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తి చేసిన'ఈరాజా ఎల్5 సెగ్మెంట్ ఎలక్ట్రిక్ ఆటో'ను ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజారోగ్యం, ఆర్థిక ఉత్పాదకత, పర్యావరణ స్థిరత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేసే పట్టణ కాలుష్యాన్ని పరిష్కరించడానికి తక్షణ, దీర్ఘకాలిక చర్యలను ప్రభుత్వం చేపడుతుందన్నారు.నియంత్రణ లేని కాలుష్యం మన నగరాలను ఇదే విధమైన ఆరోగ్య, పర్యావరణ విపత్తులోకి నెట్టివేస్తుందన్నారు. ప్రజలు జీవించలేని పరిస్థితుల్లో జీవించవలసి వస్తుందన్నారు. అలాంటి దృష్టాంతాన్ని నివారించడానికి తెలంగాణా ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని చెప్పారు.ఈ సందర్భంగా సెంటర్ ఫర్ ఎనర్జీ స్టడీస్ (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా) డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కిరణ్ బిలోలికర్,సిఇఒ ఆర్ బాలకృష్ణన్ మాట్లాడుతూ 'మేక్ ఇన్ ఇండియా' మిషన్‌లోతయారైన ఈ ఎలక్ట్రిక్ ఆటోలు ప్రయాణికులు, సరుకు రవాణా వేరియంట్లలో ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ వాహనాల (ఇవి) తయారీ, విడిభాగాల రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు మద్దతుగా నిలుస్తుందన్నారు. వాహనంలో 8 కేడబ్ల్యు/150 ఏహెచ్ సామర్థ్యంతో ఉన్న బ్యాటరీని మూడు గంటల్లో పూర్తిగా ఒక్కసారి చార్జ్ చేస్తే ఈ ఆటో 120 నుంచి 140 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందన్నారు.

# హైదరాబాద్‌లో ట్రాఫిక్ పోలీసుల రోప్ ఆపరేషన్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ట్రాఫిక్ పోలీసులు హైదరాబాద్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. రోప్ ఆపరేషన్ పేరుతో ఫుట్‌పాత్‌లను సరిచేస్తున్నారు. ఈ క్రమంలోనే హైదరాబాద్ ట్రాపిక్ అదనపు పోలీసు కమిషనర్ పి.విశ్వప్రసాద్, ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, నార్త్‌జోన్ ట్రాఫిక్ ఎసిపి జి.శంకర్‌రాజులు జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి వెస్ట్ మారేడ్‌పల్లి, సికింద్రాబాద్‌లో రోప్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు పోలీసు కమిషన్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ..ఫుట్‌పాత్‌లపై అక్రమంగా నిర్మించిన షెడ్లు, అక్రమణలను తొలగిస్తున్నామన్నారు. రోడ్లపై అక్రమ నిర్మాణాలను నిర్మించిన వారిపై తగిన చర్యలు తీసుకుని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు. అక్రమంగా నిర్మించిన ఈ నిర్మాణాలు ట్రాఫిక్‌కు తీవ్ర ఆటంకాలు కలిగిస్తున్నాయన్నారు. ప్రయాణికులు, సాధారణ పౌరులకు ఇబ్బందులు కలిస్తున్న వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

# కాజీ నజ్రుల్ ఇస్లాం కవిత్వం 'విద్రోహి' ఆవిష్కరణ



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : 1926లో మతకలహాలు తలెత్తినప్పుడు మతసామరస్యం కోసం ప్రేమతత్వాన్ని బోధించిన ప్రముఖ ఉర్దూ కవి కాజీ నజ్రుల్ ఇస్లాం అని విరసం నేత వరవరరావు అన్నారు. వరవరావు తెలుగులోకి అనువదించిన కాజీ నజ్రుల్ ఇస్లాం కవిత్వం 'విద్రోహి'ని శనివారం సాయంత్రం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్, కవి సుధాకిరణ్‌తో పాటు పలువురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ముంబైలో ఉన్న వరవరరావు ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ నజ్రుల్ కవిత్వం నిండా ప్రేమతత్వం ప్రబోధపడుతుందన్నారు. జైలు గోడలు బద్దలుకొట్టి స్వేచ్ఛా వాయువు పీల్చిన మహాకవి నజ్రుల్ ఇస్లాం అని పేర్కొన్నారు. ఉపా, నియా చట్టాలను తీసుకొచ్చిన సమయంలో జైలు గోడల మధ్య తాను 'విద్రోహి' కవిత్వంను తెలుగులో అనువదించేందుకు సిద్ధమయ్యానని చెప్పారు. నజ్రుల్ ఇస్లాం కవిత్వాలను ఎక్కువగా హిందూ సాహితీవేత్తలు ప్రశంసించారని తెలిపారు. ఎన్.వేణుగోపాల్ మాట్లాడుతూ బెంగాల్ పునర్వికాసంలో నజ్రుల్ కీలక భూమిక పోషించారన్నారు. నజ్రుల్ 4వేల పాటలు, 2,800 కవితలు రాశారని, వీటిలో కొన్ని 18 భాషల్లో అనువాదంచేశారని గుర్తుచేశారు. 76 ఏండ్ల నజ్రుల్ జీవితంలో ఆయన కవితలు తెలుగులో ఎక్కువగా ప్రభావితం కాలేకపోయాయని తెలిపారు. 1922లో రాసిన విద్రోహి కవిత్వంకు నేటికి 102 ఏండ్లు అవుతున్నా ఆ సంచికను ఎంతో మంది ఆదరిస్తున్నారని చెప్పారు. లెల్లే సురేశ్ సమన్వయకర్తగా వ్యవహరించగా, హైదరాబాద్ బుక్ ట్రస్టు, కాలం గుండె చప్పుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పౌరహక్కుల నేత హరగోపాల్, ప్రజా గాయకులు విమలక్క పలువురు సాహితీవేత్తలు, కవులు తదితరులు పాల్గొన్నారు.

# బాదేపల్లి మార్కెట్ కమిటీ స్థాయిని పెంచండి : ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ స్థాయిలో స్పెషల్ గ్రేడ్ నుండి సెలక్షన్ గ్రేడ్ కు పెంచాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి కోరారు. మార్కెట్ కమిటీ స్థాయిని పెంచ డంతో పాటు గా అందుకు తదనుగుణంగా సిబ్బంది, సౌకర్యాలను కూడా పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఒక వినతి పత్రాన్ని శనివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు సమర్పించారు. మహబూబ్‌నగర్ జిల్లా లోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ ఎంతో చరిత్ర కలిగిన పాత మార్కెట్ యార్డ్ అని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం లో ప్రసిద్ధి చెందిన ఐదు వ్యవసాయ మార్కెట్లలో ఇది కూడా ఒకటి అన్నారు. ఈ మార్కెట్ లో వ్యవసాయ ఉత్పత్తుల కు పలికే ధరలను రేడియో, టీవీ లలో ప్రసారం చేస్తారని, ఇక్కడ పలికే ధరలను బట్టి ఇతర మార్కెట్ లలో ధరలను నిర్ణయించడం జరుగుతుందని తెలిపారు. నానాటికీ అభివృద్ధి చెందుతున్న ఈ మార్కెట్ లో వరి ధాన్యం, వేరుశెనగ, కందులు, మొక్క జొన్న, రాగులు, ఆముదాలు, పొద్దు తిరుగుడు తదితర వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలు జోరుగా సాగుతాయని, పత్తి అమ్మకాల్లో కూడా బాదేపల్లి మార్కెట్ తనదైన ప్రత్యేకతను చాటుకుంటుం దని చెప్పారు. ఈ మార్కెట్ కు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా వ్యాపారులు రైతులు పెద్ద సంఖ్యలో వస్తా రని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా బాదేపల్లి మార్కెట్ కమిటీ ద్వారా చెప్పుకోదగ్గ స్థాయిలో ఆదాయం సమకూరుతుందని అనిరుధ్ రెడ్డి చెప్పారు. ప్రస్తుతం స్పెషల్ గ్రేడ్ లో ఉన్న ఈ మార్కెట్ లో ఉన్న సిబ్బంది సౌకర్యాలు మార్కెట్ అవసరాలకు సరిపోవడం లేదని అభిప్రాయపడ్డారు. అందుకే వీలైనంత త్వరగా బాదేపల్లి మార్కెట్ కమిటీ స్థాయిని పెంచి తద నుగుణంగా సిబ్బంది సౌకర్యాలు పెంచడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల ను అనిరుధ్ రెడ్డి కోరారు.



# లెదర్ ఇండస్ట్రియల్ పార్క్‌ను పునఃప్రారంభించాలని వినతి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గం జడ్చర్ల మండలంలో పోలపల్లి లో ఉన్న లెదర్ ఇండస్ట్రియల్ పార్కును దళిత సామాజిక ప్రజల కోసం పున ప్రారంభించాలని కేంద్ర మంత్రివర్యులు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి మెమొరాడమిచ్చు వివరించడం జరిగింది కిషన్ రెడ్డి స్పందిస్తూ తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వానికి, పాలమూరు జిల్లా కలెక్టర్ కు ప్రత్యేక లేక ద్వారా దీని విషయం పై సమగ్ర సమాచారం తెలుసుకొని దళితుల కుటుంబాలకు అండగా ఉంటానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మర్చ రాష్ట్ర నాయకులు శంకర్ అన్న నిర్మల్ అన్న శ్యామ్ అన్న, ముఖ్య నాయ కులు పాల్గొన్నారు.



# కెటిఆర్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలి : ఎమ్మెల్యే వంశీకృష్ణ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** కొండారెడ్డిపల్లి మాజీసర్పంచ్ సాయి రెడ్డి ఆత్మహత్య ఘటనలో మాజీమంత్రి కేటిఆర్ చెప్పుడుమాటలుకాకుండా వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని, సాయిరెడ్డి ఇంటికిదారిలేకుండా గోడ నిర్మించినట్లయితే ఎమ్మెల్యే పదవికి రాజీనామాచేస్తానని గోడలేకుంటే మాజీమంత్రి కేటిఆర్ రాష్ట్రప్రజల తప్పుతో పట్టించినందుకు ప్రజలకు క్షమా పణచెప్పాలని అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ డిమాండ్‌చేశారు. శనివారం వంగూరు మండలం కొండారెడ్డిపల్లి మాజీ జడ్పిటిసి కెవిఎన్‌రెడ్డి నివాసంలో పొల్యూషన్‌బోర్డు సభ్యులు మాజీజడ్పివైస్‌చైర్మన్ ఠాగూర్‌బాలా జిసింగ్‌తో కలిసి అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ విలేకరుల సమా వేశంలో మాట్లాడారు. సాయిరెడ్డి కాంగ్రెస్‌పార్టీ కార్యకర్త అని, కొండారెడ్డి పల్లి గ్రామానికి రెండు పర్యాయాలు సర్పంచ్‌గా ప్రజలకు సేవచేశాడని ఎమ్మెల్యే గుర్తుచేశారు. అలాంటివ్యక్తి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకర మని ఆయన మృతికి సంతాపం తెలియజేశారు. సాయిరెడ్డి నివాసం తూర్పుకు 30ఫీట్లరోడ్డు ఉందని, పడమరన దొడ్డిదారి ఉండేదని వాస్తవాలు తెలుసుకోకుండా మాజీమంత్రి కేటిఆర్ సాయిరెడ్డి ఇంటికి గోడ నిర్మించడం తోనే నిరాశచెంది ఆత్మహత్య చేసుకున్నాడని ఆరోపించడం సమంజసంకాద న్నారు. ఇలాంటి శవరాజకీయాలను మానుకోవాలన్నారు. ఈ సమావే శంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణారెడ్డి , రమేష్‌రెడ్డి, జైపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# దళారులకు విక్రయించొద్దు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్విని యోగం చేసుకోవాలని మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్ కోరారు. పట్టణం లోని మార్కెట్‌యార్డులో(మెప్మా) మహిళాసంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచే సిన వరిధాన్యం కొనుగోలుకేంద్రాన్ని శనివారం పొల్యూషన్‌బోర్డుమెంబర్ బాలాజీసింగ్‌తో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ ఆరుగాలం రైతులు కష్టించి పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతుధర పొందాలన్నారు. రైతులు వరిధా న్యాన్ని 17శాతం తేమతో కొనుగోలుకేంద్రాలకు తీసుకురావాలని దళారు లకు విక్రయించి మోసాలకు గురికావొద్దని అన్నారు. రైతులకు కొనుగోలు కేంద్రాలవద్ద ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చూడాలని అధికారు లకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎజాజ్,రవి, కాంగ్రెస్‌నాయ కులు చంద్రకాంత్‌రెడ్డి, మసూద్, వెంకటేష్, దున్నసురేష్, మార్కెట్ సెక్రటరీ భగవాన్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# 28న ధర్నా

ప్రజాపక్షం / ఊట్కూర్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ఈ నెల 28న ధర్నా నిర్వహించాలని అఖిల భారతీయ ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు మండల పగిడిమర్రి ఎల్కోటి చెన్నప్ప పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఎల్కోటి చెన్నప్ప వ్యవసాయ కార్మికులకు 12వేల జీవనభృతిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు.

# రోడ్డు విస్తరణ బాధితులకు ఇందిరమ్మ ఇల్లు



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ప్రజా రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శని వారం పాన్‌గల్ మండల పరిధిలోని కేతేపల్లి గ్రామంలో రూ. కోటి 99 లక్షలతో 600 మీటర్ల మేరకు రోడ్డు విస్తరణ పనులకు, గ్రామంలో ఆప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రోడ్డ విస్త రణ బాధితులతో గ్రామస్తులతో మాట్లాడారు. రోడ్డ విస్తరణకు ప్రజలు సహకరించాలని విస్తరణ బాధితులకు ఇందిరమ్మ ఇల్లును మంజూరు చేస్తా మని ఆయన అన్నారు.ప్రజల భాగస్వామ్యంతో అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఆహర్నిశలు కృషి చేస్తుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా ప్రభు త్వంలో అవినీతి అక్రమాలకు తావు లేకుండా ప్రజా పాలన కొనసాగుతుందన్నారు.

మంత్రి జూపల్లికి సిపిఐ వినతి

కేతేపల్లి గ్రామంలో స్మశాన వాటికకు అభివృద్ధికి రూ. 20 లక్షలు మంజూరు చేయాలని, గ్రామం లోని బీరప్ప వద్ద గల 324 బీసీ ప్లాట్లలో ఇండ్లు నిర్మించుకునేందుకు నీటి వసతి, కరెంటు వసతి కల్పించాలని, గ్రామంలో 50 ఫీట్ల రోడ్డ విస్తర ణలో ఇండ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూంతో పాటు నష్టపరిహారం ఇవ్వాలని, ఎక్కు వగా నష్టపోయిన వారికి డబుల్ బెడ్ రూంతో పాటు ప్రభుత్వ స్కీంలో ప్రాధాన్యత ఇవ్వాలని సిపిఐ నాయకులు కళావతమ్మ, శ్రీరాములు మంత్రి జూపల్లి కృష్ణారావుకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో జిల్లా డిసిసిబి చైర్మన్ మామిల్లపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ఆర్‌అండ్‌బి డిఈ సీతారామ స్వామి, ఎంపిడిఓ గోవిందరావు, ఏఐసీసీ ఓబిసి జాతీయ కో ఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్, డా. పగిడాల శ్రీనివాస్ , మాజీ ఎంపీపీ వెంకటేష్ నాయుడు, మాజీ జడ్పీటీసీ రవికుమార్ , సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్ యాదవ్ ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, కాంట్రాక్టర్ తిరుపతయ్యసాగర్ , ఏఈ రాకేష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, వివిధ గ్రామాల మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్ నాయకులు శవరాజకీయం



**ప్రజాపక్షం/వంగూర్ :** బిఆర్‌ఎస్ నాయ కులు శవరాజకీయాలు మానుకోవాలని నాగ ర్‌కర్నూల్ ఎంపి డాక్టర్ మల్లురవి, నాగర్‌క ర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి, అచ్చం పేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. శనివారం మండలపరిధిలోని కొండారెడ్డిపల్లి మాజీస ర్పంచ్ సాయిరెడ్డి మరణవార్త తీవ్ర దిగ్భ్రాం తికి గురిచేసిందని వారు పేర్కొన్నారు. బిఆర్ ఎస్ నాయకులు హరీష్‌రావు, కేటిఆర్, గువ్వ లబాల్‌రాజు సాయిరెడ్డి మరణానికి ఎలాంటి సంబంధంలేని విషయాన్ని ముఖ్యమంత్రి కుటుం బానికి అంటగట్టడం వీరి నీతిలేని రాజకీయానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి పుట్టిన ఊరుకు సేవచేయాలనే ఉద్దేశ్యంతో నాలుగులైన్ల రోడ్డు, పాలశీతలకేంద్రం, బిసి కమ్యూనిటిహాల్, గ్రంథా లయం, పశువైద్యశాల, సోలార్‌సిస్టం, డిజిటల్ గ్రామపంచాయతీలాంటి అభివృద్ధి కార్యక్రమా లకు రూ.100కోట్ల నిధులు ఖర్చుచేసి గ్రామాన్ని అభివృద్ధిచేస్తే ప్రతిపక్షపార్టీల నాయకులు అభివృ ద్ధినిచూసి ఓర్వలేకే శవరాజకీయం చేస్తున్నారని వారు విమర్శించారు. సాయిరెడ్డి ఇంటికి వెళ్లడా నికి తూర్పుభాగంలో 40ఫీట్ల సిసిరోడ్డు ఉంద న్నారు. మాజీ ఎమ్మెల్యే గువ్వలబాల్‌రాజును అచ్చంపేట నియోజకవర్గ ప్రజలు చీద రించి రాజకీయానికి అవసరంలేదని 50వేల ఓట్లపైచిలుకు ఓటమితో ఇంటికి పంపించిన ఇప్పటికైనా ఆయన నైజంమాత్రం ఏమాత్రం మారలేదని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పేర్కొన్నారు. చౌకబారు విమర్శలుమాని ప్రభుత్వానికి మంచి సలహాలు సూచనలు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయకమీషనర్ సభ్యులు కెవిఎన్‌రెడ్డి, మహ బూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు కొత్వాల్, నాగర్‌కర్నూల్ జిల్లామాజీవైస్‌చైర్మన్ బాలాజిసింగ్, కాంగ్రెస్‌పార్టీ మండల పార్టీ అధ్య క్షులు పండిత్‌రావు,కాశన్నయాదవ్, పాండురం గారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, వేమారెడ్డి, రాఘవేందర్, పిల్లివెంకటయ్యయాదవ్ పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణకు తనిఖీలు

## ఎస్‌పి రావుల గిరిధర్

**ప్రజాపక్షం / వనపర్తి టౌన్ :** ఆసాంఘిక కార్య కలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తప్పవని డిఎస్పీ వెంకటేశ్వరరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఎం. క్రిష్ణ ఆధ్వ ర్యంలో సిఐలు 2, ఎస్ఐలలు 12 మంది మొత్తం 80 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జంగాలగుట్ట, బుడగ జంగాల కాలనీలలో పోలీ సులు ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ్ తనిఖీలు నిర్వహించి సుమారు 250 ఇళ్లను సోదాలు చేశారు. పత్రాలు సరిఇగా లేని నంబర్ ప్లేట్ లేని 2 కార్లు, 3 ఆటో, 25 ద్విచక్ర వాహనాలు మొత్తం 30 వాహనాలు అదుపులలోకి తీసుకొని సీజ్ చేసి వనపర్తి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకు వెళ్లారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనా లను తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం , సెన్సాఫ్ , సెక్యూరిటి కల్పించడం గురించి ఎవరైనా కొత్త వ్యక్తులు నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహిం చడం జరుగుతుందని ఆయన తెలిపారు. గుడుంబా, గుట్కా, గంజాయి లాంటి అక్రమ వ్యాపారం, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. వాహనాలు నడిపేట ప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచిం చారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాల న్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఉండి ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఇన్సూరెన్స్ వర్తించదన్నారు. ప్రజలు, మహిళలు ఆపద సమ యంలో ఎవరైనా చట్ట వ్యతిరేకమైన కార్యకలాపా లకు పాల్పడిన , యువకులు గుంపులుగా ఏర్పడి బహిరంగ మద్యపానం సేవించిన ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాందాస్ తేజావత్ , వనపర్తి డిఎస్పీ వెంకటేశ్వర్ రావు, వనపర్తి సిఐ , ఎం. కృష్ణ, సిఐ రాంబాబు, సాయుధ దళ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ , అప్పలనా యుడు, వనపర్తి రూరల్ ఎస్ఐ, జిలేందర్ రెడ్డి, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్ , మహిళ కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# పారిశుద్ధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

**ప్రజాపక్షం / ధన్వాడ :** మండల కేంద్రంలో సత్యసాయి 99వ జయంతిని పురస్కరించుకొని సత్యసాయి సేవ సమితి జిల్లా కన్వీనర్ చిట్టెం మాధవరెడ్డి పారిశద్ధ్య కార్మికులకు గ్రామ పంచాయతీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు జట్రం లక్ష్మ ణ్ గౌడ్ చీరాల సుధాకర్ రెడ్డి, కంచె నరేందర్ , ఆనంద్ గౌడ్ , శ్రీహరి, సత్యనారాయణ,నరేందర్ గౌడ్ , నవీన్ ఆచారి, కమ్మరి వెంకట్రాములు చారి, లక్ష్మ య్య, బాబు, నేరెటి బాబా, కార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది , కార్బార్ ఉదయభాను , బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రారంభం

## ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం / మక్తల్ :** మక్తల్ నియోజకవర్గంలో త్వరలోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను దాదాపుగా రూ. 170 కోట్లతో స్థాపించడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతనంగా నిర్మిచిన ప్రభుత్వ ఆసుపత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల నిర్మించడానికి ప్రభుత్వం దాదాపుగా రూ. 26 కోట్లు మంజూరుచేయడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం మన మక్తల్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి ఉందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణరెడ్డి, మాజీ జడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్ , మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రైతును బతికిస్తే రాజ్యాన్ని బతికిస్తాడు

## మాజీఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** రైతును బతికిస్తే రాజ్యాన్ని బతికిస్తాడని, టిఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతేరాజు నినాదంతో కెసిఆర్‌పాలన కొనసాగిస్తే దౌర్జన్యమే మావిధానమని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపాలన కొనసా గిస్తున్నారని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. శని వారం పట్టణంలోని మార్కెట్‌యార్డులో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కాంగ్రెస్‌ప్రభుత్వం సన్నవడ్లకే కాకుండా ప్రతిపంటకు రూ.500బోనస్ అందించాలన్నారు. మధ్యవర్తులకు అవకాశం ఇవ్వ కుండా వరిధాన్యం కొనుగోలుచేయాలన్నారు. అనంతరం ఆయన సాయి రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శించారు. కల్వకుర్తి మున్సిపల్‌వార్డు కౌన్సిలర్ భర్త బుచ్చయ్య మృతదేహానికి పూలమాలతో నివాళులర్పించి బుచ్చయ్య కుమారుడు సతీష్‌ను కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మార్కెట్‌కార్యదర్శి భగవంతు, మున్సిపల్‌చైర్మన్ ఎడ్మసత్యం, మాజీ చైర్మన్ శ్రీశైలం, మాజీవైస్ ఎంపిపి గోవర్ధన్, కౌన్సిలర్ సూర్యప్రకాష్, టిఆ ర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



# విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించేలా చర్యలు

## కలెక్టర్ సిక్తా పట్నాయక్

**ప్రజాపక్షం /నారాయణపేట ప్రతినిధి :** జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాయ్స్ జూనియర్ కళాశాలను , బిసి కాలేజీ బాయ్స్ హాస్టల్ , బిసి గర్ల్స్ హాస్టల్స్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా కిచెన్ స్టోర్ లోని ఆహార పదార్థాలను, సామాగ్రిని స్టార్ట్ రిజిస్టర్న్ , ఫుడ్ క్వాలిటి రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. కిచెన్ రూం , డైనింగ్ హాల్ , డార్మెటరీ, క్లాస్ రూమ్స్ , టాయిలెట్స్ , స్టాఫ్ రిజిస్టర్లను పరిసరాలను పరిశీలించడం జరిగింది. అల్పాహార సమయంలో విద్యార్థులతో పాటు కూర్చొని ఆల్పాహారాన్ని భుజించడం జరిగింది. ఫుడ్ కమిటీ విద్యార్థులతో ఆహార నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపల్ జగదీశ్వర్ , డిప్యూటీ వార్డెన్ ఇంతియాజ్ లకు కలెక్టర్ సలహా ఇవ్వడం జరిగింది. బీసీ హాస్టల్ లో బియ్యం తనిఖీ చేసి వంటలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు మైనార్టీ అధికారి ఎం.ఎ. రషీద్ ,ఈడి ఎస్సి కార్పొరేషన్ ఖలీల్ , తహసీల్దార్ అమరేంద్ర, కృష్ణ, వార్డెన్ మాసుద్ మొదలైన అధికారులు పాల్గొన్నారు.



# సిఎం బహిరంగ సభకు స్థల పరిశీలన

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ముఖ్యమంత్రి పర్యటనను పురస్క రించుకుని, బహిరంగ సభ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ముందుగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎంవిఎస్ ఆర్ట్స్ సైన్స్ కళా శాల మైదానాన్ని పరిశీలించి, తర్వాత బుత్ పరిషత్ ఉన్నత పాఠశాల ఆవర ణలో భహిరంగ సభ నిర్వాహణకు స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్ రావు, ఎఎస్పీ రాములు, డిఎస్పీ వెంకటేశ్వర్లు, మహబూబ్‌నగర్ తహసీల్దార్ ఘన్సీరాం బూత్పుర్ తహ సీల్దార్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబులెన్స్ ఏర్పాటుకు విజ్ఞప్తి

**ప్రజాపక్షం / మూసాపేట :** మూసాపేట మండలంలో చాలా సంవత్సరాల నుండి 108 ఉచిత అంబులెన్స్ లేక రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నా రని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే ప్రైవేట్ వాహనంలో , ఆటోలో అధిక డబ్బులు చెల్లిస్తూ సకాలంలో సరైన వైద్యం అందక చాలా మంది అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం వల్ల ఆర్థికంగా , ప్రాణ నష్టం జరుగుతుందన్నారు. అతి తొందరలో మూసాపేట మండలానికి ఉచిత 108 అంబులెన్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో వేముల గ్రామస్తులు సాయిలు, కుమ్మరి ఆంజనేయులు, కుర్వ అంజన్న, డాక్టర్ బీరప్ప, అబ్దుల్లా, సంకల మద్ది, రాములు, తునికిపూర్ కృష్ణయ్య, దాసరిపల్లి ఆంజనేయులు, బిఎస్పి దేవరకద్ర అసెంబ్లీ నియోజక వర్గ జనరల్ సెక్రటరీ వేముల కొండన్న, మండల ప్రజలు పాల్గొన్నారు.



# పశువుల డేటా సేకరణ

## ఎమ్మెల్యే యెన్నం

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః ప్రతి పశువు డాటాను సేకరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న పశు గణన సర్వేకు చెందిన పోస్టర్ ను శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి జరగనున్న పశు గణన సర్వే జరుగుతుందని పశు వైద్య అధికారులు ఎమ్మెల్యే కి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నియోజకవర్గం లో ఉన్న ప్రతి ఒక్క పశువు డాటాను, క్షేత్ర స్థాయిలో సేకరించాలని, భవిష్యత్తులో పశువులకు ఎలాంటి అనారోగ్య సమ స్యలు కలగకుండా జంతువులు సంరక్షణ గురించి వాటి యజమానులకు తగు సూచనలు సలహాలు ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే పశువుల యజమానులు కూడా పశువుల గణనకు వచ్చే అధికారులకు పూర్తి సమా చారం అందించి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా.మధుసూదన్ గౌడ్, డా.వెంకటేశ్వర్లు, డా.రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.



# పత్తి రైతులను ఆదుకుంటాం

## ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ : నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని తిమ్మా జిపేట మండలం మారేపల్లి గ్రామంలోని రైతవేదికలో నిల్వ ఉంచిన పత్తిదగ్ధ మైన సంఘటన తెలిసినవెంటనే ఎమ్మెల్యే డాక్టర్‌రాజేష్‌రెడ్డి సంఘటన స్థలా నికి చేరుకొని ప్రమాదపు వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహసీల్దార్‌కు పూర్తి వివరాలను అందించి రైతులను ఆదుకోవాలని సూచిం చారు. నిరంతరం కష్టపడి పండించిన రైతును ఆదుకునేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చిస్తానని తెలిపారు. అధైర్యపడవద్దని రైతులను ఓదార్చారు.



# మృతుల కుటుంబాలకు పరామర్శ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం కొండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన సాయిరెడ్డి ఆత్మహత్య చేసుకొని మృతిచెందగా, కల్వ కుర్తి మున్సిపల్ పరిధిలోని 6వవార్డు కౌన్సిలర్ విజయలక్ష్మి భర్త బుచ్చయ్య అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డినారా యణరెడ్డి వేర్వేరుగా వారి మృతదేహాలకు పూలమాలలువేసి నివాళులర్పిం చారు. కాంగ్రెస్‌పార్టీ నాయకులు సతీష్‌తోపాటు కుటుంబసభ్యులను పరామ ర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో కల్వకుర్తి మాజీసర్పంచ్ ఆనంద్‌కుమార్, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్‌యాదవ్, సురేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఉన్నారు.




# విద్యార్థులకు నాణ్యతగా భోజనం

## కలెక్టర్ బదావత్‌సంతోష్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** విద్యార్థులకు అందించే భోజనం పరిశు భ్రమైన నాణ్యతగా ఉండాలని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అన్నారు. శని వారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు సీతారామారావు, దేవసహాయం, సంబంధిత జిల్లా అధికారులు, బిసి, ఎస్‌సి, గురుకులాలు, సంక్షేమహాస్టల్లో నిర్వహణపై సంబంధిత అధికారులతో కలె క్టర్ సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఎస్‌సి, ఎస్టి,బిసి, మైనార్టీ, సంక్షేమహాస్టల్స్, ప్రభుత్వ పాఠశాలలు, రెసి డెన్షియల్ గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడి కేంద్రాల్లో విద్యా ర్థులకు నాణ్యతతోకూడిన ఆహారాన్ని అందించాలని అధికారులను ఆదేశిం చారు. వసతిగృహాలను అధికారులు తనిఖీచేయాలని, అక్కడ విద్యార్థులకు అందుబాటులో ఉన్న వసతులు పరిశీలించాలని, హాస్టల్స్‌లో చేపట్టాల్సిన పనులు, పిల్లలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల ప్రతిపాదనలు పంపా లని ఆదేశించారు. అలసత్వం వహించే అధికారులపై కఠిన చర్యలు చేపడుతా మని హెచ్చరించారు. ఈ సమీక్ష సమావేశంలో కెజిబివి అధికారులు, సిడిపి ఓలు, ఎంఈవోలు, రెసిడెన్షియల్ పాఠశాలల డిసిఓలు, కళాశాలల ప్రిన్సి పాల్స్, హస్టల్‌వార్డెన్‌లతోపాటు డిఎస్‌సిడిఓ, డిఎంహెచ్‌ఓ అధికారులు పాల్గొ న్నారు.

# కొనుగోలు కేంద్రాలను సందర్శించిన ఏఓ



**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రప్ర భుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వడ్లకొనుగోలు కేంద్రాలను మండల వ్యవసాయశాఖ అధికా రిణి ప్రియదర్శిని శనివారం నిజాంబాద్, సర్వారెడ్డిపల్లి ,గాజర గ్రామాలలో సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ వరికొయ్యలను కాల్చడంద్వారా భూమి సేంద్రీయ ఎరువులను కోల్పో తుందని తద్వారా రైతుకు మేలుచేసే జీవకణాలు మరణిస్తాయని వారు పేర్కొ న్నారు. తప్పనిసరిగా రైతులు వడ్లను తేమశాతాన్ని చూసుకొని సిసిఐకి విక్ర యించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓలు జైపాల్ అనిల్‌కుమార్, ఆయా గ్రామాల రైతులు భరత్, భూషణరావు, వెంకటేశ్వరరావు, అంజన్ రావు, దాసరి రవికుమార్, లింగమయ్య పాల్గొన్నారు.

# నిరుపేదల ముంగిటకు పథకాలు

## మంత్రి పొంగులేటి



ప్రజాపక్షం/భద్రాచలం : ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్క పేదవారి దరి చేరాలని, ఇందుకు కోసం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని రాష్ట్ర గృహనిర్మాణ, రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం స్థానిక కేకే ఫంక్షన్ హాల్లో నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ ఆలోచనను ఆలచరణలో పెట్టి గిరిజన కుటుంబాలు, గిరిజన రైతులకు, గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేకశ్రద్ధతో పనిచేయాలని, అలాంటప్పుడే పేదలకు చెందాల్సిన అన్ని పథకాలు వారి దరి చేరతాయన్నారు. గిరిజన గ్రామాల్లో బిటి రోడ్లు, చెక్‌డ్యాంలు, విద్యుత్ స్తంభాలు, గిరిజన రైతులకు త్రిఫేస్ విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా సరఫరా అయ్యో మంచినీరు, ఆరోగ్య శాఖ ద్వారా పేద ప్రజలకు అందే వైద్యం తదితర విషయాల్లో ఎటువంటి లోటుపాట్లకు తావులేకుండా చూడాలన్నారు. పంచాయితీ రాజ్ ద్వారా చేపట్టిన బిటి రోడ్లను నియోజకవర్గ వ్యాప్తంగా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని, ఇంకా మొదలు పెట్టని పనులను ప్రారంభించాలన్నారు. భద్రాచలంలో డంపింగ్ యార్డు పూర్తయినందున సంబంధించిన మిషనరీ అమర్చి 15 రోజుల్లో అందుబాటులోనికి తేవాలన్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో ఐటిడిఏ ఇంజనీరింగ్ విభాగం ద్వారా చేపట్టిన పనులు పూర్తి చేయాలని, అటవి అనుమతుల అడ్డంకులుంటే జిల్లా కలెక్టర్, ఐటిడిఏ పిఓ ద్వారా పరిష్కరించుకోవాలన్నారు. భద్రాచలం, పర్ణశాలల ఆర్‌డబ్ల్యూఎస్ మిషన్ భగీరథ నీళ్లు సరిగా సరఫరా కావడం లేదని తమ దృష్టికి వచ్చిందని, వెంటనే సమస్య పరిష్కరించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులు జనవరి నాటికి పూర్తి చేసి రానున్న వేసవి కాలంలో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు ఇప్పటి నుండే తీసుకోవాలన్నారు. భద్రాచలం కేంద్రంగా నడిచే డయాల్సిస్ సెంటర్ రోగులకు వైద్య సేవలు అందించాలని, పనిభారం తగ్గించేందుకు చర్ల ప్రభుత్వాస్పత్రిలో కూడాడయాల్సిస్‌సెంటర్ ప్రారంభించాలన్నారు. రైతులు మరణిస్తే వారికి ప్రమాద బీమా సొమ్ములు ఆ కుటుంబానికి అందేలా చూడాలని చెప్పా రు. పత్తికొను గోళ్ల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుని రైతులకు మేలు జరిగేలా చూడాలన్నారు. ఎంపి పోరికబలరాం నాయక్, ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడారు. ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ, ఎస్‌పి రోహిత్ రాజ్, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మీ నారాయణ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిసిఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్, ఐటిడిఏ ఏపిఓ డేవిడ్ రాజ్, డిడి మణెమ్మ,ఇఇ తానాజీ, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



### త్వరలో రామాలయాభివృద్ధి

సీతారామచంద్రస్వామిని మంత్రి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ తాయారమ్మ, శ్రీ అభయాంబనేయ స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రామలయం దర్శనం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ రామాలయాభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. దీనిలో భాగంగా ఇప్పటికే మాఢవీధుల నిర్మాణానికి రూ.70 కోట్ల నిధులు విడుదలైనట్లు చెప్పారు. ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులం ఉన్నారమని, రామాలయంపై చిత్తశుద్ధి ఉంది కాబట్టే ఇందిరమ్మఇళ్లపథకాన్నిఇక్కడ్నుంచిప్రారంభించినట్లు చెప్పారు. భద్రాచలం,అశ్వారావుపేట ఎంఎల్‌ఏలు డా.తెల్లం వెంకటరావు, జారే ఆదినారాయణ, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్ రాజ్, నాయకులున్నారు.



## ప్రతీ కుటుంబానికి..స్మార్ట్ కార్డు

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్: అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శనివారం పాలేరు నియోజక వర్గం ఖమ్మం రూరల్ మండలంలో మంత్రి పర్యటించి ఎంజిఎన్ఆర్ ఈజిఎస్ నిధులతో చేపట్టిన పలు రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. తెల్దారుపల్లి గ్రామంలో రూ.30లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రోడ్లు, మద్దులపల్లి గ్రామంలో రూ. 45 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్లు, స్మశాన వాటిక పనులకు, గుర్రాలపాడు గ్రామంలో రూ. 70 లక్షలతో చేపట్టిన అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలలో కొన్ని అమలు చేశామని చేయాల్సినవి ఇంకొన్ని ఉన్నాయని తెలిపారు. ప్రతి కుటుంబానికి స్మార్ట్‌కార్డ్ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఇఆర్అండ్‌బి హేమలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, వ్యవసాయ శాఖ ఏడి సరిత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

### ఎడిఎ కొంగర వెంకటేశ్వరరావు




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్: ఆయిల్ పాం సాగు ద్వారా మిగిలిన పంటల కంటే అధిక లాభాలు పొందవచ్చునని ఖమ్మం డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం రఘునాథపాలెం మండల పరిధిలోని చింతగుర్తి గ్రామంలో ఆయిల్ పాం తోటలో ఆయిల్ పాం సాగు, విస్తరణ అంశంపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు ఆయిల్ పాం సాగు ద్వారా ఇతర పంటల కన్న ఎక్కువ ఆదాయం పొందవచ్చునని తెలిపారు. టన్ను ఆయిల్ పాం ధర రూ.19,144 ఉందని ఎకరానికి రూ. 80వేల ఆదాయం పొందవచ్చునని తెలిపారు. రైతులకు ఆయిల్ పాం సాగుపై అవగాహన కల్పించి ప్రోత్సహించాలని విస్తరణను పెంచాలని అధికారులకు సూచించారు. ఉద్యానవన అధికారి నగేష్ మాట్లాడుతూ రైతులు భూమి విస్తర్ణంతో సంబంధం లేకుండా రూ.173 సబ్సిడీతో మొక్కలు పొందవచ్చునని తెలిపారు. నాలుగేళ్ల వరకు తోట మెయింటినెన్స్ కొరకు ఎకరానికి రూ.4,200 సబ్సిడీ లభిస్తుందన్నారు. డ్రిప్ కొరకు ఎస్సి, ఎస్టి రైతులకు వంద శాతం, సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 80 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. ఈ రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు శిక్షణ కేంద్ర ఏడిఏ మిట్టపల్లి సతీష్, ఏవోలు అరుణ కుమారి, అరుణ జ్యోతి, ఇంటూరి భాస్కర్, అబ్బోరి శరత్‌బాబు, ఉమామహేశ్వరరెడ్డి, ఏఈవోలు, గోద్రెజ్ కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## డ్రాయింగ్‌లో 'స్మార్ట్‌కిడ్జ్' ప్రతిభ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్: ముంబాయికి చెందిన ఆర్గనైజేషన్ ఆఫ్ నేషనల్ ఆర్ట్ కాంపిటేషన్ నిర్వహించిన రంగోత్సవ్ సెలబ్రేషన్స్, హ్యాండ్ రైటింగ్, డ్రాయింగ్ పోటీలలో స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల చిన్నారులు ప్రతిభ చూపి మెడల్స్ సాధించినట్లు కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య శనివారం తెలిపారు. నేషనల్ లెవల్ ఆర్ట్ కాంపిటేషన్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి మెడల్స్ సాధించినట్లు ఆయన తెలిపారు. పాఠశాలకు చెందిన మచ్చా నిరూప అద్భుత ప్రతిభతో బొమ్మలు గీసి మెరిట్, ట్రోఫీ, మెడల్‌ను సాధించిందన్నారు. బట్టు యశ్విని సాయి హ్యాండ్ రైటింగ్ పోటీల్లో మెడల్ సాధించిందన్నారు. పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు ఆయన తెలిపారు. రంగోత్సవ్‌లో మెరిట్ మెడల్స్ సాధించినట్లు ఆయన తెలిపారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను కరస్పాండెంట్ కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం



ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:విద్యార్థులకునాణ్యమైన,పరిశుభ్రమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని మండల విద్యాశాఖాధికారి కెవి శైలజలక్ష్మి తెలిపారు. శనివారం ఎంఈవో శైలజలక్ష్మి ఖమ్మం నగరంలోని వేణుగోపాల్ నగర్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట గది, వంట పాత్రలు, పాఠశాల పరిసరాలు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. మధ్యాహ్న భోజన వర్కర్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థులను వివిధ అంశాలలో పరిశీలించి ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరు కావాలని తెలిపారు. పాఠశాల నిర్వహణ పట్ల ఎంఈవో సంతృప్తి వ్యక్తంచేశారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుడిపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కె. హైమావతి, సిఆర్‌పిలు డి. మానస, బాలకృష్ణ, మధ్యాహ్న భోజన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దరావత్ చంద్రుకు నివాళి



ప్రజాపక్షం/ఖమ్మం: ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకులు, ఎక్సైజ్ కానిస్టేబుల్ దరావత్ చంద్రుకు సిపిఐ నేతలు నివాళులర్పించారు. చంద్రు ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందారు. శనివారం చంద్రు చిత్ర పటానికి నివాళులర్పించారు. నడిమితండాలో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థి దశలో చంద్రు ఏఐఎస్ఎఫ్‌లో చురుకైన కార్యకర్తగా, నాయకునిగా పనిచేశారన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్‌కె జానిమియా, చంద్రు కుమారులు, కుటుంబ సభ్యులు ఉన్నారు.

## మహిళాశక్తి యూనిట్లకు సహకారం



ప్రజాపక్షం/ఖమ్మం:గ్రామాలలో ఇందిరా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్‌కు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి యూనిట్ల పురోగతిపై, ధాన్యం కొనుగోలు, ఉపాధి హామీ పనులపై సమీక్షించారు. అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు మండల స్థాయిలో రెగ్యులర్‌గా సమీక్షించుకోవాలని అనాసక్తితో పనిచేస్తే ఫలితాలు ఉండవని ఆమె తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ క్రింద మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో ఆగిపోయిన పనులకు సంబంధించి నివేదికలు తయారు చేసి సమర్పించాలన్నారు. మండలాలకు కేటాయించిన లక్ష్యాల మేరకు లబ్దిదారుల గుర్తింపు వంద శాతం పూర్తి కావాలని ఆమె తెలిపారు. ప్రతి మండలంలో మీ సేవ కేంద్రాల గ్రౌండింగ్ వచ్చే సమావేశం నాటికి పూర్తి కావాలన్నారు. అనంతరం మండలాల వారీగా ఐకెపి కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం, ట్యాబ్ ఎంట్రీ వివరాలు, రైతులకు చేసిన చెల్లింపులు, సన్న రకం ధాన్యం బోనస్ చెల్లింపు, ధాన్యం తరలింపుకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, అదనపు డిఆర్‌డివో నూరోద్దీన్, శిరీష, డిపిఎంలు, ఏపిఎంలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వసతి గృహాలలో తనిఖీలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి: ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారి కె.రవిబాబు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు ప్రభుత్వ హస్టల్స్, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను ఆయన తనిఖీలు చేశారు. తొలుత సింగారెడ్డి పాలెం గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. వంట గదులు, భోజనశాలలు, పారిశుద్ధంను పరిశీలించారు. భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. త్రాగునీరు సరఫరా ఎలా ఉంది. ఏమైనా అసౌకర్యంగా ఉందా అని అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్, ఆధ్యాపకులును, సిబ్బందిని పలు అంశాల పై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాజేశ్వరపురం, చెరువుమాధారం, నేలకొండపల్లి లోని పలు వసతి గృహాలను పరిశీలించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ యం.పద్మావతి, వసతి గృహాల సంక్షేమాధికారులు, ఇంచార్జీ ఏఎస్ డబ్ల్యు ఓ రవూఫ్, బాలకృష్ణ, ఓదెలు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు అండగా.. ఎర్రజెండా

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య



ప్రజాపక్షం/మణుగూరు: పేద ప్రజలకు అండగా ఎర్రజెండా నిలుస్తుందని, దేశంలో పేదరికం ఉన్నంతవరకు ఎర్రజెండా వారి హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి. అయోధ్య అన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో సిపిఐ గ్రామ శాఖ సమావేశం లక్ష్మ ణ్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా బి అయోధ్య మాట్లాడుతూ కమలాపురం అద్వానంగా ఉన్నటువంటి ఈ గ్రామం కనీసం నడవడానికి కాలిబాటన కూడా లేనటువంటి ఈ గ్రామానికి కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో రోడ్లు, విద్యుత్తు స్కూల్స్ ఇలా, గ్రామ కల్వర్టులు అభివృద్ధి నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించిందని వారు గుర్తు చేశారు. పెద్ద వాగొస్తే కోడిపుంజుల వాగు దగ్గర ఉప్పొంగి ప్రవహించేదని కాలిబాటన లేక ఆఫీసులలో రాత్రివేళ ఉన్నటువంటి సందర్భాలు అనేకం అని వారు గుర్తు చేశారు. కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని దానిని కాపాడుకోవాల్సిన బాధ్యత మీ అందరి పైన ఉందని, శతజయంతి ఉత్సవాలు గ్రామ గ్రామాననిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి, దుర్గ్యాల సుధాకర్, మండల కార్యవర్గ సభ్యులు కనితి సత్యనారాయణ, మాటూరి వరలక్ష్మి , నరసింహ, లక్ష్మ ణ్ పాల్గొన్నారు.అనంతరం 11 మంది సభ్యులతో నూతన కమిటీ ఎన్నిక జరిగింది.

## ఈ డ్యాన్సుల్లో ఆంతర్యమేమిటో?

### సోషల్ మీడియాలో విస్తృత చర్చ

ప్రజాపక్షం/ఖమ్మం:సంతోషం కలిగినప్పుడు సంబరంలో చిందేస్తాం. ప్రత్యర్థిపై విజయం సాధించడం ఒక రకంగా సంబురమే. ఏదో ఓ మార్గంలోశత్రువునుహతమారిస్తేసంబురమా? ప్రజల కోసం పనిచేస్తున్న పది మందిని ఎన్‌కౌంటర్ పేరిట హతమార్చిన పోలీసులు చిందేస్తే విస్తృత చర్చ సాగుతుంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కుంట సమీపంలో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల జాడ తెలుసుకున్న పోలీస్ బలగాలు వలపన్ని పదిమంది మావోయిస్టులను శుక్రవారం హతమార్చారు. పది మంది మావోయిస్టులు మరణించారని తెలియగానే పోలీసులు చేసిన డ్యాన్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.దండకారుణ్యంలో ఎన్‌కౌంటర్ల పేర జరుగుతున్న నరమేధంపై ఇప్పటికే ప్రజాస్వామిక వాదులు, పౌర సంఘాలు, వామపక్షాలు తీవ్ర అభ్యంతరం తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. దండకారుణ్యంలోని ప్రకృతిసంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ మారణహోమంకుపాల్పడుతుందన్నప్రచారం జోరుగా సాగుతుంది. సంఘ వ్యతిరేక శక్తుల పేర వామపక్షాల తీవ్రవాదాన్ని అణిచివేసేందుకు వేల మంది పోలీస్ బలగాలతో రకరకాల ఆపరేషన్స్‌ను కొనసాగిస్తుంది. కేంద్రం కనీస మానవత్వాన్నిమరిచి హతమారుస్తున్నారన్నఆరోపణల నేపథ్యంలో ఈ చిందులు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాయి. మోడీ సర్కార్ కార్పొరేట్ శక్తుల కోసం దండకారుణ్యాన్ని జల్లెడ పడుతుందని, పోలీస్ ఆపరేషన్స్ మొత్తం అమిత్‌షా కనుసన్నల్లోనే జరుగుతున్నాయన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇదిలా ఉండగా మావోయిస్టులు క్రమేపి దండకారుణ్యంపై పట్టు కోల్పోతున్నారు. రిక్రూట్‌మెంట్ లేకపోవడం, గతంలో మాదిరి స్థానికుల సహకారం లేకపోవడం, వందల సంఖ్యలో ఏర్పాటైన బేస్ క్యాంపులు మావోయిస్టులు బలహీనపడడానికి కారణమవుతుంది. గిరిజనులను నయానో భయానో తమవైపుకు తిప్పుకోవడంలో పోలీస్ బలగాలు సఫలీకృతమవుతున్నాయి.గడిచిన ఐదారు నెలలుగా 200 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో హతమయ్యారు. చాలా మంది లొంగిపోతున్నారు. సాయుధ దళాలలో ఆత్మవిశ్వాసం పెంపొందించలేకపోవడం, యువతను తమవైపుకు తిప్పుకోలేకపోవడం మావోయిస్టులు బలహీనపడడానికి కారణమవుతుంది. వ్యూహాలను మార్చుకుంటూ యువతను తమవైపుకు తిప్పుకోలేని ప్రస్తుత స్థితి కొనసాగితే దండకారుణ్యంలో మావోయిస్టులది గత చరిత్రే.

## నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దు చేయాల్సిందే

ప్రజాపక్షం/కారేపల్లి:సంయుక్త కిసాన్‌మోర్చా ఎస్‌కేఎం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా కారేపల్లి మండలం పేరుపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈకార్యక్రమంలో అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వై ప్రకాష్ పాల్గొని మాట్లాదడుతూ బిజెపి మోడీ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను కార్మికుల నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ లక్షలాది మంది రైతులు కార్మికులతో 13 నెలల పాటు సాగిన వీరోచిత ఢిల్లీ రైతాంగ ఉద్యమంలో 800 మంది అమరులు కావడం జరిగిందన్నారు. ఈ ఉద్యమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలు క్షమాపణలు చెప్పి రైతులకు కార్మికులకు నష్టదాయకమైన చట్టాలను రద్దు చేస్తానని ఎంఎస్‌పి పంటల గిట్టుబాటు ధర చట్టం అమలు చేస్తానని, పార్లమెంట్ సాక్షిగా లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చిన వాటిని రద్దు చేయకుండా దేశంలో ఉన్న అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి తిరిగి అట్టి చట్టాలను మరల దొడ్డి దారిన ప్రవేశనెట్టి అమలుకు పూనుకున్నాడని, ఎన్నో త్యాగాలు సాధించుకున్న రైతు కార్మిక చట్టాలను రద్దు చేస్తూ దేశంలో ఉన్న అన్ని రకాల ప్రభుత్వ పరిశ్రమలను భూములను బహుళ జాతి కంపెనీలకు బడ పారిశ్రామిక వేత్తలకు తాకట్టు పెట్టినాడని ఆరోపించారు. ఎస్‌కేఎం ఆధ్వర్యంలో ఈనెల 26న ఖమ్మం కలెక్టరేట్ ముందు జరిగే నిరసర ధర్నా కార్యక్రమంలో అన్ని వర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ మండల నాయకులు అలెం గురవయ్య, చంద్రయ్య, బైరుమల లక్ష్మ య్య, వైజానకి, సుగుణ, కోటక్క, మంగమ్మ, నాగేశ్వరరావు ఉన్నారు.

## 'నాక్' ఆధ్వర్యంలో సినిమా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్సులు

ప్రజాపక్షం/భద్రాచలం : తెలంగాణ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నాక్)ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సినిమా టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా నాక్ నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మూడునెలల కాల వ్యవధితో ఉండే ఈ కోర్సుల్లో చేరేందుకు పదవ తరగతి పాస్ అయిన అందరూ అర్హులే. సినిమా టోపోగ్రఫీ మాస్టారి, సౌండ్ రికార్డింగ్ మాస్టారి, విడియో ఎడిటింగ్, డిజిటల్ డిజైన్, సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, ప్రొడక్షన్ మేనేజ్మెంట్, యాంకరింగ్, డబ్బింగ్ వాయిస్ ఓవర్, మ్యూజిక్ ప్రొడక్షన్, ప్రొఫెషనల్ గానం, అకౌస్టింక్ డిజైనింగ్ విభాగాల్లో శిక్షణఇవ్వనున్నారు. వివరాల కోసం సంప్రదించాలని సూచించారు.

## ఘనంగా సబ్ జూనియర్ల ఛాంపియన్ పోటీలు



ప్రజాపక్షం/పాల్వంచ:పాల్వంచ పట్టణంలోని శ్రీనివాస్ కాలనీ మినీ స్టేడియం నందు అథ్లెటిక్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అండర్ 8 బాల, బాలికలకు విభాగంలో 50 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెంలు, స్టాండింగ్ బోర్డు జంప్‌తో పాటుగా, అండర్ 10 బాల, బాలికల విభాగంలో 100 మీటర్లు, 300 మీటర్ల పరుగు పందెంలు, లాంగ్ జంప్ పోటీలు, అండర్ 12 బాల, బాలికల విభాగంలో 100మీటర్లు, 400 మీటర్లు, 600మీటర్లు పరుగు పందెంలతో పాటుగా లాంగ్ జంప్, షాట్ పుట్ క్రీడలను నిర్వహించారు. కొత్వాల మాట్లాడారు. అనంతరం జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులుగా నియమితులైన డాక్టర్ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డిని సన్మానించారు. అండర్ 8, 10, 12 విభాగాల, పోటీ విజేతలకు రాష్ట్ర మార్కె ఫెడ్ డైరెక్టర్, డిసిఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాస్, డివైఅండ్ ఎస్ఓ పరంధామ రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, మున్సిపల్ కమిషన్ సుజాతల చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఒలంపిక్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై వెంకటేశ్వర్లు, నాగేంద్ర తివింద్రి, సెక్రెటరీ ఆర్ రాంప్రసాద్, ఛైర్మన్ కే మహేందర్, పాల్వంచ బ్రాండ్ అంబాసిడర్ సింధు తపస్వి, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, పులి సత్యనారాయణ, కందుల రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ పరీక్షలు సద్వినియోగం

### ఐఎల్ ఆధ్వర్యంలో ఎఐబిఇ పరీక్ష

### 200 మంది న్యాయవాదులు హాజరు




ప్రజాపక్షం/ఖమ్మంలీగల్ : మోడల్ పరీక్షలను న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని ఐఎఎల్ నాయకులు, సీనియర్ న్యాయవాది పెమ్మసాని పట్టాభి కోరారు. మారుతున్న చట్టాలను అధ్యయనం చేయడం ద్వారా కక్షిదారులకు న్యాయం చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో శనివారం ఆలిండియా బార్ ఎగ్జామ్ (ఎఐబిఈ) మోడల్ ప్రవేశ పరీక్షను స్థానిక మానేరు లా కళాశాలలో నిర్వహించారు. మోడల్ ప్రవేశ పరీక్ష ప్రారంభ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో పట్టాభి మాట్లాడుతూ న్యాయవాదులు నిత్యం తమ నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. ఐఎఎల్ నిర్వహించిన మోడల్ ప్రవేశ పరీక్ష ఎంతో దోహద పడుతుందని ఈ పరీక్ష నిర్వహణ ఎంతో అభినందనీయమని ఆయన అన్నారు. ఈనెల 30, డిసెంబర్ ఒకటిన హన్మకొండలో ఐఎఎల్ రాష్ట్ర మహాసభలు జరుగుతున్నాయని హరిత కాకతీయ హోటల్‌లో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు. 200 మందికి పైగా న్యాయవాదులు పరీక్షలకు హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఐఎఎల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరి రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. శ్రీనివాసరావు, ఐఎఎల్ నాయకులు పారుపల్లి అమర్‌చందర్, బాగం మాధవ రావు, షేక్ నస్రీన్, మేకల నవీన్‌కుమార్, జివి లక్ష్మి నారాయణ, సతీష్, శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, దామోదర్, అమర్‌నాథ్ పాల్గొన్నారు. మోడల్ పరీక్షలను సందర్శించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, న్యాయవాదులు తొండపు వెంకటేశ్వరరావు, ఐ. వెంకటేశ్వర్లు, బిచ్చాల తిరుమలరావు, మామిడి హన్మంతరావు, గద్దల దిలీప్ , దిలీప్ చౌదరి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఇన్విజిలేటర్లుగా పురుషోత్తం, రమణ, జి. రామారావు, శరత్‌బాబు, మన్మథరావు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతులకు నిధులు

ప్రజాపక్షం/నేలకొండపల్లి: జిల్లాలో విద్యుత్ సబ్ స్టేషన్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేసినట్లు విద్యుత్ శాఖ డీఈఈ ( కన్‌స్ట్రక్షన్ ) కె.హీరాలాల్ పేర్కొన్నారు. మండలంలోని బుద్దారం, నేలకొండపల్లి, ముజ్జుగూడెం, చెరువుమాధారం, రాజేశ్వరపురం విద్యుత్ సబ్ స్టేషన్లను శనివారం సందర్శించారు. సబ్‌స్టేషన్‌లకు అవసరమైన పనులను గుర్తించారు. మండల కేంద్రంలోని ఎఇ కార్యాలయంలోవిలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మొత్తం 43 విద్యుత్ సబ్ స్టేషన్‌లకు ఒక్కోక్క సబేస్టేషన్‌కు మరమ్మతుల కోసందాదాపు రూ.12 లక్షల చొప్పున రూ.5.16 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లా లో 38 విద్యుత్ సబ్ స్టేషన్లలో రెప్ప పాటు కూడ విద్యుత్‌కు అంతరాయం లేకుండా ఉండేలా ఇంటర్ లింకింగ్ లైన్స్‌లను కలపనున్నట్లు తెలిపారు. దీని వలన నిరంతరం విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు. వేసవి కాలం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# మహానగరి

## శివరాంనగర్ కాలనీలో మెడికల్ క్యాంపు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 32వ వార్డులోని శివరాంనాగర్ కాలనిలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేసిన ఎంఐఎం పట్టణఅధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్, ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంఐఎం పార్టీ అధినేత హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసి అదేశాల మేరకు నిర్వహించిన మెడికల్ క్యాంప్‌ను 200మంది సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమని, రాబోయే రోజుల్లో మరిన్ని క్యాంపులు నిర్వహిస్తామని అన్నారు. వచ్చేవారంలో శివరెడ్డిపేట్ లో నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ షరీఫ్, మహమ్మద్ ఇమ్రన్ షేక్ జలీల్, ఇస్మాయిల్ ఫిరోజ్ లు పాల్గోన్నారు.

## సమగ్ర కుల గణనకు సహకరించండి



**ప్రజాపక్షం/తాండూరుః**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చేపట్టిన సమగ్ర కులగణన సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంఎల్‌ఏ సోదరుడు తాండూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకు లు బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని 13వ వార్డులో బిఎస్ఆర్ తన ఇంట్లో సమగ్ర సర్వే బృందానికి వివరాల ను వెల్లడించారు.అధి కారులు అడిగిన ప్రశ్నలకు సమధానాలు ఇచ్చి సహకరించారు.

# పర్యాటక కేంద్రంగా అనంతగిరి అటవీ ప్రాంతం

### స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధిః** వికారాబాద్ జిల్లా కేంద్రలోని అనంతగిరి అటవీ ప్రాంతంలో అర్బన్ పార్కు నిర్మాణానికి శుంకుస్థాపన ,నూతనంగా నిర్మించిన ఫరెస్ట్ సెంక్షన్ ఆఫీసర్ క్వార్టర్ ను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ,ఆటవీ శాఖ జోనల్ చీప్ కన్జర్వేటర్ ప్రియంక వర్గీష్ లతో కలిపి స్పీకర్ ప్రసాద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ అనంతగిరి అటవీ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు 300 కోట్ల తో ప్రణాళికలు రూపోందించడం జరుగుతుందన్నారు. దీనిలో భగంగా 200 ఎకరాల్లో అనంతగిరి అర్బన్ పార్కును ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. పర్యాటక ప్రాంతాన్ని ఏర్పాటు చేయడంతో నిరుద్యోగ యువతతో పాటు పరసర ప్రాంతాల ప్రజలకు ఉపాధి అవకాశాలు కలుగుతాయని అన్నారు.ఉపాది హామీ పథకం కింద నీటి నిల్వాలు ఉండే విధంగా చెక్ డ్యాముల నిర్మాణాలు ,మరమ్మత్తుల పనులు చేపట్టలని అధికారులను అదేశించారు. పర్యాటక ప్రాంత అభివృద్ధితో పాటు వికారాబాద్ పరిసర ప్రాంతాలు ఎంతగానో అభివృద్ధి చెందితాయ ని అన్నారు. మూసి కాలుష్యానికి గురికాకుండా ఇక్కడి నుండి తగు జాగ్రత్తలు తీసుకుంటున్నాట్లు అయన తెలిపారు. ఈకార్యక్రమంలో ట్రైని కలెక్టర్ ఉమా హరతి, జిల్లా అడవీ శాఖ అధికారి జ్ఞనేశ్వర్,కిషన్‌నాయక్ , ఆర్‌డి ఓ వాసుచంద్ర తహసీల్దార్ లక్ష్మి నారయణ తదితరులు పాల్గోన్నా రు.

**ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు కుటుంబ సర్వే :** వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎన్యుమారేటర్ కు పూర్తి సమాచారాన్ని ఇచ్చి ఫారం పై సంతకాలు చేశారు.ఈ సందర్భం గా స్పీకర్ మాట్లాడుతూ, ప్రభు త్వం చేపడుతున్న సామాజకి, ఆర్థిక, విద్య , ఉపాధి రాజకీయ ,కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలు మంచిగా సహకరిస్తున్నారన్నారు. ఇప్పటికే జిల్లాలో 86శాతం కుటుంబ సర్వే పూర్తయిందని అన్నారు. కుటుంబ వివరలను సేకరించడం వల్ల ప్రజలకు మరిన్ని సేవలందించేందుకు దోహదపడుతుందని అయాన అన్నారు. మండలల్లో డాటా ఎంట్రీ ని చేపట్టడం జరిగింది అన్నారు. మున్సిపాలిటిలో డాటా ఎంట్రీ ని చేసేందుకు 176 కంప్యూటర్లను అందించడం .జరిగింది అన్నారు. ఈ సర్వేలో జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ , ట్రేనింగ్ కలెక్టర్ ఉమాహరతి, పాటు అధికారులు పాల్గోన్నారు.



## వికలాంగులకు దుప్పట్ల పంపిణీ

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా మల్కాజిగిరి సత్య సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం వికలాంగులకు దుప్పట్లు, బ్లాంకెట్లను పంపిణీ చేసారు. మల్కాజిగిరి జిల్లా వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎన్ వినయ్ ఆధ్వర్యంలో మల్కాజిగిరి జిహెచ్ఎంసి సర్కిల్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో ఎవి దుర్గాప్రసాద్, కనకదుర్గ, భవాని తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఏటా సాయిబాబా జయంతి సందర్భంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు.

## కార్పొరేటర్ సునీత ఆర్థిక సాయం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పక్షవాతంతో చికిత్స పొందుతున్న పాత్రికేయుడు జాన్‌కు గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునీత రూ.15వేలు వైద్య చికిత్సల నిమిత్తం ఆర్థిక సాయంగా శనివారం అందించారు. బిఆర్ఎస్ నేతలు నర్సింగరావు, శ్రీనివాసరావులతో కల్సి కార్పొరేటర్ చికిత్స పొందుతున్న నిమ్స్ ఆస్పత్రికి వెళ్లి జాన్‌ను పరామర్శించారు. మెరుగైన చికిత్సలందించాలని వైద్యులను ఆమె కోరారు.

## చిలుకానగర్ డివిజన్ మైనారిటీ కబరస్థాన్‌లో అన్ని వసతులు ఏర్పాటు




**ప్రజాపక్షం/ఉప్పల్ః** ఉన్న చిల్కానగర్ డివిజన్ మైనార్టీ కబరస్థాన్‌లో బండ రాళ్ల తొలగింపుకు 18 లక్షల నిధులు కేటాయింపజేసిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి మరియు కార్పొరేటర్ గీతా ప్రవీణ్‌కి శాలువాతో సత్కరించి ధన్యవాదాలు తెలిపిన చిల్కానగర్ కబరస్థాన్ కమిటీ సభ్యులు చిల్కానగర్ డివిజన్ మైనార్టీ కబ్రిస్తాన్ కమిటీ ప్రతినిధులు గ్రేవియార్డులో సమాధులు పెట్టే ప్రాంతంలో పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డుగా ఉన్నాయని కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ని బండరాళ్ల తొలగింపుకు నిధులు కేటాయించాల్సిందిగా కోరడం జరిగింది. వెంటనే కార్పొరేటర్ గీతా ప్రవీణ్ ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి సహకారంతో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటీల్ ద్వారా బండరాళ్లు తొలగింపుకు సుమారు రూ.18లక్షలు శాంక్షన్ చేయించారు.అదేవిధంగా వచ్చే వారంలో కాంట్రాక్టర్ ద్వారా బండరాళ్లు తొలగింపు పనులను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపి కంటెస్టెడ్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి , టిఆర్ఎస్ పార్టీ మైనారిటీ రాష్ట్ర నాయకులు బదిరుద్దీన్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎద్దుల కొండల్ రెడ్డి, నర్సింగ్ రావు, కోకొండ జగన్, కబరస్థాన్ కమిటీ సభ్యులు అధ్యక్షులు అబ్బు బాయ్, వారి కమిటీ సభ్యులు మజీద్ కమిటీ అధ్యక్షుడు హనీఫ్, షఫీ,హనీఫ్ అల్తాఫ్, జలీల్, బాబాలు పాల్గొన్నారు.

## తాండూరుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరు

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంఎల్ఏ ధన్యవాదాలు




**ప్రజాపక్షం/తాండూరుః**తాండూరు నియోజకవర్గానికి ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంట్రిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూలును ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జిఒ జారీ చేశారు. అయితే మొదటి విడత పలు జిల్లాలో ఇదివరకే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. కాగా రెండవ విడతగా ప్రభుత్వం తాండూరు నియోజకవర్గానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్ మంజూరు చేస్తున్నట్లు విడుదల చేసిన ఉత్తర్వులో స్పష్టం చేశారు. తాండూరుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షి యల్ స్కూల్‌ను మంజూరు చేయడం పట్ల ఎంఎల్ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాధాలు తెలియజేశారు.



## ప్రతి గడపకూ ప్రభుత్వ పథకాలు

### మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు గడప గడపకు చేరేలా విస్తృత కార్యక్రమాలు చేయాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం హెచ్ఏఎల్ కాలనీలోని సిటీ ప్యాలెస్ గార్డెన్‌లో శనివారం ప్రజాపాలన విజయోత్సవ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా స్థానిక మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా గడిచిన సంవత్సర కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రతి గడపకు ప్రభుత్వ పథకాలు చేరేలా విస్తృతంగా కార్యక్రమాలను చేపట్టాలని అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నిరుపేద ప్రజలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేవిధంగా కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి, రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, నాయకులు బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, కూన శ్రీనివాస్ గౌడ్, లక్ష్మి , లక్ష్మారెడ్డి, జయరాం, శ్రావన్ కుమార్, ఐలయ్య, పాలకృష్ణ, రంగారావు, మోతె శ్రీనివాస్, కృష్ణగౌడ్, సయ్యద్ రషీద్, జేమ్స్, జహంగీన్, బల రాం, శ్రీనివాస్ రంగనాథ్, గుంజ శ్రీనివాస్, శ్రీధర్ రెడ్డి, రాధాకృష్ణ, శివకుమార్ పాల్గొన్నారు.

## వ్యాధి నిర్ధారణ పరీక్షలతో ఆరోగ్య సంరక్షణ : కార్పొరేటర్ రాజ్యలక్ష్మి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ప్రతి ఒక్కరూ కళ్లు, దంతాలు, మధుమేహం, బిపి, కేన్సర్ సంబంధిత వైద్య పరీక్షలు చేయించుకోవటం ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వినాయకనగర్ కార్పొరేటర్ రాజ్య లక్ష్మి అన్నారు. డివిజన్‌లోని శ్రీసాయినగర్ ప్రాంతంలో శనివారం కాప్రా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ప్రభుత్వపరంగా ప్రతి ఒక్కరికీ సమీపంలో ఉండే బస్తీ దవాఖానాలలో సైతం ప్రతి రోజు వ్యాధి నిర్ధారణ పరీక్షలు అందుబాటులో ఉన్నాయని, ఆరోగ్య పరంగా ఏ మాత్రం అనుమానాలు కలిగినా వెంటనే వైద్యులను సంప్రదించాలని ఆమె సూచించారు. సామాజికా సేవా దృక్పథంతో లయన్స్ క్లబ్‌లాంటి సంస్థలు చేస్తున్న సేవలను కార్పొరేటర్ కొనియాడారు. బిజెపి నేత జగదీష్‌చారి సమన్వయంతో కాప్రా లయన్స్ డిస్ట్రిక్ట్ 320ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.కృష్ణారెడ్డి పాల్గొన్న ఈ వైద్య శిబిరంలో కమలానగర్ ప్లానెట్ ఆప్టికల్స్ డా.అనీల్ బృందం ఆధ్వర్యంలో నేత్ర పరీక్షలు, దమ్మాయిగూడ పద్మ సాయి డెంటల్ ఆస్పత్రికి చెందిన డా.దినేష్ బృందం ఆధ్వర్యంలో దంత పరీక్షలు సియాన్ కేన్సర క్లినిక్ వైద్యులు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు, విజయా దయాగ్నస్టిక్స్ ఆధ్వర్యంలో మధుమేహం, బిపి పరీక్షలు నిర్వహించారు. 119 మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం వీరిలో అవసరమైన 16 మందికి కాటరాక్ట్ శస్త్ర చికిత్సలు జరిపిస్తున్నారు. దీంతో పాటు 100మందికి పైగా మహిళలకు ఈ శిబిరంలో ఆధునికమైన థర్మోగ్రాఫ్ విధానంలో బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరిగాయని లయన్స్ క్లబ్ కార్యదర్శి చనమోలు వరప్రసాద్, మనోజ్ కుమార్, సభ్యులు సురేష్, సునీల్, డిస్ట్రిక్ట్ సెక్రటరీ శేఖరరెడ్డిలు తెలిపారు.

## ఆపద్బాంధవుడు సిఎం రేవంత్ రెడ్డి

### సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన పామేనా భీమ్ భరత్




**ప్రజాపక్షం/నవాబుపేట్ః** పేదలు అనారోగ్యంతో, ఆసుపత్రిలో చేరి ఆర్థికంగా నష్టపోవద్దని ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయాన్ని అందజేయడం అభినందనీయమని చేవెళ్ల అసెంబ్లీ ఇన్చార్జి పామేన భీమ్ భరత్ అన్నారు. శనివారం నవాబుపేట మండలంలోని ఎత్రాజ్ పల్లి, నవాబుపేట, మాదారం, కడిచర్ల, గేట్ వనంపల్లి గ్రామాలకు చెందిన వారికి సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించేందుకు కృషి చేసిందన్నారు. త్వరలో ఇందిరమ్మ గృహాలను రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన నిరుపేదలందరికీ మంజూరు అయ్యేలా చూస్తామన్నారు. డిసెంబర్ నెల చివరి నాటికి రైతు రుణమాఫీ, రైతు భరోసా నిధులను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మీనపల్లి శివప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ కొండల్ యాదవ్, యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ గణపురం ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నా రు.

## ఓటరు నమోదు సద్వినియోగం



**ప్రజాపక్షం/నవాబుపేట్ః** ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని నవాబ్‌పేట్ తహసీల్దార్ జయరాం అన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా నవాబ్‌పేట్ మండల తహసీల్దార్ జయరాం ఓ ప్రకటనలో మాట్లాడుతూ(స్వీప్)ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా జనవరి 1వ 2025 నాటికి 18 సం.లు నిండే యువత, కొత్త ఓటర్‌గా నమోదు చేసుకునేందుకు అర్హులని చెప్పారు. నూతన ఓటరుగా నమోదుకు ఫామ్ 6, అక్టోబర్ 29న విడుదల చేసిన ఓటర్ ముసాయిదాలో అభ్యంతరాల కోసం ఫారం 7, సవరణలకు ఫారం 8 దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నవంబర్ 28 వరకు దరఖాస్తూ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

### మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి హెచ్చరిక



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో భోజనశాలల్లో శుభ్రమైన వాతావరణంలో శుచికరమైన వంటకాలను అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కీసర మండలంలోని బిసి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ఆహార పదార్థాలను నిలు వ చేసిన ప్రాంతాలను చూసి పరిశుభ్రమై న ప్రదేశంలోనే భద్రపరుస్తూ ఎప్పటికప్పుడు క్రిమి కీటకాలు రాకుండా చూస్తుండాలని, తాజా కూరగాయలనే వంటల్లో వినియోగించాలని, హాస్టల్ వార్డెన్లు వంటలు పూర్తయ్యాక వాటిని ముందుగా తిని చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని తెలిపారు. ప్రతిరోజు వంటకాలు ఎలా ఉంటున్నాయన్న విషయాలను విద్యార్థులను అడిగి తెల్సుకొని, విద్యార్థులతో కల్సి భోజనం చేసా రు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాల్సిన బాధ్యత వార్డెన్లపై ఉందని, ఈ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం కనపరచినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.

## ఫోన్‌కాల్స్‌తో భయపెడుతూ సైబర్ నేరాలు...

### అప్రమత్తంగా ఉండాలంటూ నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్

**ప్రజాపక్షం /మల్కాజిగిరి :** డ్రగ్స్ పేరిట కేసు నమోదైందంటూ పోలీసుల పేరిట ఫోన్ చేసి భయానికి గురిచేయటం ద్వారా సైబర్ నేరాలకు పాల్పడుతూ కేసులనుండి తప్పిస్తామని నమ్మించి లక్షల రూపాయలు లాగి సొమ్ము చేసుకొంటున్న ఉదంతాలు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెరిగిపోతున్నాయి. గుర్తు తెలియని ఇలాంటి ఫోన్ కాల్స్ చేస్తున్న వారిని నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తమ సాయం పొందాలని తరచు పోలీసు వర్గాలు చెబుతున్నప్పటికీ ఏదో ఓ ప్రాంతంలో ఏదో ఒక రూపంలో సైబర్ నేరగాళ్ల మాయలోపడి మోసపోతున్న ఉదంతాలు చోటు చేసుకొంటూనే ఉన్నాయి. సామాన్య జనాల నుండి మొదలెడితే ఉన్నత వర్గాల వరకు సెల్‌ఫోన్ వాడకందార్లు పెరిగిపోతున్న విషయాన్ని ఆసరాగా తీసుకొని పోలీసు కేసులనో, బ్యాంకు ఆధార్ లింక్, బ్యాంకు ఖాతాలను అప్‌గ్రేడ్ చేసుకొమ్మనో, ప్రభుత్వ పథకాల లబ్ది కోసమనో, యూట్యూబ్ వీడియోలు, వ్యాపా ర ప్రకటనలకు లైకులు పంపాలనో, ఎలాంటి షూరిటీ లేకుండా పెద్ద మొత్తాల్లో రుణాలిప్పిస్తామనో, తాము పంపే లింక్‌పై క్లిక్ చేస్తే డబ్బులు వస్తాయన్న ఆశలు చూపడం ఇలా ఏదో ఒకటి చెప్పి తీయని మాటలతో నమ్మించి మోసపూరితం గా వ్యక్తిగత సమాచారాన్ని సేకరించటం ద్వారా తెలియకుండానే బ్యాంకు ఖాతాల నుండి సొమ్ము కాజేయటం సైబర్ నేరగాళ్లకు పరిపాటిగా మారింది. ఇలాంటి సైబర్ నేరస్తుల బారి న పడకుండా అప్రమత్తం చేసేందుకుగాను



రాచకొండ పోలీ స్ కమిషనర్ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు నేరేడ్‌మెట్ పోలీసులు పలుకాలనీలు, విద్యా సంస్థల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నేరేడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ నకిలీ పోలీసుల ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ వినియోగిస్తున్నారనో, మీ కుమారుడో, కుమార్తో స్నేహితులతో కల్సి డ్రగ్స్ విక్రయిస్తున్నారన్న సమాచారం తమ వద్ద ఉందని ముంబయి, ఢిల్లీ సిబిఐ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైందంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా మాట్లాడి భయపెట్టించి, ఆ తర్వాత కేసు నుండి బయటపడాలంటే ముందుగా చిన్న మొత్తంలో తాము చెప్పే బ్యాంకు ఖాతాలకు గానీ డిజిటల్ ఖాతాలకు కానీ కొంత సొమ్ము పంపాలని చెబుతుంటారన్నారు. దీనికి భయపడి కొంత డబ్బు పంపగానే వారి భయాన్ని ఆసరాగా తీసుకొని దశల వారీగా పెద్ద మొత్తాల్లో డిమాండ్ చేసి చివరికి లక్షల రూపాయలు వసూళ్లకు పాల్పడుతుంటారన్నారు. ఇదే తరహాలో ముందుగా యువతులను ఎరవేసి తీయని మాటలతో మభ్యపెట్టి నగ్నవీడియోల పేరిట వీడియో రికార్డింగ్ చేయటం ద్వారా సైబర్ నేరస్తులు కాల్స్‌చేస్తూ భయపెట్టి లక్షల రూపాయలు దోచుకొంటున్న తరహా నేరా లు మరో రకమన్నారు. ఎవరిపై అయినా కేసులు, ఆరోపణ లు వచ్చినా, కేసులు నమోదైనా స్థానిక పోలీసు లు నేరుగానే పిలుస్తారే తప్ప ముంబయిలోనో, ఢిల్లీలాంటి మరో నగరంలోనో కేసు నమోదైందంటూ ఫోన్‌చేసి పిలువటం జరుగదని, ఇలా ఎవరైనా ఫోన్‌లో బెదిరిస్తూ ఫోన్‌చేస్తే సైబర్ నేరస్తులే అని భావించి వారికి ఏ మాత్రం భయపడకుండా సమీపంలోని పోలీసులను నేరుగా సంప్రదించి ఫిర్యాదు చేయాలని ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ సూచించారు. సైబర్‌నేరాలకుగాను ప్రత్యేకంగా అందుబాటులో ఉన్న 1930 కి కానీ పోలీస్ కంట్రోల్ రూం100కు కానీ ఫోన్‌చేసి సమాచారమివ్వాలని కోరారు.

## మహిళ దారుణ హత్య

**ప్రజాపక్షం/దుండిగల్ః**ఆభరణాలకోసం ఆశపడిన ఓ మహిళ పథకం ప్రకారం మరో మహిళకు కల్లు తాపించి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి అతి దారుణంగా కర్రతో కొట్టి హత్యచేసి పరారయింది. ఈ కేసును ఛేదించిన దుండిగల్ పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. ఈ వివరాలను శనివారం దుండిగల్ పోలీస్ స్టేషన్లో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేడ్చల్ ఏసిపి శ్రీనివాస్ రెడ్డితో కలిసి నిందితురాలి వివరాలను వెల్లడించారు. గత నెల 14వ తేదీన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బహదూర్ పల్లి కాకతీయ లేఔట్ లోని నిర్మానుష్య ప్రదేశంలో గుర్తు తెలియని మహిళ శవం పడి ఉందని స్థానికులు డయల్ 100 ద్వారా దుండిగల్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతురాలి ఒంటిపై గాయాలు ఉండడంతో అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకొని ఆమె ఆచూకీ కోసం దర్యాప్తు ముమ్మరం చేశారు. దర్యాప్తు చేపట్టగా మృతురాలు ఆర్టీసీ బస్సు దిగి ఘటన స్థలానికి వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. బస్సులో మహిళ తీసుకున్న జీరో టికెట్టు ఆధారంగా ఆమె ఆధార్ కార్డు ఆధారంతో ఆమె ఎక్కడ బస్సు ఎక్కింది అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. పోలీసులు అక్కడ బస్సు ఎక్కే టైంలో సిసి కెమెరాలు పరిశీలించగా మృతురాలితో పాటు మరో మహిళ బస్సు ఎక్కుతున్నట్లు, దిగిన చోట కూడా ఇద్దరూ కలిసి వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా వివరాలు సేకరించగా మృతురాలు నిజామాబాద్ జిల్లా బాన్సువాడకు చెందిన అంజమ్మ (45)గా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఆమె రెండు రోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లిందని తిరిగి రాలేదని ఆమెతో ప్రయాణించిన మరో మహిళ పేరు అదే ప్రాంతానికి చెందిన బూసి బోయిన గంగామణి గా(40)దర్యాప్తులో తెలింది. మృతురాలు అంజమ్మ మెడలో ఉన్న ఆభరణాలను చూసి ఆశపడిన గంగామణి ఎలాగైనా అవి కాజేయాలని పథకం రచించింది. మా బంధువుల ఇంటికి వెళ్దొద్దామంటూ అంజమ్మకు నమ్మబలికి నిజామాబాద్ నుండి అంజమ్మను వెంటబెట్టుకుని తీసుకువచ్చి గంగామణి గండిమైసమ్మలోని బస్టాండ్ వద్ద కల్లు తాగించి బహదూర్ పల్లి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి వెంట తెచ్చుకున్న కర్రతో కొట్టి చంపిందని డిసిపి కోటిరెడ్డి వెల్లడించారు. మృతురాలను చంపి కాజేసిన 2లక్షల విలువచేసే వెండి, బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు గంగామణిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తు లో చాకచక్యంగా వ్యవహరించి పురోగతి సాధించిన మేడ్చల్ ఏసిపి శ్రీనివాసరెడ్డి, దుండిగల్ సిఐ సతీష్, డిఐ బుడిగం సతీష్, ఎస్సైలు శంకర్, రామ్మోహన్ రెడ్డి సిబ్బందిని డిసిపి అభినందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**ప్రజాపక్షం/ఉప్పల్ :** ఉప్పల్ కాలనీల్లో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి, విస్తృత పర్యటన చేశారు. ఉప్పల్ డివిజన్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా చేసుకొని ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కుమార్ పాటిల్, ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి విస్తృతంగా పర్యటించారు.

శనివారం ఉదయాన్నే డివిజన్ పరిధిలోని కాలనీలు దేవేందర్ నగర్, ఇందిరా నగర్, శేషసాయి నగర్, పద్మావతి కాలనీలలో పర్యటించి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భం గా ఆయా కాలనీవాసులు పలు రకాల సమస్యలను జడ్సీ కార్పొరేటర్ రజితాపరమేశ్వర్ రెడ్డి దృష్టికి తెచ్చారు. ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కారం చేయనున్నట్లుగా ఈ సందర్భంగా జడ్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి ఆంజనేయులు ఈఈ హరిలాల్, ఎఇ మోనికా, పద్మావతి కాలనీ అధ్యక్షులు చింతల శ్రీనివాస్ రెడ్డి, శేష సాయి నగర్ కాలనీ అధ్యక్షులు ప్రభాకర్, మోదుగు మోహన్ రెడ్డి, బీమా నాయక్, నర్సయ్య, బాకారం లక్ష్మణ్, తుమ్మల దేవిరెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, విప్లవ్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఉపాధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి, బి.విజయ్, రాములు, జి.లక్ష్మా రెడ్డి, వి.మల్లేష్, బాలరామ్ నాయుడు భాస్కర్ రెడ్డి, ఆనంద్ నగర్ కాలనీ అధ్యక్షులు మధు, బాల భాస్కర్, వెంకటేశ్వర కాలనీ అధ్యక్షులు నర్సింహా, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## దివ్యాంగ చిన్నారుల వికాస కార్యక్రమాలు అభినందనీయం

### ఒరిస్సా ఎస్ఐఆర్‌డి ప్రతినిధుల ప్రశంసలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** మేడ్చల్ జిల్లాలో దివ్యాంగుల చిన్నారుల వికాసం, ఎదుగుదల కోసం తెలంగాణా ప్రభుత్వం తీసుకొంటున్న వికాస కార్యక్రమాలు అభినందనీయమని ఒరిస్సా రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతి సంస్థ (ఎస్ఐఆర్‌డి) ప్రతినిధులు కొనియాడారు. తెలంగాణా రాష్ట్రం ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళల సాధికారిత కోసం కొనసాగిస్తున్న అభివృద్ధి కార్యక్రమాల అధ్యయనం చేసేందుకు గాను ఆ రాష్ట్ర ప్రతినిధులు ప్రమోద్‌కుమార్ దావా, సర్ప్ సోనెపాట్, సోంనాథ్ సాహు, ఎంపిటిసి సుద్ధర్ ఘడ్, జ్యోతి, సరస్వతి, అశితోష్ మిశ్రల బృందం సందర్శించారు. తమ పర్యటనలో భాగంగా మేడ్చల్ జిల్లాలకు వచ్చిన సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి సాంబశివరావు ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మండలంలోని ఏదులాబాద్ గ్రామంలో కొనసాగిస్తున్న మహిళా సాధికారిత కార్యక్రమాలను చూపించారు. అనంతరం ప్రత్యేక అవసరా లు ఉండే దివ్యాంగులైన చిన్నారులకు ఏదులాబాద్‌లోని సైబర్ హుడ్ సెంటర్‌లో 35 మంది చిన్నారులకు ఫిజియోథెరపిస్టు, స్పీచ్ థెరపిస్టుల ద్వారా అందిస్తున్న వికాస పెంపుదల కార్యక్రమాలను వివరించారు.

## సమస్యలన్నింటినీ పరిష్కరిస్తాం

**ప్రజాపక్షం /నార్సింగి:** విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని శంషాబాద్ తహసిల్దార్ రవీందర్ దత్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని పాలమాకులలో ఉన్న జ్యోతిబాఫూలే రెసిడెన్షియల్ బాలికల హాస్టల్ లో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి సంబంధించిన రిజిస్టర్ ను తనిఖీ చేశారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. హాస్టల్లో భోజనం సరిగా పెడుతున్నారా అని తెలుసుకున్నారు.

# మహానగరి

## భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ల పరిశీలన



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పూర్తి స్థాయి మరమ్మత్తులు చేసి కాలనీ వాసులకు డ్రైనేజీ రోడ్లపై పొంగకుండా చర్యలు తీసుకుంటున్నామని హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. శనివారం డివిజన్‌లోని పద్మావతి కాలనీలో డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌ను జిహెచ్‌ఎంసి ఎఇ హేమ నాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు, కాంట్రాక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన భూగర్భ సంపుల నిర్మాణాలు

రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ జిహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు. ఖైరతాబాద్ జోన్ పరిధిలోని రాజ్‌భవన్ రోడ్డు లేక్ వ్యూ గెస్ట్ హౌస్ ప్రవేశ మార్గంలో భూగర్భ సంపు (రెయిన్ వాటర్ హోర్డింగ్ స్ట్రక్చర్) నిర్మాణ పనులను పురోగతిని శనివారం ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, హెచ్‌ఎండిఎ, జలమండలి, జిహెచ్‌ఎంసి అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం ఎదురుగా నిర్మిస్తున్న భూగర్భ సంపు నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 10నుంచి 40 లక్షల లీటర్ల సామర్థ్యంతో ప్రయోగాత్మకంగా 12 చోట్ల భూగర్భ సంపుల నిర్మాణ పనులను చేపట్టామని, వీటిలో 4 పూర్తి అయ్యాయని జిహెచ్‌ఎంసి అధికారులు ముఖ్య కార్యదర్శికి తెలిపారు. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడం తద్వారా రోడ్లపై నీరు నిల్వకుండా చూడటం, ట్రాఫిక్ ఇబ్బందులు దూరం చేసేందుకు నిర్మిస్తున్న భూగర్భ సంపులను నిర్మిస్తున్నట్లు దానకిషోర్ చెప్పారు. నిర్మాణంలో ఉన్న భూగర్భ సంపులను త్వరిత గతిన పూర్తి చేయాలని జిహెచ్‌ఎంసి అధికారులను ఆయన ఆదేశించారు.

**విజయోత్సవాలకు.. ట్యాంక్‌బండ్‌ను ముస్తాబు చేయాలి**

ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలకు అసెంబ్లీ, ట్యాంక్ బండ్, సచివాలయం పరిసర ప్రాంతాలను సుందరంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్ సంబంధిత అధికారులకు సూచించారు. అసెంబ్లీ, సచివాలయం, ట్యాంక్‌బండ్, సంజీవయ్య పార్కు రోడ్డు, రాజ్ భవన్ రోడ్డులో శనివారం ఆయన హెచ్‌ఎండిఎ, జిహెచ్‌ఎంసి, జలమండలి అధికారులతో కలిసి పర్యటించారు. నగరంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవం వేడుకల విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చేనెల 7,8,9 తేదీల్లో హైదరాబాద్ ట్యాంక్ బండ్, సచివాలయం, నెక్లెస్ రోడ్ పరిసరాల్లో విజయోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృష్ట్యా ఈ ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రధాన మార్గాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకొని, సుందరంగా తీర్చిదిద్దాలని దాన కిషోర్ ఆదేశించారు. ఈ వేడుకలకు తిలకించేందుకు, నగర ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అవసరమైన చోట కొత్తగా తారు వేయడం, మరమ్మత్తులు చేపట్టడం, మార్కింగ్, సంకేత సూచిల బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంక్‌బండ్, సచివాలయం, నెక్లెస్ రోడ్ డివైడర్లు, కూడళ్లను అందంగా ముస్తాబు చేయాలని సూచించారు. ఈ పర్యటనలో హెచ్‌ఎండిఎ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, వాటర్ బోర్డు ఎం.డి. అశోక్ రెడ్డి, జిహెచ్‌ఎంసి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ఉప కార్యదర్శి ప్రియాంక, ఇంజనీర్ ఇన్ చీఫ్ మడపాటి దేవానంద్, జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి, హెచ్‌ఎండిఏ చీఫ్ ఇంజనీర్ పరంజ్యోతి తదితర ఉన్నతాధికారులు ఉన్నారు.

## కిసాన్ యాప్‌తో నగదు చోరీ

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కిసాన్ యాప్ పేరుతో సైబర్ నేరగాళ్లు నగదు దొంగిలించిన సంఘటన ఎల్‌బి నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఎల్‌బి నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హస్తినాపురం డివిజన్‌లోని కస్తూరి కాలనీకి చెందిన పల్లా వెంకటరెడ్డి ప్రైవేటు ఉద్యోగి, తన ఫోన్ నెంబరు ద్వారా ఒక పీఎం కిసాన్ యాప్ అనుకుని తనకు తెలియకుండా ఇన్‌స్టాల్ చేయబడింది, తన ఫోన్ హ్యాక్ చేయబడిందని పేర్కొన్నాడు. దీనికి కారణంగా అతని డబ్బు అతని రెండు ఇండస్ ల్యాండ్ క్రెడిట్ కార్డ్‌లు, ఆర్‌బిఎల్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్ నుండి డెబిట్ చేయబడింది. దీంట్లో నుంచి మొత్తం రూ. లక్ష 35వేల 528/ పోగొట్టుకున్నానని తెలిపారు. దీనిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు ఫిర్యాదులో తెలిపారు. ఈ మేరకు ఎల్‌బి నగర్ పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వినోద్‌కుమార్ తెలిపారు. సైబర్ క్రైమ్ అయినట్లయితే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ 1930కు ఫిర్యాదు చేయాలని సిఐ సూచించారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి

డిప్యూటీ డిఎంహెచ్‌ఒ డాక్టర్ వి. విజయలక్ష్మి



**ప్రజాపక్షం/కొందుర్గు:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది తప్పని సరిగా సమయపాలన పాటించాలని షాద్‌నగర్ డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సందర్శించి, సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీలకు సమయానికి పరీక్షలు నిర్వహించాలని, ఐరన్ మాత్రలు అందజేయాలని, ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులకు వ్యాక్సినేషన్లు ఇవ్వాలని, ఆన్ లైన్ డాటాను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. సూపర్‌వైజర్లు తమ సబ్ సెంటర్లను సందర్శించి ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల పనితీరును పరిశీలించాలని, ఎన్‌సిడి, ఆభా క్రియేషన్ కార్డుల లక్ష్యాన్ని పూర్తి చేయించాలని తెలిపారు. సమావేశంలో మండల వైద్యాధికారిణి డాక్టర్ అమృతాజోసఫ్, సిబ్బంది జె శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మంజులవాణి, లూదియా, శ్రీనివాస్, అన్వర్, భగవత్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

## నాగోల్ దోబీ ఘాట్‌కు మౌలిక సౌకర్యాలు కల్పిస్తా : ఈటల



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** నాగోల్ దోబీ ఘాట్‌కు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. ఈదమాత తృతీయ కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా అమ్మవారికి బోనాలతో ఊరేగింపుతో వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా ఎంపి ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. దోబిఘాట్ ప్లాంటును, కమ్యూనిటీ హాల్ కాంపౌండ్ వాల్‌లను పరిశీలించి వాటికి కావాల్సిన మౌలిక సదుపాయలతో పాటు నిధులు మంజూరు చేయించి అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కొన్ని సమస్యలు పరిష్కారం కాని వాటిని జిహెచ్‌ఎంసి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్, రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, బి. చుక్కయ్య, బి.సహాదేవు, రమేష్, మధు, మహేందర్‌నాథ్, భరత్ కుమార్, వినయ్‌కుమార్, కార్తీక్, సూరి, తదితరులు ఉన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎ.సులోచన అన్నారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తనకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. అర్థరాత్రైనా..అపరాత్రైనా రైతుల వెంటే ఉంటామని అన్నారు. ఈ నెల 27న ఉదయం 10 గంటలకు నూతన కమిటి ప్రమాణ స్వీకారం ఉంటుందని, కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావులతో పాటు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్,నూతన డైరెక్టర్లు కె రవి, బాలశౌరిరెడ్డి, చాకలి నర్సింహులు, సి వెంకట నర్సింహ్మారెడ్డి, పి వెంకటరెడ్డి, లాహోటి భరత్, కె సందీప్‌కుమార్, టి నవీన్‌కుమార్, కొందుర్గు మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
వెంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తా

## మత కల్లోలాలు సృష్టించేందుకు కుట్ర

మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మత కల్లోలాలను సృష్టించేందుకు రాష్ట్రంలోని దేవాలయాలపై దాడులు జరుగుతున్నాయని మహబూబ్‌నగర్ ఎంపి డికె అరుణ ఆరోపించారు. షాద్‌నగర్ పట్టణం ఫరూఖ్‌నగర్‌లోని వివేకానంద కాలనీలో గల పురాతన శివాలయంలో శివలింగం అపహారణ, ఇతర విగ్రహాల ధ్వంసం జరుగుడంతో శనివారం ఎంపి దేవాలయాన్ని సందర్శించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి, పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పి విష్ణువర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, చెట్ల వెంకటేష్, కె శివ, తదితరులు ఉన్నారు.


## మల్కీజ్‌గూడ డ్వాక్రా గూపుల్లో జరిగిన అవకతవకల్లో బ్యాంక్ మేనేజర్ పాత్ర



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మల్కీజ్‌గూడ గ్రామంలోని డ్వాక్రా గూపుల్లో జరిగిన అవినీతి అక్రమాల విషయంలో యాచారం ఎస్‌బిహెచ్ మేనేజర్ జాన్సీ రాణి, విబికె రాణి ఇద్దరు కుమ్మకై పెద్దెత్తున అవినీతి అక్రమాలకు పాల్పడినట్లు తెలుస్తుంది. అమాయక ప్రజల డబ్బులను దండుకోవాలని ఇద్దరు కలిసి పథకం ప్రకారం ప్లాన్ రూపొందించినట్లు తెలిసింది. రాజు అనే వ్యక్తి అయన భార్య జయశీల మిని బ్యాంక్ నిర్వహించారు. బ్యాంక్‌లో పెద్దెత్తున అవినీతికి పాల్పడినట్లు తెలియడంలో వారి యొక్క పర్మిషన్ రద్దు చేశారు. అక్రమాలకు పాల్పడిన రాజు అనే వ్యక్తితో యాచారం బ్యాంక్ మేనేజర్ జాన్సీరాణి మల్కీజ్‌గూడా గ్రామ విబికె రాణితో కమ్మకై పెద్దెత్తున అవినీతి అక్రమాలలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడవుతుంది. యాచారం బ్యాంక్ మేనేజర్ సహకారంతోనే ఈ వ్యవహారం అంత విబికె రాణి నిర్వహించినట్లు తెలిసింది. లక్షలాది రూపాయలను గ్రూఫ్‌ల్లో సంబంధం లేని వ్యక్తులకు ఎట్లా బ్యాంక్ అధికారులు ట్రాన్స్ ఫర్ చేస్తారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బ్యాంక్ మేనేజర్ జాన్సీరాణి, రాణిపై పై అధికారులు క్రిమినల్ కేసు నమోదు చేయాలని, రాజు అనే వ్యక్తిని యాచారం బ్యాంక్ నుండి తోలగించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అవి నీతి పరులకు బ్యాంక్ మేనేజర్ పెద్దపీట వేస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. తక్షణమే బ్యాంక్ మేనేజర్‌ను సస్పెండ్ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. బ్యాంక్ మేనేజర్ అక్రమాలపై త్వరలో ఎస్‌బిహెచ్ ప్రధాన కార్యాలయంలో వివరాలతో సహ ఫిర్యాదు చేయనున్నట్లు తెలపారు.

## అక్రమంగా సీవరేజ్ కనెక్షన్

మెహిదీపట్నంలోని ఓ రెస్టారెంట్ నిర్వాకం
ఎండి ఆదేశాలతో కనెక్షన్ కట్ చేసిన అధికారులు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జలమండలి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఏర్పాటు చేసుకున్న ఓ రెస్టారెంట్ సీవరేజ్ కనెక్షన్‌ను అధికారులు తొలగించారు. జలమండలి ఓ అండ్ ఎం డివిజన్3 పరిధి మెహిదీపట్నంలోని కింగ్స్ రెస్టారెంట్ యజమాన్యం అనుమతి లేకుండానే 250 ఎంఎం డయా సీవరేజ్ పైపు లైన్ కనెక్షన్ తీసుకుంది. దీంతో పాటు ఆ రెస్టారెంట్ నుంచి వచ్చే అధిక సీవరేజ్‌తో మెయిన్ రోడ్‌పై తరచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో అవుతుందని జలమండలి అధికారులు గుర్తించారు. ఇటీవల జలమండలి ఎండి. అశోక్ రెడ్డి అక్కడ పర్యటించిన సమయంలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రెస్టారెంట్ సీవరేజ్ కనెక్షన్ కట్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించా రు. దీంతో ఈ రోజు ఆ రెస్టారెంట్ సీవరేజ్ పైప్ లైన్ కనెక్షన్ తొలగించారు. అక్రమం గా నల్లా, సీవరేజ్ కనెక్షన్లు కలిగి ఉన్న వాళ్లు వాటిని క్రమబద్ధీకరించుకోవాలని ఎండి. అశోక్ రెడ్డి వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రులు, హోటళ్లు, బేకరీలు, మాల్స్ తదితర వాణిజ్య, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు తప్పని సరిగా సిల్ట్ చాంబర్లు ఏర్పాటు చేసుకోవాలని స్పష్టం చేశారు. జలమండలి అధికారుల నుంచి అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా తాగునీటి నల్లా, సీవరేజ్ పైప్‌లైన్ కనెక్షన్లు తీసుకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు. అక్రమ నల్లా, సీవరేజ్ కనెక్షన్లు గు ర్తిస్తే ఈ ఫోన్ నెంబర్లు 9989998100, 9989987135 లకు సమాచారం ఇవ్వాలన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదవాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



**ప్రజాపక్ష /రంగారెడ్డి ప్రతినిధి:** ఆటంకాలను అధిగమించి తమ లక్ష్యాన్ని చేదించేందుకు పట్టుదలతో చదువాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు.బుధవారం రంగారెడ్డి జిల్లా ఇబ్రాహింపట్నం నియోజకవర్గం బొంగుళ్లురులోని టిఎస్ మోడల్ స్కూల్ (హాస్టల్)ను ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మోడల్ స్కూల్ (హాస్టల్)ను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులను, వంటశాల ను, డైనింగ్ హాల్,మరుగుదొడ్లను, పిల్లల చదువు, అందిస్తున్న కూరగాయలను పరిశీలించి రోజు వారిగా అందిస్తున్న మెనును గూర్చి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇంటర్ చదువుతున్న విద్యార్థినిలతో మాట్లాడుతూ వారికి అందుతున్న సదుపాయాల, కల్పిస్తున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మీరంతా కష్టపడి చదివితే ఉత్తీర్ణతను సాధించడం కష్టమేమి కాదని,మళ్ళీ మళ్ళీ మంచి వసతులతో కూడిన హాస్టల్ అవకాశం రాదని, అందుకే బాగా చదివి, చదువును కష్టంగా బావించకుండా ఇష్టంగా చేసుకోని, చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.నేటి సమాజంలో టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో విద్యార్థులు టెక్నాలజీని విద్యపరంగా కాకుండా సామాజిక మాంద్యమాల్లలో ఫస్ బుక్, షేర్ చాట్,ఇన్ స్ట్రాగ్రాం వంటి వాటికి బానిసలు కాకుండా ఎట్టి పరిస్థితులో లక్ష్యానికి అడ్డం కాకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు.

# రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి
పాలమాకుల జంగయ్య విజ్ఞప్తి




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శనివారం తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రంగారెడ్డి జిల్లా సమితి సమావేశం శంషాబాద్ లోని ఎలెంటి హోటల్లో జరిగింది. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో రజక వృత్తిదారుల సమాఖ్య సంఘాన్ని బలోపేతం చేయాలని తెలిపారు. రజకులు సోదరులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల పైన ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని చెప్పారు. రజకులకు సామాజిక రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రజక వృత్తిదారుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చేపట్టే ఉద్యమాలకు భారత కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ సహకారం ఎల్లవేళలా ఉంటుందని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య స్పష్టం చేశారు. అనంతరం తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ మాట్లాడుతూ రజకులను ఎస్.సి జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

50 సంవత్సరాలు నిండిన రజక వృత్తిదారులందరికీ నాలుగు వేల పింఛన్‌ను ప్రభు త్వం తక్షణమే అమలు చేయాలని అన్నారు. రజకులపై జరుగుతున్న దాడులకు నివారించడానికి సాంఘిక భద్రత చట్టాన్ని తీసుకువచ్చి, అమలు చేయాలని,అదేవిధంగా జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలని కోరారు.రాష్ట్ర ప్రభు త్వం ఇస్తున్నటువంటి 250 యూనిట్లు కరెంటు 500 యూనిట్లకు పెంచాలని, పెండింగ్‌లో ఉన్న మోడరన్ ధోబి గట్లను పరిపూర్తి చేసి అమల్లోకి తేవాలని,ఆన్లైన్ చేసుకుని పెట్టుకున్నటువంటి సొసైటీలకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని,దోబిగట్లకు నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో కూడా స్థలాలను కేటాయించాలని,వారు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల పైన ప్రభుత్వం దృష్టి పెట్టి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి రజక సమాఖ్య నిర్మాణ బాధ్యులు బాతరాజు నరసింహ,తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షులు పగిళ్ల జోజి,ఓరుగంటి కృష్ణ, సహాయ కార్యదర్శి దండు నిరంజన్,దిడ్డి వెంకన్న,అక్కన్న పెల్లి జంగన్న,తదితరులు పాల్గొన్నారు.

**రజక సమాఖ్య జిల్లా కన్వీనర్, కో-కన్వీనర్ల ఎన్నిక**

అనంతరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్,కో కన్వీనర్ల ఎన్నిక జరిగింది. కన్వీనర్ గా జోజి,కో కన్వీనర్ గా కేతరాజు నరసింహ,సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలనే కుట్ర



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలనే కుట్ర జరుగుతుంద ని కాంగ్రెస్ గిరిజన ఆదివాసి విభాగం రాష్ట్ర కో ఆర్డినేటర్ పి రఘు ఆరోపించారు. శనివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫరూఖ్‌నగర్‌లోని వివేకానంద కాలనీలో శివలింగం అపహరణ క్షమించరాని నేరమని అన్నారు. కొందరు కుట్రపూరితంగా స్వార్థ ప్రయోజనాల కోసం మత కల్లోలాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తు, ఈ సంఘటను ఖండించారు. దైవానికి భయకుండా తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం చేసే ఇలాంటి దుశ్యర్యలను ఎవరు హర్షించరన్నారు. ప్రతి దేవాలయంలో తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఇం దుకోసం దాతలు ముందుకు రావాలని, దేవాలయాలను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్ పర్సన్ సులోచన, వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, నాయకులు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దళితుల హక్కుల సాధనకై ఉద్యమించాలి

డిఎచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు దాసరి మల్లేశ్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** దళితుల హక్కుల సాధనకై సంఘటితంగా ఉద్యమించాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు దాసరి మల్లేశ్ దళితులకు పిలుపునిచ్చారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజక వర్గం సిపిఐ కార్యాలయంలో జరిగిన దళితుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 యేండ్లు గడిచిన దళితులు ఆర్థిక, సామాజిక, రాజకీయంతో పాటు అన్ని రంగాలలో వెనుక బడి ఉన్నారని పేర్కోన్నారు. దళితులపై విచ్చల విడిగా జరుగుతున్న దాడులు, హత్యలు,అత్యచారాలు, అంటరాని తనం నిర్మూలించటంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలం చెందాయని విమర్శించారు. దళితులకు విద్య, వైద్యా, ఆరోగ్యంతో పాటు అన్ని రంగాలలో రిజర్వేషన్లు కల్పించి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పాలక ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. దళితులను ఆర్థికంగా అభివృద్ధి చేయకుంటే దళిత సంఘాలా ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. వచ్చే ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితీ సభ్యులు కావలి నర్సింహ్మా, నాయకులు దాసరి నారయాణ,ఎస్ లక్ష్మ య్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ పథకం పేదలకు వరం

**ప్రజాపక్షం/ చంపాపేట:** లక్షలు ఖర్చు చేసి ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు చేయించుకోలేని పేదలకు, సిఎంఆర్‌ఎఫ్ పథకం కొండంత అండగా ఉంటుందని జిహెచ్‌యంసి కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. లింగోజిగూడకు చెందిన శ్రీనివాస్ బ్రెయిన్ ట్యూమర్‌తో అనారోగ్యం బారిన పడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు పతుతున్న బాధితుడు శ్రీనివాస్, తనకు సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందేలా చూడాలని స్థానిక కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. ప్రత్యేకంగా చొరవ తీసుకొని రూ.60వేల చెక్‌ను మంజూరు చేయించి శనివారం లబ్దిదారుడికి రాజశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పోతరాజు, శ్రీధర్, కిట్టు, రమణ, కరణ్ కుమార్, యశ్వంత్, ఆనంద్ రాజ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు



# ఆర్‌ఎంసి ప్లాంట్‌ను మూసివేయాల్సిందే

బిఆర్‌ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి
'మై హోమ్ అవతార్' కూడలిలో ఆందోళన




**ప్రజాపక్షం/నార్సింగి :** ఆర్‌ఎంసి ప్లాంట్‌ను వెంటనే మూసి వేయకపోతే 2000 మందితో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని బిఆర్‌ఎస్ యువ నాయకుడు కార్తీక్ రెడ్డి,రాజేంద్రనగర్ బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి తోకల శ్రీనివాస్ రెడ్డిలుహెచ్చరించారు. మై హోమ్ అవతార్, హాల్ మార్క్ విసినియా నివాసితుల ఆధ్వర్యంలో శనివారం జరిగిన నిరసన కార్యక్రమంలో వారు మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా వాసవి అట్లాంటిస్ వారి ఆర్‌డిసి కంపెనీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆర్‌ఎంసి ప్లాంట్ వల్ల విపరీతమైన దుమ్ము, దూళి,శబ్దాల కారణంగా స్థానికంగా నివాసం ఉంటున్న సుమారు 12,000 మంది తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యను పలుమార్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు, పోలీసు అధికారులకు, మున్సిపల్ అధికారులకు స్థానిక నాయకులకు తెలియజేశారని పేర్కొన్నారు. ఎవరు కూడా స్పందించలేదని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ధర్నాకు దిగారని తెలిపారు. తక్షణమే ఆర్‌ఎంసి ప్లాంట్ కార్యకలాపాలు నిలిపి వేయకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతలు కోదండ రెడ్డి, కార్తీక్ రెడ్డి, తోకల శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు బాధితులు పేర్కొన్నారు. కోదండ రెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో పాటు స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో మాట్లాడి ఆర్‌ఎంసి ప్లాంట్‌ను తక్షణమే మూసివేయించి సమస్యకు పరిష్కారం చూపించాలని సూచించారు. కార్యక్రమంలో కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం మీద ప్రజల నమ్మకం దెబ్బతినకుండా, కోకా పేట్ ప్రాంతం అపఖ్యాతి చెందకుండా, సమస్యను త్వరగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, ఇక్కడ నివసిస్తున్న ప్రజలు భారీ మొత్తంలో తమ ఆదాయాన్ని ఇఎంఐలు కడుతూ, మున్సిపల్ టాక్సులు కడుతూ అభివృద్ధికి తోడ్పడుతున్నారని, కానీ కనీస అవసరాలైన శుభ్రత,కాలుష్య నియంత్రణపై అధికారులు స్పందించకపోవడం బాధకరమని ఆయన అన్నారు. మున్సిపల్‌కు కట్టవలసిన టాక్స్ కట్టకుండా ఆపేయాలని ఆయన అన్నారు. అనంతరం తోకల శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఈ సమస్యలను ప్రజలు వెల్లడించినప్పటికీ, ఇప్పటి వరకు ఎటువంటి పరిష్కారం కనిపించలేదన్నారు. పరిస్థితి మరింత దిగజారుతోందని, ఆర్‌ఎంసి ప్లాంట్‌ను తక్షణమే మూసివేయకపోతే, అలాగే ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టకపోతే, పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పద్మారావు, నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ధనరాజ్,రూపరెడ్డి, ముత్తంగి లక్ష్మయ్య ,అందే లక్ష్మణరావు, సంఘం శ్రీకాంత్, ఏర్పుల శ్రీకాంత్ ,ఉపేందర్ రెడ్డి, కీర్తి లత ,రాజేంద్రప్రసాద్, విజయలక్ష్మి,తదితరులు స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# క్రీడ

## టెస్ట్‌లలో యశస్వీ జైస్వాల్..
# వరల్డ్ రికార్డ్!

పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటుతో తడబడినా, రెండో ఇన్నింగ్స్‌లో అద్భుతంగా సత్తాచాటుతోంది. రెండో రోజు ఆట ముగిసేసరికి టీమిండియా సెకెండ్ ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా 172 పరుగులు చేసింది. ఓపెనర్లు యశస్వీ జైస్వాల్ (90 బ్యాటింగ్; 193 బంతుల్లో, 7 ఫోర్లు, 2 సిక్సర్లు), కేఎల్ రాహుల్ (62 బ్యాటింగ్; 153 బంతుల్లో, 4 ఫోర్లు).. ఆసీస్ బౌలర్లను నిస్సహాయులుగా చేస్తూ స్కోరుబోర్డును నడిపించారు. ఇదాక ఆటలో రెండు సిక్సర్లు బాదిన యశస్వీ జైస్వాల్ అరుదైన ఘనత సాధించాడు. టెస్టు ఫార్మాట్‌లో ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక సిక్సర్లు బాదిన ప్లేయర్‌గా న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ బ్రెండన్ మెకల్లమ్ సరసన నిలిచాడు. 2014లో మెకల్లమ్ 33 సిక్సర్లు సాధించగా, ఈ ఏడాది అదే ఘనతను జైస్వాల్ అందుకున్నాడు. ఈ జాబితాలో మెకల్లమ్, జైస్వాల్ తర్వాతి స్థానాల్లో బెన్ స్టోక్స్ (26 సిక్సర్లు2022), ఆడమ్ గిల్‌క్రిస్ట్ (22 సిక్సర్లు 2005), వీరేంద్ర సెహ్వాగ్ (22 సిక్సర్లు 2008) ఉన్నారు. కాగా, ఓవర్‌నైట్ స్కోర్ 67/7తో రెండో రోజు ఆటను ఆరంభించిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 51.2 ఓవర్లలో 104 పరుగులకే కుప్పకూలింది. జస్‌ప్రీత్ బుమ్రా (5/30) అయిదు వికెట్లతో విజృంభించాడు. హర్షిత్ రాణా (3/48) మూడు, మహ్మద్ సిరాజ్ (2/20) రెండు వికెట్లు పడగొట్టారు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో మిచెల్ స్టార్క్ (26; 112 బంతుల్లో, 2 ఫోర్లు) టాప్ స్కోరర్. స్టార్క్ మినహా అలెక్స్ కేరీ (21; 31 బంతుల్లో, 3 ఫోర్లు), ట్రావిస్ హెడ్ (11; 13 బంతుల్లో, 2 ఫోర్లు), మెక్‌స్వీని (10; 13 బంతుల్లో, 2 ఫోర్లు) మాత్రమే రెండంకెల స్కోరు




సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియాకు 46 పరుగుల ఆధిక్యం లభించింది. హేజిల్‌వుడ్ (7 నాటౌట్; 31 బంతుల్లో, 1 ఫోర్)తో కలిసి స్టార్క్ 25 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌లో ఆఖరి వికెట్‌కు నమోదైన ఈ భాగస్వామ్యమే అత్యుత్తమం. అంతకుముందు టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 49.4 ఓవర్లలో 150 పరుగులకు ఆలౌటైంది. తెలుగు కుర్రాడు నితీశ్ కుమార్ రెడ్డి (41; 59 బంతుల్లో, 6 ఫోర్లు, 1 సిక్సర్) టాప్ స్కోరర్. రిషబ్ పంత్ (37; 78 బంతుల్లో, 3 ఫోర్లు, 1 సిక్సర్), కేఎల్ రాహుల్ (26; 74 బంతుల్లో, 3 ఫోర్లు) కీలక పరుగులు చేశారు. జోస్ హేజిల్‌వుడ్ నాలుగు వికెట్లు, మిచెల్ స్టార్క్, ప్యాట్ కమిన్స్, మిచెల్ మార్ష్ తలో రెండు వికెట్లు తీశారు.

## తిలక్ వర్మ మరో భారీ శతకం..
# 10 సిక్సర్లతో విధ్వంసం!

దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ విధ్వంసం సృష్టించాడు. తన సూపర్ ఫామ్‌ను కొనసాగిస్తూ మేఘాలయపై శతకంతో కదం తొక్కాడు. 67 బంతుల్లో ఏకంగా 151 పరుగులు బాదాడు. 14 ఫోర్లు, 10 సిక్సర్లతో ఊచకోతకు దిగాడు. టీ20ల్లో తిలక్‌కు వరుసగా ఇది మూడో సెంచరీ. దక్షిణాఫ్రికాతో జరిగిన టీ20 సిరీస్‌లో చివరి రెండు మ్యాచ్‌ల్లోనూ తిలక్ శతకం సాధించిన సంగతి తెలిసిందే. దక్షిణాఫ్రికా మూడు, నాలుగో టీ20ల్లో వన్‌డౌన్‌లో వచ్చిన అతను అజేయంగా 107, 120 పరుగులు బాదాడు. కాగా, మేఘాలయతో జరిగిన మ్యాచ్‌లోనూ తిలక్ మూడో స్థానంలోనే బ్యాటింగ్‌కు వచ్చాడు. ఓపెనర్ రాహుల్ సింగ్ డకౌటవ్వడంతో తొలి ఓవర్‌లోనే క్రీజులోకి వచ్చిన తిలక్ ఆఖరి బంతికి ఔటై పెవిలియన్‌కు చేరాడు. కెప్టెన్ తిలక్ వర్మతో పాటు తన్మయ్ అగర్వాల్ (55; 23 బంతుల్లో, 4 ఫోర్లు, 5 సిక్సర్లు) కూడా చెలరేగడంతో.. మొదట బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్లకు 248 పరుగులు చేసింది. రాహుల్ బుద్ధి (30; 23 బంతుల్లో, 2 ఫోర్లు, 1 సిక్సర్) పరుగులు చేశాడు. మేఘాలయ బౌలర్లలో డిప్పు సిగ్మా రెండు వికెట్లు, ఆకాశ్ చౌదరి ఒక వికెట్ తీశారు. ఆదిలోనే వికెట్ పడగొట్టి హైదరాబాద్‌ను ఆకాశ్ దెబ్బ తీసినా, తిలక్ వర్మ రాకతో ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. క్రీజులో కుదురుకునే వరకు ఓపిక పట్టిన తిలక్ ఆ తర్వాత దాడికి దిగాడు. తిలక్‌తో పాటు తన్మయ్ కూడా సత్తాచాటడంతో 10 ఓవర్లకు హైదరాబాద్ 123 పరుగులు చేసింది. అనంతరం తన్మయ్ ఔటైనప్పటికీ తిలక్ ఆఖరి వరకు నిలబడి స్కోరుబోర్డు పరుగులు పెట్టించాడు.





## చరిత్ర సృష్టించిన భువనేశ్వర్ కుమార్..

ఐపీఎల్ 2025 మెగా వేలానికి ఒక్క రోజు ముందు టీమిండియా వెటరన్ పేసర్ భువనేశ్వర్ కుమార్ చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో 300 వికెట్ల మైలురాయిని అందుకున్న తొలి భారత పేసర్‌గా చరిత్రకెక్కాడు. ప్రతిష్టాత్మక దేశవాళీ టీ20 టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఉత్తరప్రదేశ్‌కు సారథ్యం వహిస్తున్న భువనేశ్వర్ కుమార్.. శనివారం ఢిల్లీతో జరిగిన మ్యాచ్‌లో ఈ అరుదైన ఫీట్ సాధించాడు. ఢిల్లీ ఓపెనర్ యష్ దుల్‌ను ఔట్ చేసి 300 వికెట్ల క్లబ్‌లో చేరాడు. దేశవాళీ, ఐపీఎల్, అంతర్జాతీయ టీ20ల్లో కలిపి మొత్తం 287 మ్యాచ్‌లు ఆడిన భువనేశ్వర్ కుమార్.. మొత్తం 300 వికెట్లు పడగొట్టాడు. ఓవరాల్‌గా ఈ ఫీట్ సాధించిన నాలుగో బౌలర్‌గా నిలిచాడు. భువనేశ్వర్ కంటే ముందు యుజ్వేంద్ర చాహల్(354), పియూష్ చావ్లా(314), అశ్విన్(310) భువీ కంటే ముందున్నారు. పేసర్లలో భువనేశ్వర్ మినహా మరే భారత పేసర్ 300 వికెట్ల మైలు రాయి అందుకోలేదు. టీమిండియా స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ 300 వికెట్ల మైలురాయికి 5 వికెట్ల దూరంలో ఉన్నాడు. బుమ్రా ఇప్పటి వరకు 233 టీ20 మ్యాచ్‌లు ఆడి 295 వికెట్లు తీసాడు.

# రీల్

## ఓటిటిలో రికార్డు బ్రేక్ చేసిన బన్నీ, బాలయ్య ఎపిసోడ్

ఇపుడు ఓటిటిల హవా ఎలా ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అయితే నేషనల్, ఇంటర్నేషనల్ లెవెల్లో చాలా ఓటిటిలు ఉన్నాయి కానీ మన తెలుగు నుంచి వచ్చిన ఆహా మాత్రం లోకల్ టు నేషనల్ లెవెల్లో రూల్ చేస్తున్నదని చెప్పాలి. ముఖ్యంగా ఇందులో ఒరిజినల్ కంటెంట్ సహా నట సింహం నందమూరి బాలకృష్ణతో స్టార్ట్ చేసిన అన్ స్టాపబుల్ అనే క్రేజీ టాక్ షో భారీ హిట్ అయ్యి ఇపుడు నాల్గో సీజన్లోకి వచ్చింది. అయితే రీసెంట్ గా ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఈ షోలో పాల్గొనగా మొత్తం రెండు ఎపిసోడ్స్ గా దీని తీసుకొచ్చారు. అయితే రెండో ఎపిసోడ్ ఇపుడు రికార్డులు బ్రేక్ చేసినట్టుగా తెలుస్తుంది. బన్నీ ఇద్దరు చిన్నారులు అలాగే బాలయ్యతో కలిపి ఎంతో ఇంట్రెస్టింగ్ గా ఎంతో ఎంటర్టైనింగ్ గా సాగిన ఈ ఎపిసోడ్ కి భారీ మొత్తంలో ఎంగేజ్మెంట్ ఆహా లో వచ్చిందట. దీనితో ముందు ఉన్న రికార్డు వ్యూస్ అన్నీ తుడిచిపెట్టుకుపోయి ఈ ఎపిసోడ్ కి హయ్యెస్ట్ వ్యూస్ వచ్చాయట. మరి ఇందులో అల్లు అయాన్, అల్లు అర్హలతో అయాన్ తన మార్క్ మ్యానరిజంలు, మాటలతో ఎంతో ఎంటర్టైన్మెంట్ అందించగా అర్హ అయితే తన తెలుగుతో బాలయ్యని సైతం ఆశ్చర్యపరిచింది. ఇక బన్నీ షేర్ చేసుకున్న పలు అంశాలు, మెగాస్టార్ చిరంజీవి కోసం చేసిన కామెంట్స్ వంటివి ఈ ఎపిసోడ్ కి రికార్డు బ్రేకింగ్ రెస్పాన్స్ ని అందించాయట.







## కూలీపై కింగ్ నాగ్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్

కోలీవుడ్ సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ లో దర్శకుడు లోకేష్ కనగరాజ్ తెరకెక్కిస్తున్న భారీ యాక్షన్ అండ్ మల్టీ స్టారర్ చిత్రం కూలీ చిత్రం కోసం అందరికీ తెలిసిందే. మరి ఈ సినిమా కోలీవుడ్ నుంచి మొదటి 1000 కోట్ల సినిమా కావచ్చనే టాక్ విస్తృతంగా వినిపిస్తుండగా ఈ చిత్రంలో మన టాలీవుడ్ నుంచి కింగ్ నాగార్జున కూడా సాలిడ్ రోల్ చేస్తున్న సంగతి తెలిసిందే. మరి లేటెస్ట్ గా కూలీ సినిమాలో వర్క్ చేయడంపై అలాగే దర్శకుడు లోకేష్ కనగరాజ్ పై నాగార్జున ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసారు. లోకేష్ కనగరాజ్ ఒక జెన్ – జీ చెందిన వాడు కాదు కానీ జెన్ – జీ ఫిలిం మేకర్ అంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అలాగే తన స్క్రీన్ ప్లే అలాగే పాత్రలతో కొత్త తరహా ఫిల్మ్ మేకింగ్ ని తన నుంచి చూసాను అని అలాగే ఈ సినిమా చేస్తున్నంత సేపు ఎంజాయ్ చేస్తున్నాను అని కింగ్ నాగ్ తెలిపారు. దీనితో ఈ కామెంట్స్ వైరల్ గా మారాయి.




## 'విడుదల 2' నుంచి ఇళయరాజా సాంగ్ విడుదల

కోలీవుడ్ విలక్షణ నటుడు విజయ్ సేతుపతి అలాగే మరో టాలెంటెడ్ నటుడు సూరి కాంబినేషన్ లో దర్శకుడు వెట్రి మారన్ కాంబినేషన్ లో రూపొందిన చిత్రం విడుదల–2. ఈ చిత్ర తెలుగు హక్కులను దక్కించుకున్నారు ప్రముఖ నిర్మాత , శ్రీ వేధాక్షర మూవీస్ అధినేత చింతపల్లి రామారావు. కాగా ఈ చిత్రంలోని తొలి పాట ,పావురమా పావురమా అనే పాటను నిన్న విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత చింతపల్లి రామారావు మాట్లాడుతూ.. సంగీత మాంత్రికుడు ఇళయరాజా స్వరపరిచిన, విడుదల 2 చిత్రంలోని తొలిపాటను నిన్న విడుదల చేయడం ఆనందంగా ఉంది. కాసర్ల శ్యామ్ కలం నుంచి వెలువడిన ఈ పాటను తెలుగు ప్రేక్షకులు ఇంత స్పీడుగా ఆదరిస్తున్నం దుకు సంతోషంగా ఉంది. విజయ్ సేతుపతి, సూరి నటన హైలైట్ గా విడుదల2 ప్రేక్షకులను కనువిందు చేయబోతోంది. అలాగే ఏడు సార్లు నేషనల్ అవార్డు పొందిన ఏకైక దర్శకుడు వెట్రీ మారన్, ఎన్నో సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించిన ఆర్ ఎస్ ఇన్ఫోటైన్మెంట్ అధినేత ఎల్రెడ్ కుమార్ తో కలిసి ఈ చిత్రాన్ని అత్య ద్భుతంగా తెరకెక్కించారు. మంచి కమర్షియల్ వాల్యూస్ ఉన్న ఈ చిత్ర హక్కులను మేము దక్కిం చుకున్నందుకు సంతోష పడుతున్నాం. డిసెంబర్ 20 న ఇండియన్ సెల్యూలాయిడ్ పై ప్రేక్షకులంతా చూసి ఆశీర్వదించాలని కోరుకుంటున్నాం అని అన్నారు.

# ముగిసిన బిసి కమిషన్ బహిరంగ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : బిసి కులాలలో వెనుక బాటుతనాన్ని, బిసి కూలాల్లో ఉన్న అణగారిని వర్గాల అభ్యున్నతికి తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను తమ విజ్ఞప్తుల ద్వారా వివిధ సంఘాల ప్రతినిధులు తెలంగాణ బిసి కమిషన్ దృష్టికి తీసుకపోయారు. తెలంగాణ బిసి కమిషన్ రెండవ విడత బహిరంగ విచారణ శనివారం హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు వెనుకబడిన తరగతుల స్థితిగతుల గురించి బహిరంగ విచారణ జరిగింది. దీంతో ఉమ్మడి జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తున్న బహిరంగ విచారణలు శనివారంతో ముగిశాయి. తదుపరి రాష్ట్ర స్థాయి బహిరంగ విచారణలు సోమ, మంగళవారం ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో జరుగనున్నాయి. ఈ కార్యక్రమంలో బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాస రావు, స్పెషల్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్‌లతో పాటు హైదరబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిషెట్టి, అదనపు కలెక్టర్ రెవెన్యూ హైదరాబాద్ ముకుంద రెడ్డి, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ వెంకటాచారి, బిసి వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఆశన్న పాల్గొన్నారు. వివిధ కులసంఘాలు, రాజకీయ పార్టీల నాయకులు దాదాపు 8 వందల మంది వరకు పాల్గొని, విజ్ఞప్తులు అందచేశారు. బహిరంగ విచరణలో హైదరాబాద్‌లో 95 వినతులు, సలహాలు, సూచనలు అఫిడవిట్ రూపంలో కమిషన్‌కి సమర్పించారు. ఈ వినతులలో భాగంగా మొత్తంగా బిసిలకు జనాభా దామాషాలో రిజర్వేషన్లు కల్పించాలని విన్నవించారు. వివిధ కుల సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను, వెనుకబాటుతనాన్ని కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రాష్ట్ర బిసి జాబితాలో కులాల గ్రూపుల మార్పు, వివిధ కులాల ఫెడరేషన్‌ల ఏర్పాటు, బలోపేతం వంటి పలు అంశాలను కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు.




**కమిషన్ రాష్ట్ర కార్యాలయంలో విజ్ఞప్తులు అందచేయవచ్చు :** కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్‌బహిరంగ విచారణ అనంతరం బిసి కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్ మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఇంకా తమ తమ వినతులను సమర్పించాలనుకున్న వారు కమిషన్ కార్యాలయంలో నేరుగా కానీ పోస్టు ద్వారా కానీ సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించిన హైదారాబాద్ జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా బిసి సంక్షేమ అధికారి, సిబ్బందిని నిరంజన్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఆ ఫారాలు వాహనంలోంచి ప్రమాదవశాత్తు పడిపోయాయి..

### బిసి కమిషన్‌కు నివేదిక ఇచ్చిన కలెక్టర్

ప్రజాపక్షం/హైదరాబాద్: నింపిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఫారాలు తార్నాక రోడ్లపై దర్శనమిచ్చాయంటూ శుక్రవారం సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకున్నట్టు మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరు గౌతం పొత్రు బిసి కమిషన్ చైర్మన్ కు సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే బిసి కమిషన్ చైర్మన్ సంబంధిత కలెక్టరును వివరణ కోరగా, మేడ్చల్ కలెక్టరు జరిగిన సంఘటనను వివరిస్తూ సమర్పించిన నివేదిక ప్రకారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వార్డు నంబర్ 27 కు సంబంధించిన సర్వే ఫారాలను సూపర్‌వైజర్ తన వాహనంలో తీసుకుని వెళుతుండగా కింద పడిపోయాయి. వీటిని గమనించిన జలమండలి సిబ్బంది వెంటనే సం బంధిత అధికారులకు సమాచారమివ్వగా వారు ఆ ఫారముల ను అన్నింటినీ స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సూపర్‌వైజర్ ను సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకున్నట్టు కలెక్టరు తన నివేదికలో పేర్కొన్నారు.

## గంజాయి మొక్కలు సాగు చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్: వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తే.. పదోపరకు ఆదాయం వస్తుందని, పంటతోపాటు పంట చేనులో గంజాయి మొక్కలు సాగుచేస్తే లక్షల లాభం గడించవచ్చునని భావించిన వ్యక్తికి సంగారెడ్డిలో ఐదేళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 25000 జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు.సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం పెద్దలోని గ్రామంలో మంగలి వెంకటేశం అనే వ్యక్తి గంజాయి సాగు చేశాడు. 2018 నవంబర్ 6న ఎక్సైజ్ సిఐ మధుబాబు సిబ్బందితో దాడి చేసి 36 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.గంజాయి సాగు చేసిన వ్యక్తిపై నమోదు చేసిన కేసు శనివారం సంగారెడ్డి జిల్లాలోని ఫస్ట్ అడిషనల్ డిస్టిక్ట్ న్యాయమూర్తి జయంతి గంజాయి సాగు చేసిన వెంకటేశ్వర్లకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 25000 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.గంజాయి సాగు చేసిన వ్యక్తికి శిక్ష పడడానికి అన్ని రకాల చర్యలు చేపట్టిన ఎక్సైజ్ సిఐ మధుబాబు తో పాటు సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ విబి కమలహాసన్ రెడ్డి, హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ కెఎబి శాస్త్రి అభినందించారు.

## బాల్యం బంది
(మొదటి పేజీ తరువాయి)

పాఠశాలకు వెళ్లి సాయంత్రం నాలుగు గంటలకు బయటకు వస్తే ఓపిక ఉన్నంత వరకు ఆటలే. ఉమ్మడి కుటుంబాలు ఆ రోజుల్లో ఉండడం వల్ల ప్రతి ఇంట్లోనూ పది మంది పిల్లలకు తక్కువ ఉండేవారు కాదు. వరుసతో కూడిన పిలుపులు, అప్యాయతలు, చిల్లర పోట్లాటలు అప్పట్లో సహజం కానీ పరిస్థితుల్లో చాలా మార్పులు వచ్చాయి. ఉమ్మడి కుటుంబాలు దాదాపు కనుమరుగయ్యాయి. ఒకరు లేక ఇద్దరు పిల్లలు అనే భావన పెరగడంతో ఏ ఇంట్లో చూసిన పిల్లల సందడి లేదు. కుటుంబాలలో వచ్చిన మార్పులతో పాటు విద్యాభ్యాసం, విద్యాలయాల్లోను పెను మార్పులు చోటు చేసుకున్నాయి. కార్పొరేట్ సంస్కృతిలో ఇల్లు, బడి తప్ప మరో వైపు తలెత్తి చూసే పరిస్థితి లేదు. సుదూరంలో ఉన్న పాఠశాలలకు వెళ్లే పిల్లల పరిస్థితి మరి ఘోరం. ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు బస్సుల్లోనే. పాఠశాలలకు ఆట స్థలాలు లేవు. ఆటలాడితే పిల్లలు చెడిపోతారన్న భావన తల్లిదండ్రుల్లో ఏర్పడి క్రమేపి పెరుగుతుంది. ఆటపాటలు లేక పిల్లలు శారీరక దారుఢ్యంతో ఎదగడం లేదు. మెదడుకు తప్ప శరీరానికి పని లేక పోవడంతో ఎదుగుదల లోపం, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. గతంలో మాదిరి ఉత్సాహంగా ఆటల్లో, పాటల్లో పాల్గొనే పరిస్థితి లేదు. సెలవుల్లో లేదా దైనందిన జీవితంలో కాస్త సమయం దొరికిన ఆడుకుందాం, కలిసి తిరుగుదాం అన్న భావన ఇప్పటి పిల్లల్లో కలగడం లేదు. సమయం దొరికితే చాలు టివికి అతుక్కుపోవడం కాదంటే సెల్ ఫోన్ చూడడం ఇప్పుడు ఒక అలవాటుగా మారింది. సెల్‌ఫోన్‌తోనే పిల్లలు కాలం గడుపుతున్నారు. దీని వల్ల ఇప్పుడు 10ఏళ్ల లోపే కళ్లజోడు అవసరం అవుతుంది. మొత్తంగా బాల్యం ఒంటరి అవుతుంది. ఇది భవిష్యత్తు సమాజానికి పెనుప్రమాదంగా మారనుంది. నాలుగు గోడల మధ్య సెల్ ఫోన్, టివిలతో, తరగతి గదుల్లో బోధన మధ్య గడుపుతూ బాలలు బంధీ అవుతున్నారు. పాఠశాలల నిర్వహకులలోనూ, తల్లిదండ్రుల్లోనూ మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. విద్యా బోధనతో పాటు క్రీడా, సాంస్కృతిక అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంది. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాలలో నిర్వహించడం, కనీస ఆట స్థలాలు లేకపోవడం విధితమే. తల్లిదండ్రులు సైతం చిన్నప్పటి నుంచి ఏదో జరగాలని ఆశించి పిల్లలపై చదువు చదువు అని ఒత్తిడి పెంచి మానసిక ఇబ్బందులకు గురి చేయడం ద్వారా వారి భవిష్యత్తును చిదిమేస్తున్నారు. బంధీ అవుతున్న బాల్యంపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్వేచ్ఛాయుత వాతావరణంలో పిల్లలు పెరిగేవిధంగా ఇంట్లోనూ, పాఠశాలల్లోనూ చర్యలు తీసుకోవాలి. లేకపోతే భవిష్యత్తు సమాజం మనం మనది అనే తత్వాన్ని కోల్పోతుంది.

## లాభాల్లోకి ఆర్‌టిసి
(మొదటి పేజీ తరువాయి)

మహాలక్ష్మి , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం, కొత్త బస్సుల కొనుగోలు, లాజిస్టిక్స్, ఆర్థిక పరమైన అంశాలపై ప్రధానంగా చర్చించారు. ఈ అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి ఆర్‌టిసి ఉన్నతాధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహాలక్ష్మి , మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్య పథకాన్ని ఆర్‌టిసి సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. సంస్థలోని ప్రతి ఒక్క సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఈ పథకంలో భాగంగా ఈ నెల 20 వరకు 111 కోట్ల జీరో టికెట్లకు సంస్థ జారీ చేసిందని, ఫలితంగా రూ. 3747 కోట్లను మహిళలు ఆదా చేసుకున్నార న్నారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన టికెట్ల రీయాంబర్స్‌మెంట్‌ను ఆర్‌టిసికి ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తోందని చెప్పారు.

**మహాలక్ష్మి పథకంతో 94 శాతానికి పెరిగిన ఆక్యూపెన్సీ..**

మహాలక్ష్మి పథకం అమలుకు ముందు 69 శాతంగా ఆక్యూపెన్సీ రేషియో(ఓఆర్) ఉండేదని, ప్రస్తుతం 94 శాతానికి పెరిగిందన్నారు. మొత్తం ప్రయాణికుల్లో 65.56 శాతం మహిళలే ఉంటున్నారని తెలిపారు. ఈ పథకాన్ని వినియోగించుకుంటున్న మహిళల సంఖ్య క్రమంగా పెరుగుతోందన్నారు. రద్దీకి అనుగుణంగా కొత్త బస్సుల కొనుగోలుకు ప్రణాళికను రూపొందించాలని ఆర్‌టిసి ఉన్నతాధికారులను ఆదేశించారు. వీలైనంత త్వరగా కొత్త బస్సులు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ఏడాది డిసెంబర్ నుంచి ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో 1389 కొత్త బస్సులను ఆర్‌టిసి కొనుగోలు చేసిందని తెలిపారు. మొదటి విడతలో మహబూబ్ నగర్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల్లోని మహిళా స్వయం సహాయక బృందాలకు అద్దె బస్సులను అందచేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో మండల సమాఖ్యకు ఒక్కటి చొప్పున అద్దె బస్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

**కారుణ్య నియామక ప్రక్రియను వేగవంతం చేయాలి..**

రాష్ట్రంలోని బస్ స్టేషన్లను ఆధునీకరించాలని అధికారులకు మంత్రి పొన్నం సూచించారు. ఇటీవల ప్రారంభించిన కార్గో హోం డెలివరీని సదుపాయాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లాలన్నారు. మరణించిన, మెడికల్ అన్‌ఫిటైన సిబ్బంది జీవిత భాగస్వాములకు, వారసులకు ఇచ్చే కారుణ్య ఉద్యోగాల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో రవాణ, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, టిజిఎస్ ఆర్‌టిసి ఎం.డి. వి.సి.సజ్జనర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, వినోద్ కుమార్, ఆర్థిక సలహాదారులు విజయపుష్పతో పాటు పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తగ్గిన దిగుబడి
(మొదటి పేజీ తరువాయి)

అని తెలిపింది. ఇటీవలి దశాబ్దాలలో రైతులు, వ్యవసాయ కార్మికుల అప్పులు అనేకరెట్లు పెరిగాయని కమిటీ వెల్లడించింది. '202223లో పంజాబ్‌లో రైతుల సంస్థాగత రుణం రూ.73,673 కోట్లు కాగా, జాతీయ వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి బ్యాంక్ ప్రకారం హర్యానా రాష్ట్రంలో రూ.76,630కోట్లుగా ఉంది. ఇది అదనంగా గణనీయంగా ఉంది. నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఒ2019) వెల్లడించిన ప్రకారం పంజాబ్‌లోని రైతులపై సంస్థాగత భారం మొత్తం బకాయి రుణంలో 21.3శాతం హర్యానాలో 32శాతంగా అంచనా వేయబడింది' అని కమిటీ పేర్కొంది.ఈ కమిటీలో రిటైర్డ్ ఐపిఎస్ అధికారి బిఎస్.సంధు, మొహాలీ నివాసి దేవిందర్ శర్మ, ప్రొఫెసర్ రంజిత్ సింగ్ ఘుమన్, పంజాబ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆర్థికవేత్త డాక్టర్ సుక్‌పాల్ సింగ్ కూడా ఉన్నారు. నికర వ్యవసాయ ఉత్పాదత క్షీణించడం,ఖర్చులు పెరగడం, సరిపోను మార్కెటింగ్ వ్యవస్థ లేకపోవడం, వ్యవసాయ ఉపాధి తగ్గిపోవడం కారణాలు వ్యవసాయ ఆదాయ క్షీణతకు దోహదపడ్డాయని ప్యానెల్ తెలియజేసింది. వ్యవసాయ కార్మికులతో పాటు చిన్న, సన్నకారు రైతులు ఈ ఆర్థిక స్క్వీజ్‌లో ఎక్కువగా ప్రభావితమైన మరియు హాని కలిగించే విభాగాలుగా ఉన్నాయని వివరించింది. వాస్తవానికి గ్రామీణ సమాజం మొత్తం తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉంది. జాతీయ స్థాయిలో మొత్తం కార్మికులలో 46శాతం మంది వ్యవసాయంలో మునిగిపోయారు. వారి ఆదాయంలో వాటా 15శాతం మాత్రమే అని అది పేర్కొంది.ఇదొక్కటే కాదు కనిపించని నిరుద్యోగం, పెద్ద సంఖ్యలో జీతంలేని కుటుంబ కార్మికులు ఉన్నారు. వారిలో గణనీయమైన నిష్పత్తి శ్రామిక పేదలు' అని కమిటీ తెలిపింది.

'వాతావరణ విపత్తు , పర్యావరణ మార్పుల తీవ్రత, నీటి మట్టం క్షీణించడం, తరచుగా పొడి స్పెల్‌లు, కొన్ని ప్రాంతాలలో అధిక వర్షపాతం, వేడితరంగాలు మొదలైనవి వ్యవసాయరంగాన్ని మరియు ఆహార భద్రతను భారీ స్థాయిలో ప్రభావితం చేస్తున్నాయి' అని కమిటీ వెల్లడించింది. పంట అవశేషాల నిర్వహణ కూడా వ్యవసాయంలో చాలా సీరియస్ ఛాలెంజ్‌గా మారిందని నివేదించింది. అంతేకాకుండా దేశవ్యాప్తంగా రైతు సమాజం ఆత్మహత్యల మహమ్మారితో పోరాడుతున్నదని ప్యానెల్ తన 11పేజీల నివేదికలో తెలిపింది. భారతదేశంలో నేషనల్ క్రైమ్ రికార్డ్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డేటాను సేకరించడం ప్రారంభించిన 1995నాటి నుంచి ఇప్పటి వరకు 4లక్షల రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, పంజాబ్‌లో మూడు ప్రభుత్వరంగ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన ఇంటింటి సర్వే మొత్తాన్ని కమిటీ నమోదు చేసింది.

దీని ప్రకారం 2000–2015 వరకు మొత్తం 15సంవత్సరాల కాలంలో 16,606మంది రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఈ ఆత్మహత్యలకు పాల్పడింది భూమిలేని వ్యవసాయ కార్మికులు, సన్నకారు రైతులేనని, దీనికి కారణం అధిక రుణభారమేనని తెలిపింది. సెప్టెంబరు 2నాటి ఆదేశాలకు అనుగుణంగా సుప్రీంకోర్టు పరిశీలన కోసం ప్యానల్ ఈ 11అంశాలను రూపొందించింది.

ప్రధాన సమస్యలలో వ్యవసాయాన్ని పునరుజ్జీవం చేసేటటువంటి చర్యలు వ్యవసాయ సంక్షోభాన్ని తీవ్రతరం చేసిరుణభారం పెరగడానికి వ్యవస్థాగత, ప్రాథమిక కారణాలను పరిశీలించడం, రైతులు, రైతుల బాధలు, గ్రామీణ సమాజంలో పెరుగుతోన్న అశాంతి వెనక ఉన్న కారణాలను పరిశీలించడం వంటివి కమిటీ అందజేసిన నివేదికలో ఉన్నాయి. ఇది రైతులకు , ప్రభుత్వానికి మధ్య ఉన్న నమ్మకాన్ని పునర్నిర్మించేందుకు ఈ నివేదిక సహాయపడుతోందని వెల్లడించింది. పెరుగుతున్న రుణ సంక్షోభం, అప్పుల బాధలో రైతులు, వ్యవసాయ కార్మికులకు ఉపశమనం కలిగించడానికి ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొంది. శంభు సరిహద్దులోని అంబాల సమీపంలో నిరసన చేపడుతున్న రైతులు ఫిబ్రవరి 13నుంచి రైతులు విడిది చేసిన నేపథ్యంలో ఏర్పాటు చేసిన బారికేడ్లను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్‌చేస్తూ హర్యానా ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ కమిటీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) , ప్రత్యక్ష ఆదాయ మద్దతు, ఇతర ఆచరణీయ విధానాలతో కూడిన లాభదాయక ధరలను నిర్ధారించే విధానం ద్వారా వ్యవసాయరంగం లాభదాయకతను పరిశీలించాల్సిన అవసరం ఉందని ప్యానెల్ పరిష్కార మార్గాన్ని సూచించింది. రైతుల డిమాండ్‌ను కూడా కమిటీ పరిశీలించిందని సుప్రీంకోర్టుకు నివేదించింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com